
'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 236

శుక్రవారం 17-11-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి
గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి

రెవెన్యూ వ్యవస్థలో చారిత్రాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి..
భూమి లేని పేదలకు భూమిని అందిస్తూ.. భూములపై సర్వ హక్కులు కల్పిస్తూ..
పేద రైతుల చిరకాల భూ సమస్యలకు చరమ గీతం పాడుతూ..

రాష్ట్రవ్యాప్తంగా 20,24,709 మంది పేదలకు లబ్ధి చేకూరుస్తూ.. 35,44,866 ఎకరాల్లో

పేదలకు భూ పంపిణీ.. భూములపై సర్వ హక్కుల కల్పన..

కొత్తగా భూముల అసైన్‌మెంట్ - భూమి లేని దళిత, బడుగు, బలహీన వర్గాలకు, పేదలకు.. ఇప్పటికే అసైన్డ్, గ్రామ సర్వీస్ ఇనామ్, ఎస్సీ కార్పొరేషన్ (LPS) భూములు పొందిన వారికి వాటిపై సర్వ హక్కులు కల్పించే భూ యాజమాన్య హక్కు పత్రాల పంపిణీ..
నేడు ఏలూరు జిల్లా నూజివీడులో లాంఛనంగా అందించనున్న గౌరవ ముఖ్యమంత్రి శ్రీ.వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి..
దళితుల ఆత్మ గౌరవం నిలబెడుతూ దళిత స్మశాన వాటికలకు భూమి కేటాయింపు..

1. కొత్తగా 42,307 మంది పేదలకు 46,463 ఎకరాల అసైన్డ్ భూముల పంపిణీ..

2. గతంలో ఎన్నడూ లేని విధంగా 9,064 ఎకరాల లంక భూముల్లో 17,768 మందికి అసైన్/లీజు పట్టాలు..

3. అసైన్‌మెంట్ చేసి 20 సం॥ పూర్తయిన 15,21,160 మంది రైతులకు 27,41,698 ఎకరాల అసైన్డ్ భూములపై సంపూర్ణ భూ హక్కులు..

4. గత ప్రభుత్వ నిర్వాకం కారణంగా 22-A నిషేధిత జాబితాలో చేర్చిన 1,61,584 మంది రైతులకు చెందిన 1,58,113 ఎకరాల గ్రామ సర్వీస్ ఇనామ్ భూములపై సంపూర్ణ హక్కులు కల్పిస్తూ 22-A నుండి తొలగింపు..

5. 1,563 గ్రామ సచివాలయాల పరిధిలో దళితుల స్మశాన వాటికలకు 951 ఎకరాల భూమి కేటాయింపు..

6. ల్యాండ్ పర్చేజ్ స్కీం (LPS) క్రింద ఎస్సీ కార్పొరేషన్ పంపిణీ చేసిన 22,837 ఎకరాల భూములపై 22,346 మందికి సర్వ హక్కులు.. వాళ్ల రుణాలు మాఫీ చేస్తూ..

7. దేశంలోనే మొదటి సారిగా అనేక రకాల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలనే ఉద్దేశ్యంతో "వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూరక్ష" క్రింద వందేళ్ల తర్వాత చేపట్టిన భూముల రీ సర్వే ద్వారా 17,460 రెవెన్యూ గ్రామాలకు గాను ఇప్పటి వరకు రెండు విడతల్లో 4 వేల గ్రామాల్లోని 42.6 లక్షల ఎకరాల్లో రీసర్వే పూర్తి.. 17.53 లక్షల మంది రైతులకు భూ హక్కు పత్రాల పంపిణీ.. 4.8 లక్షల మ్యూటేషన్లు.. 10.21 లక్షల కొత్త ల్యాండ్ సబ్ డివిజన్ల ఏర్పాటు.. 45 వేల సరిహద్దు వివాదాల పరిష్కారం.. రీసర్వే పూర్తయిన 4 వేల గ్రామాల్లో ఆ గ్రామ సచివాలయంలోనే రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం.. ఈరోజు 2వ విడత 2 వేల గ్రామాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం..



8. 20 ఏళ్లు పైబడ్డ (2003 కంటే ముందు) అసైన్డ్ (DKT) భూములను, గ్రామ సర్వీసు ఇనామ్ భూములను, LPS క్రింద ఎస్సీ కార్పొరేషన్ పంపిణీ చేసిన భూములను అన్నింటిని సెక్షన్ 22-A నుండి తొలగించి ఈ భూములను సర్వ హక్కులతో క్రయ విక్రయాలకు, రుణాలు పొందడానికి, తనఖా పెట్టుకోవడానికి, బహుమతిగా ఇవ్వడానికి, వారసత్వపు ఆస్తిగా అందించడానికి, వాళ్లకు ఆస్తిగా ఇస్తూ వెసులుబాటు కల్పించిన జగనన్న ప్రభుత్వం..

జగనన్న ప్రభుత్వం ఇప్పటికే పూర్తి చేసిన భూ పంపిణీ, భూ హక్కు కల్పన కార్యక్రమాలు..

9. రాష్ట్రవ్యాప్తంగా 71,800 ఎకరాల భూమి సేకరించి 17,005 వైఎస్సార్ జగనన్న కాలనీల్లో పేద అక్కచెల్లెమ్మలకు వారి పేర్ల మీదే 30.65 లక్షల ఇళ్ల పట్టాలు ఉచితంగా పంపిణీ.. 22 లక్షల ఇళ్ల నిర్మాణం..

10. 1,30,368 మంది గిరిజనులకు లబ్ధి చేకూరుస్తూ 2,87,710 ఎకరాల్లో అటవీ (RoFR) పట్టాలు.. 26,287 మంది గిరిజనులకు లబ్ధి చేకూరుస్తూ 39,272 ఎకరాలకు DKT పట్టాలు జారీ..

11. 2,06,315 ఎకరాల చుక్కల భూముల చిక్కులకు శాశ్వత పరిష్కారం ద్వారా 1,07,134 మంది రైతన్నలకు లబ్ధి..

12. 22,042 మందికి లబ్ధి చేకూరుస్తూ, గత ప్రభుత్వ నిర్వాకం కారణంగా నిషేధిత 22-A జాబితాలో చేరిన 33,494 ఎకరాల షరతులు గల పట్టాలను నిషేధిత 22-A జాబితా నుండి తొలగించి సర్వహక్కుల కల్పన..

జగనన్న ప్రభుత్వ విప్లవాత్మక చర్యలతో దశాబ్దాల భూ సమస్యలకు చరమగీతం - నూతన శకం ఆరంభం

శ్రీ. ధర్మాన ప్రసాద రావు, రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖామాత్యులు

గమనిక: రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ.వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి "పేదలకు భూ పంపిణీ.. భూములపై సర్వ హక్కుల కల్పన" కార్యక్రమాన్ని 17 నవంబర్, 2023 నాడు ఉదయం 10 గంటలకు ఏలూరు జిల్లా నూజివీడులో ప్రారంభిస్తారు.. ఈ కార్యక్రమాన్ని అన్ని ప్రముఖ న్యూస్ ఛానళ్లలో లైవ్ లో వీక్షించవచ్చు..

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

సంస్కృతి

**ప్రతి సంస్కృతిలో స్థానిక బొమ్మలుంటాయి.
మనకు కొండపల్లి, నిర్మల్...
బిహార్‌లో కన్యాపుత్రి.
అయితే బార్బీలు, బాట్‌మేన్‌ల హోరులో
అవన్నీ వెనుకబడ్డాయి.
కాని పిల్లలకు
ఎటువంటి బొమ్మలు ఇష్టమో
తెలిసిన టీచరమ్మ నమితా ఆజాద్
అక్కడ వాటికి మళ్లీ జీవం పోసింది.
కొలువు తీర్చింది.
సంస్కృతిలో భాగమైన
ఆ బొమ్మలను చూడగానే
పిల్లలకు ప్రాణం లేచివస్తుంది.
నమిత చేస్తున్న కృషి గురించి..**


● నమితా ఆజాద్

బిహార్ బొమ్మలట కొలువుకు సిద్ధమట

ఒక టీచరమ్మ కేవలం పిల్లలు ఆడుకునే బొమ్మల కోసం బంగారం లాంటి ప్రభుత్వ ఉద్యోగం వదిలేసింది. మనుషులు అలాగే ఉంటారు. ఏదైనా మంచి పని చేయాలంటే చేసి తీరుతారు. పట్నాకు చెందిన నమితా ఆజాద్‌ను వారం క్రితం బిహార్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక 'బిహార్ హస్తకళల పురస్కారం–2023'తో సత్కరించింది. పిల్లల బొమ్మల కోసం ఆమె తన జీవితాన్ని అంకితం చేయడమే అందుకు కారణం.

కన్యాపుత్రి బొమ్మలు

వీటిని బిహార్‌లో 'గుడియా' అని కూడా అంటారు. బిహార్‌లో చంపారన్ జిల్లాలో గుడ్డ పీలికలతో తయారు చేసే బొమ్మలు ఒకప్పుడు సంస్కృతిలో భాగంగా ఉండేవి. ముఖ్యంగా వర్షాకాలం వస్తే ఒక ప్రత్యేకమైన రోజున ఇంటి ఆడపిల్లలు ఈ బొమ్మలను విశేషంగా అలంకరించి దగ్గరలోని చెరువు ఒడ్డున నిమజ్జనం చేస్తారు. వారి అన్నయ్యలు ఆ బొమ్మలను వెలికి తెచ్చి చెల్లెళ్లకు ఇస్తారు. ఆ తర్వాత మిఠాయిలు పంచుకుంటారు. కన్యాపుత్రి బొమ్మలు ముఖ్యంగా అన్నాచెల్లెళ్ల అనుబంధానికి గుర్తుగా ఇళ్లల్లో ఉంచుతారు. పిల్లలు ఆడుకుంటారు. కొత్త పెళ్లి కూతురు అత్తారింటికి వచ్చేటప్పుడు తనతో పాటు కొన్ని అలంకరించిన కన్యాపుత్రి బొమ్మలు తెచ్చుకోవడం ఆనవాయితీ. 'నా చిన్నప్పుడు మా అమ్మ, అమ్మమ్మలు ఈ బొమ్మలు చూపిస్తూ ఎన్నో కథలు చెప్పడం జ్ఞాపకం' అంటుంది నమితా ఆజాద్.

వదలని ఆ గుడియాలు

నమితా ఆజాద్... చంపారన్ జిల్లాలో పుట్టి పెరిగింది. ఎం.ఏ. సైకాలజీ చేశాక చండీగఢ్‌లోని 'ప్రాచీన్ కళాకేంద్ర'లో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్‌లో మాస్టర్స్ చేసింది. ఆ సమయంలోనే ఆమెకు బాల్యంలో ఆడుకున్న కన్యాపుత్రి బొమ్మలు గుర్తుకొచ్చాయి. వాటిని తిరిగి తయారు చేయాలని అనుకుంది. ఇంట్లో పని చేసే ఇద్దరు మహిళలతో కొన్ని బొమ్మలు తయారు చేసి ఒక ప్రదర్శనలో ఉంచితే వెంటనే అమ్ముడుపోయాయి. ఆమెకు ఉత్సాహం వచ్చింది ఆ రోజు నుంచి ఒకవైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు కన్యాపుత్రి బొమ్మలను తయారు చేస్తూ హస్తకళల ప్రదర్శనలో ప్రచారం చేసింది.

ఎకో ఫ్రెండ్లీ బొమ్మలు



కన్యాపుత్రి బొమ్మలు ప్లాస్టిక్ లేనివి. అదీగాక మారణాయుధాలు, పాశ్చాత్య సంస్కృతి ఎరగనివి. మన దేశీయమైనవి. టైలర్ల దగ్గర పడి ఉండే పీలికలతో తయారు చేసేవి. అందుకే నమితా ఇప్పుడు 'ఎన్' క్రియేషన్స్ అనే సంస్థ పెట్టి 15 మంది మహిళలకు ఉపాధి కల్పించి ఈ బొమ్మలు తయారు చేస్తోంది. అంతేకాదు బిహార్ అంతా తిరుగుతూ వాటిని తయారు చేయడం మహిళలకు నేర్పించి వారికి ఉపాధి మార్గం చూపుతోంది.

2013 నాటికి వాటికి దక్కుతున్న ఆదరణ, వాటి అవసరం అర్థమయ్యాక ప్రభుత్వ టీచర్ ఉద్యోగాన్నే మానేసింది.

పిల్లల సైకాలజీ తెలిసి

పిల్లల సైకాలజీ తెలిసిన వారికి బొమ్మలు పిల్లల వికాసానికి ఎంతగా ఉపయోగపడతాయో తెలుస్తుంది అంటుంది నమితా. ఆ బొమ్మలతో పశు పక్ష్యాదులను తయారు చేస్తారు కనుక కవాటి వల్ల సమిష్టి కుటుంబాలు, మైక్రో కుటుంబాలు, అన్నా చెల్లెళ్ల బంధాలు, సామాజిక బంధాలు, పర్యావరణ స్పృహ అన్నీ తెలుస్తాయి అంటుంది నమితా. పిల్లలకు సామాజిక సందేశాలు ఇవ్వాలన్నా, కొన్ని పాఠాలు వారికి అర్థమయ్యేలా చెప్పాలన్నా ఈ బొమ్మలు చాలా బాగా ఉపయోగపడతాయని ఆమె టీచర్లకు నిర్వహించి వర్క్‌షాప్‌ల ద్వారా తెలియచేస్తోంది.

నమితా లాంటి సంస్కృతీ ప్రేమికులు ప్రతిచోటా ఉంటే సిసలైన పిల్లల బొమ్మలు వారిని సెల్‌ఫోన్ల నుంచి వీడియో గేమ్స్ నుంచి కాపాడుతాయి.

వంటిల్లు

ఊ...రించే సిరి

తిన్న తిండి ఒంటికి పట్టేలా చేయడంతో ఉసిరి ప్రముఖ పాత్ర పోషిస్తుంది. చర్మాన్ని యవ్వనంగా ఉంచడం, క్యాన్సర్ ముప్పుని తగ్గించడంలో ఉసిరి చేసే మేలు అంతా ఇంతా కాదు. ఇన్ని సుగుణాలు ఉన్న ఉసిరి ప్రస్తుతం మార్కెట్లో దండిగా దొరుకుతోంది. అందుకే ఊరించే ఉసిరిని మరింత రుచిగా ఇలా చేసుకోమని చెబుతోంది ఈ వారం మన వంటిల్లు...

మెంతి ఉసిరి కుర్మా



కావలసినవి: ఉసిరి కాయలు – పది; మెంతిఆకు –రెండు కట్టలు ; పచ్చిమిర్చి – రెండు; అల్లం – అంగుళం ముక్క; వెల్లుల్లి రెబ్బలు – ఐదు; ఉల్లిపాయలు – రెండు; టొమాటోలు – రెండు; నూనె – రెండు టేబుల్ స్పూన్లు; జీలకర్ర – అర టీస్పూను; సోంపు – అర టీస్పూను; వాము – టీస్పూను; ఇంగువ – చిటికెడు; పసుపు – అర టీస్పూను; గరం మసాలా – టీస్పూను; ధనియాల పొడి – టీస్పూను; జీలకర్ర – టీస్పూను; కొత్తిమీర తరుగు – రెండు టేబుల్ స్పూన్లు; ఉప్పు – రుచికి సరిపడా.

తయారీ: ఉసిరికాయలను శుభ్రంగా కడిగి ఉడికించాలి. ● ఉడికిన తర్వాత గింజలు తీసేసి, పెద్దసైజు ముక్కలుగా తరిగి పెట్టుకోవాలి ● ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, టొమాటోలను సన్నగా తరిగి పెట్టుకోవాలి. అల్లం వెల్లుల్లిని సన్నగా తరగాలి ● మెంతిఆకును కడిగి, సన్నగా తరిగి పెట్టుకోవాలి ● మందపాటి బాణలిలో నూనెవేసి వేడెక్కనివ్వాలి ● నూనె కాగిన తరువాత, మీడియం మంట మీద ఉంచి..జీలకర్ర, సోంపు, వాము వేయాలి ● ఇవి చిటపటలాడాక పచ్చిమిర్చి, అల్లం, వెల్లుల్లి తరుగు వేసి నిమిషం పాటు వేగనివ్వాలి ● ఇప్పుడు ఉల్లిపాయ ముక్కలు వేసి ఐదు నిమిషాలు మగ్గనియ్యాలి ● ఉల్లిపాయ ముక్కలు చక్కగా వేగిన తరువాత టొమాటో ముక్కలు కొద్దిగా నీళ్లు పోసి మూతపెట్టి మగ్గనివ్వాలి ● రెండు నిమిషాల తరువాత మూత తీసి పసుపు, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి ● మరో ఐదు నిమిషాలు మగ్గిన తరువాత టొమాటో ముక్కలు చక్కగా మెత్తబడతాయి. ఇప్పుడు మెంతిఆకు తరుగు వేసి కలపాలి ● సన్నని మంట మీద కలుపుతూ ఉంటే మెంతిఆకు ఇట్టే మగ్గిపోతుంది ● మెంతిఆకు మగ్గిన తరువాత గరం మసాలా, జీలకర్ర, ధనియాల పొడులు వేయాలి ● వెంటనే ఉసిరికాయ ముక్కలను వేసి మసాలాలు ముక్కలకు పట్టేలా కలపాలి ● చివరిగా రెండు టేబుల్ స్పూన్లు నీళ్లు, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి. ఐదు నిమిషాలు మూతపెట్టి మగ్గనిస్తే మెంతి ఉసిరి కుర్మా రెడీ ● చపాతీ, రోటీ, అన్నం, సలాడ్‌లోకి ఈ కుర్మా మంచి కాంబినేషన్.

ఆమ్ల ఛుందా



కావలసినవి: ఉసిరికాయలు – అరకేజీ; బెల్లం – అరకేజీ; అల్లం – చిన్నముక్క; బ్లాక్‌సాల్ట్ – ఒకటిన్నర టీస్పూన్లు; మిరియాలు – టీస్పూను; యాలక్కాయలు – ఎనిమిది; దాల్చిన చెక్క – అంగుళం ముక్క; పసుపు – టీస్పూను; కశ్మీరీ కారం – ఒకటిన్నర టీస్పూన్లు; గరం మసాలా – అర టీస్పూను; నిమ్మకాయలు – రెండు.

తయారీ: ఉసిరికాయలను శుభ్రంగా కడిగి, ఆవిరి మీద మెత్తగా (10 నిమిషాలు) ఉడికించాలి ● అల్లాన్ని సన్నగా తురిమి పెట్టుకోవాలి ● యాలక్కాయలు, మిరియాలను విడివిడిగా దంచి పెట్టుకోవాలి ● ఉడికిన ఉసిరికాయలు చల్లారాక గింజలు తీసి సన్నగా తురుముకోవాలి. ●ఉసిరి తురుములో బెల్లం వేసి మీడియం మంట మీద పెట్టాలి ●అడుగంటకుండా కలుపుతూ ఉండాలి. నీరు పైకి తేలగానే అల్లం తురుము, బ్లాక్ సాల్ట్, మిరియాల పొడి, యాలకుల పొడి వేయాలి ● దాల్చిన చెక్కను తుంచి వేయాలి ● చివరిగా పసుపు వేసి కలుపుతూ ఉడికించాలి ● మీడియం మంట మీదే ఉంచి కలుపుతూ మిశ్రమం దగ్గర పడుతున్నప్పుడు కారం, గరంమసాలా వేసి కలపాలి. ● బాగా కలిసిన తరువాత దించేసి, నిమ్మరసం పిండితే ఆమ్లా ఛుందా రెడీ.

గమనిక: గాజు లేదా పింగాణీ పాత్రల్లో నిల్వ చేస్తే ఎక్కువ కాలం తాజాగా ఉంటుంది.

స్పైసీ పచ్చడి



కావలసినవి: ఉసిరి కాయలు – ఆరు; పచ్చి శనగపప్పు – పావు కప్పు; పచ్చిమిర్చి – మూడు; వెల్లుల్లి రెబ్బలు – నాలుగు; ఉప్పు – రుచికి సరిపడా; నూనె – టీస్పూను; ఆవాలు – అర టీస్పూను; జీలకర్ర – అర టీస్పూను; పసుపు – పావు టీస్పూను; ఇంగువ – చిటికెడు; కరివేపాకు – రెండు రెమ్మలు; కొత్తిమీర తరుగు – కాస్తంత

తయారీ: పచ్చిశనగపప్పుని శుభ్రంగా కడిగి నాలుగు గంటలపాటు నానబెట్టుకోవాలి ● ఉసిరికాయలను శుభ్రంగా కడిగి గింజలు తీసేసి ముక్కలుగా తరుగు కోవాలి. ● ఉసిరికాయ ముక్కలు, నానిన శనగపప్పు, పచ్చిమిర్చి, వెల్లుల్లి, రుచికి సరిపడా ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి ●అవసరాన్ని బట్టి కొద్దిగా నీళ్లుపోసి గ్రైండ్ చేయాలి ● గ్రైండ్ అయిన పచ్చడిని గిన్నెలోకి తీసుకోవాలి ● బాణలిలో నూనె వేసి, ఆవాలు జీలకర్ర, ఇంగువ, పసుపు, కరివేపాకు వేసి తాలింపు పెట్టాలి ● ఈ తాలింపుని పచ్చడిలో వేసి కలపాలి. చివరిగా కొత్తిమీర తరుగు వేసి కలిపితే స్పైసీ పచ్చడి రెడీ. చపాతీ, రోటీ, అన్నం లోకి ఈ పచ్చడి చాలా బావుంటుంది.

పంచతంత్రం

81 స్థానాలకు మహిళా అభ్యర్థులు కరువు

● రాజస్తాన్ ఎన్నికల బరిలో తగ్గిన మహిళల సంఖ్య
● కేవలం 183 మందికి మాత్రమే అవకాశం
● వీరిలో బీజేపీ నుంచి 20 మంది, కాంగ్రెస్ తరఫున 28 మంది


సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్, బీజేపీ ఈసారి రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు పెద్ద సంఖ్యలో టికెట్లివ్వలేదు. నారీ శక్తి వందన్ చట్టాన్ని పార్లమెంటులో ఆమోదించినప్పుడు కాంగ్రెస్ సహా ఇతర పార్టీలు మద్దతిచ్చాయి. సీట్ల కేటాయింపులో మాత్రం ఆ స్ఫూర్తి ప్రతిఫలించలేదు. ఈ నెల 25న పోలింగ్ ప్రక్రియకు సిద్ధమైన రాజస్తాన్‌లోని 81 స్థానాల్లో ఒక్క మహిళా అభ్యర్థి కూడా బరిలో లేరని గణాంకాలు చెబుతున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 200 స్థానాలకు గాను మొత్తం 1,875 మంది అభ్యర్థులు బరిలో ఉండగా వారిలో 1,692 మంది పురుషులు, 183 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ 28 (14%) మంది మహిళా అభ్యర్థులను నిలబెట్టగా, బీజేపీ 20 (10%) మంది మహిళా అభ్యర్థులను బరిలోకి దింపింది. కాగా 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 189 మంది మహిళా అభ్యర్థులు పోటీ చేయగా 24 మంది విజయం సాధించారు. ఈసారి బరిలో బీజేపీకి చెందిన ప్రముఖ మహిళా అభ్యర్థులలో మాజీ సీఎం వసుంధర రాజే సింధియా, బికనీర్ ఎమ్మెల్యే సిద్ధి కుమారి, మాజీ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అనితా భాదేల్, రాజ్‌సమంద్ ఎమ్మెల్యే దీప్తి మహేశ్వరి, రాజ్‌సమంద్ ఎంపీ దియా కుమారి ఉన్నారు. కాగా, కాంగ్రెస్‌లో మాల్వీయా నగర్ నుంచి అర్చన శర్మ, చోము నుంచి షికా మీల్ బరాలా, ప్రస్తుత మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి మమతా భూపేష్, కామా నుంచి జాహిదాలకు ఉన్నారు. ఈ మహిళా అభ్యర్థులలో ఎక్కువ మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు కాగా... అల్వార్‌లోని రామ్‌గఢ్ జిల్లా నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే సఫియా జుబేర్ స్థానంలో ఆమె భర్త జుబేర్ అహ్మద్‌కు కాంగ్రెస్ టిక్కెట్ ఇచ్చింది.

కాంగ్రెస్, బీజేపీ హోరాహోరీగా తలపడ్డ ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల పోరు తుది దశకు చేరింది. రెండో, చివరి దశలో 70 స్థానాలకు శుక్రవారం పోలింగ్ జరగనుంది. రైతు అనుకూల ప్రభుత్వమనే ముద్రతో అధికారం నిలుపుకుంటామని కాంగ్రెస్ ధీమాగా ఉంది. వరి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు అనేకానేక సంక్షేమ పథకాలు తమకు శ్రీరామరక్ష అని సీఎం భూపేశ్ బఘేల్ అంటున్నారు. ప్రభుత్వ వ్యతిరేకతతో పాటు సీఎం, మంత్రులపై అవినీతి ఆరోపణలు తమకు కలిసొస్తాయని బీజేపీ భావిస్తోంది. ఎన్నికల ప్రచారం కోసం దుబాయ్ బెట్టింగ్ యాప్ నుంచి 508 కోట్ల దాకా ముడుపులు అందుకున్నారంటూ బఘేల్‌పై వచ్చిన ఆరోపణలు ఓటర్లపై గట్టి ప్రభావం చూపుతాయని ఆశిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో గత మూడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ఓసారి చూస్తే...

ఎవరి ధీమా వారిదే!


ఆసక్తికరంగా ఛత్తీస్‌గఢ్ పోరు ● గెలుపు తమదేనంటున్న కాంగ్రెస్, బీజేపీ ● హోరాహోరీగా సాగిన ఎన్నికల ప్రచారం



పార్టీ	సీట్లు	ఓట్లు	ఓట్ల శాతం
బీజేపీ	50	4,333,934	40.3
కాంగ్రెస్	38	4,150,377	38.6
బీఎస్పీ	2	656,210	6.1
ఎన్సీపీ	0	56,257	0.5
ఇతరులు	0	1,548,409	14.4

2008


అసెంబ్లీ ఎన్నికల వేడి మొదలైన తొలినాళ్లలో అధికార బీజేపీ, కాంగ్రెస్ మధ్య పోటాపోటీ నడిచింది. కానీ పోలింగ్ సమీపించే కొద్దీ పరిస్థితి బీజేపీకి అనుకూలంగా మారుతూ వచ్చింది. ముఖ్యంగా సీఎం రమణ్‌సింగ్ మిస్టర్ క్లీన్ ఇమేజీ ఆ పార్టీకి బాగా కలిసొచ్చింది. దాంతో ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించింది. 50 స్థానాలు సాధించి అధికారం నిలుపుకుంది. ఇటు బస్తర్ మొదలుకుని అటు సర్గుజా దాకా మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాలన్నింట్లోనూ బీజేపీ హవా సాగింది. అక్కడి 26 స్థానాలకు గాను ఆ పార్టీ ఏకంగా 23 చోట్ల నెగ్గింది! ప్రజల్లో బాగా ఆదరణ ఉన్న కాంగ్రెస్ నాయకుడు అజిత్ జోగి సుడిగాలి ప్రచారం చేసినా లాభం లేకపోయింది. ఆ పార్టీ చివరికి 38 సీట్లతో సరిపెట్టుకుంది. దానికి పోలైన ఓట్లు కూడా 38 శాతమే కావడం విశేషం. బీజేపీ 40 శాతం ఓట్లు సాధించింది. బీఎస్పీ రెండు సీట్లు నెగ్గింది.



పార్టీ	సీట్లు	ఓట్లు	ఓట్ల శాతం
బీజేపీ	49	5,365,272	41.0
కాంగ్రెస్	39	5,267,698	40.3
బీఎస్పీ	1	558,424	4.3
ఇతరులు	1	1,843,315	14.1
ఎన్సీపీ	0	39,124	0.3

2013

ముఖ్యమంత్రిగా రమణ్‌సింగ్ హ్యాట్రిక్ కొట్టారు. 2003 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని ఆయన విజయ పథంలో నడిపి తొలిసారి సీఎం అయ్యారు. అప్పట్నుంచీ 15 ఏళ్లపాటు రాష్ట్రంలో ఆయన హవా సాగింది. రమణ్ పరిపాలనా శైలి కాంగ్రెస్ నేతల నుంచి కూడా ప్రశంసలు అందుకోవడం విశేషం! 2008 ఎన్నికల విజయం తర్వాత ఆయన అమలు చేసిన ఆహార భద్రత పథకం ఛత్తీస్‌గఢ్‌లో 60 శాతం మంది కనీసావసరాలు తీర్చింది. దాంతో ప్రజలు మరోసారి రమణ్ పాలనకే ఓటేశారు. బీజేపీకి 49 సీట్లు రాగా కాంగ్రెస్‌కు 39 స్థానాలొచ్చాయి. మొత్తమ్మీద బీజేపీకి 41 శాతం ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 40 శాతం పోలయ్యాయి. బీఎస్పీకి ఒక స్థానం దక్కింది.



పార్టీ	సీట్లు	ఓట్లు	ఓట్ల శాతం
కాంగ్రెస్	50	4,333,934	40.3
బీజేపీ	38	4,150,377	38.6
ఇతరులు	2	656,210	6.1
బీఎస్పీ	0	56,257	0.5
ఎన్సీపీ	0	1,548,409	14.4

2018

సుదీర్ఘంగా అధికారంలో ఉండటంతో ప్రభుత్వ వ్యతిరేకత బీజేపీకి 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బాగా ప్రతికూలంగా మారింది. దీనికి తోడు రైతు రుణ మాఫీని పాక్షికంగా అమలు చేసి చేతులెత్తేయడం కూడా రమణ్‌సింగ్ సర్కారుకు బాగా ప్రతికూలంగా మారింది. మార్పుకు పట్టం కట్టండంటూ కాంగ్రెస్ చేసిన ప్రచారానికి జనం జై కొట్టారు. దాంతో హస్తం పార్టీ 68 సీట్లతో ఘన విజయం సాధించింది. బీజేపీ కంచుకోటలైన సర్గుజా వంటి ప్రాంతాల్లో కాంగ్రెస్ ఏకంగా క్లీన్‌స్వీప్ చేయడం విశేషం! దాంతో 15 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ సరిగ్గా 15 సీట్లకు పరిమితమై ఘోర పరాజయం మూటగట్టుకుంది. కాంగ్రెస్ ఏకంగా 43 శాతం ఓట్లు కొల్లగొట్టగా బీజేపీ కేవలం 33 శాతంతో ఘోరంగా చతికిలపడింది. ఇక బీఎస్పీ మరోసారి రెండు స్థానాలతో రాష్ట్రంలో ఉనికి నిలుపుకుంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

తెలంగాణ

నేడు కాంగ్రెస్ మేనిఫెస్టో

నేడు గాంధీభవన్‌లో విడుదల చేయనున్న ఖర్గే

సాక్షి, హైదరాబాద్: ప్రజాకర్షక హామీలతో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో సిద్ధమైంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకివ్వనున్న హామీలతో రూపొందించిన ఎన్నికల ప్రణాళికను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విడుదల చేయనున్నారు. ఇప్పటికే ఆరు గ్యారంటీల పేరుతో మహిళల ఓట్లను ఆకర్షించే పనిలో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. ఎన్నికల మేనిఫెస్టోలోనూ మహిళలకే ప్రాధాన్యమివ్వనుంది. ముఖ్యంగా గత కాంగ్రెస్ ప్రభుత్వాలు అమలు చేసిన అమ్మ హస్తం, అభయ హస్తం పథకాలను మళ్లీ తెస్తామనే హామీ ఇవ్వనుంది. శుక్రవారం ఉదయం 11 గంటలకు గాంధీభవన్‌లో ఖర్గే పార్టీ మేనిఫెస్టోను విడుదల చేస్తారని, మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కో చైర్మన్ గడ్డం ప్రసాద్‌కుమార్‌లతో పాటు మేనిఫెస్టో కమిటీ సభ్యులు, టీపీసీసీ కీలక నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి.

నేడు రాహుల్, ఖర్గే పర్యటన

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ నేడు(శుక్రవారం) రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఇప్పటికే ఖరారైన షెడ్యూల్ మేరకు పినపాక, నర్సంపేట, వరంగల్ ఈస్ట్, వెస్ట్‌తోపాటు రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లో రాహుల్ రోడ్‌షోలు, పాదయాత్రలు, కార్నర్‌మీటింగ్‌లలో పాల్గొననున్నారు. బెంగళూరు నుంచి ప్రత్యేక విమానంలో ఉదయం 10 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి రానున్న ఖర్గే 11 గంటలకు గాంధీభవన్‌కు చేరుకుని టీపీసీసీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేస్తారు. తర్వాత సాయంత్రం 4 గంటలకు కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. రాత్రి హైదరాబాద్‌లోనే ఖర్గే బస చేసి శనివారం ఉదయం 10:30 గంటలకు బెంగళూరు వెళ్లనున్నారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

అమిత్ షా చేతుల మీదుగా బీజేపీ మేనిఫెస్టో

రేపు సకల జనుల విజయ సంకల్ప సభల్లో పాల్గొననున్న ఆ పార్టీ అగ్రనేత

సాక్షి, హైదరాబాద్: బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా శనివారం రాష్ట్రంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఆరోజు ఉదయం హైదరాబాద్‌లో బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోను ఆయన విడుదల చేస్తారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా...సకల జనుల విజయ సంకల్ప సభల (బహిరంగ సభలు) పేరిట నిర్వహిస్తున్న మూడు సభల్లో అమిత్‌షా పాల్గొంటారు. శనివారం ఉదయం 10 గంటలకు గద్వాలలో, మధ్యాహ్నం 12 గంటలకు నల్లగొండలో, 2 గంటలకు వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలో మొత్తం మూడు బహిరంగ సభల్లో ఆయన ప్రసంగిస్తారు. అదేరోజు సాయంత్రం సికింద్రాబాద్‌లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులతో అమిత్ షా ప్రత్యేకంగా సమావేశమవుతారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బీజేపీకి మద్దతుగా రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల్లో చేపట్టబోయే ప్రచారం, ప్రాధాన్యతాంశాలపై ఆయన చర్చిస్తారని పార్టీ వర్గాల సమాచారం. బీజేపీ బీసీ సీఎం నినాదంతో పాటు, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేసేందుకు మోదీ ప్రభుత్వం తీసుకున్న చొరవ, చేపడుతున్న చర్యలను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ, ఇతర నేతలకు వివరిస్తారని తెలుస్తోంది. బీసీ, ఎస్సీ ఇతర వర్గాల ఓట్లను ఆకట్టుకునేందుకు ఈ ప్రచారం దోహదపడుతుందని బీజేపీ నేతలు అంచనా వేస్తున్నారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ మేనేజర్‌కు ఐదేళ్ల జైలు

సాక్షి, హైదరాబాద్: ప్రైవేట్‌వ్యక్తులతో కలిసి బ్యాంక్‌ను మోసం చేసిన కేసులో బ్యాంక్ ఆఫ్ ఇండియా(బీవోఐ) మాజీ బ్రాంచి మేనేజర్ గంగాధర్‌కు సీబీఐ కోర్టు ఐదేళ్ల కఠిన కారాగారశిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. అలాగే, రూ.60 వేల జరిమానా విధించింది. మరో ఇద్దరు నిందితులు పి.రాజశేఖర్, గడ్డిగోపుల సత్యానందరావుకు సంవత్సరం కఠిన కారాగారశిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తున్నట్లు తీర్పులో పేర్కొంది. హైదరాబాద్ సరూర్‌నగర్‌లోని బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిలో గంగాధర్ మేనేజర్‌గా పనిచేసే సమయంలో రాజశేఖర్, సత్యానందరావు వద్ద నుంచి తప్పుడుపత్రాలు తీసుకుని రూ.73.80 లక్షల గృహరుణాన్ని మంజూరు చేశారు. ఆ మొత్తాన్ని నిందితులు తిరిగి చెల్లించకపోవడంతో సీబీఐ కేసు నమోదు చేసింది. విచారణ జరిపి చార్జిషీట్ దాఖలు చేసింది. వాదనలు విన్న న్యాయస్థానం నిందితుల మోసం రుజువు కావడంతో శిక్షలు ఖరారు చేస్తూ తీర్పు వెలువరించింది.

నేడు కాంగ్రెస్‌లోకి విజయశాంతి

సాక్షి, హైదరాబాద్: బీజేపీకి రాజీనామా చేసిన మాజీ ఎంపీ విజయశాంతి నేడు (శుక్రవారం) కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. కాగా, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీలు శుక్రవారం హైదరాబాద్‌కు రానున్నారు. ఆ ఇద్దరి నేతలలో ఎవరో ఒకరి సమక్షంలో ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరతారని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి.


'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్య్రానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 236

శుక్రవారం 17-11-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATI | VISAKHAPATNAM | WARANGAL

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 307	నిఫ్టీ ▲ 90
65,982	19,765

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	14,093	▽ 11
డోజోన్స్	38,875	▽ 117
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,411	▲ 76
డాక్స్	15,787	▲ 38
షాంఘై	3,051	▽ 22
నికాయ్	33,424	▽ 95

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	60,505
బంగారం (99.5 స్వచ్ఛత)	60,263
వెండి (కేజీ)	72,855

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.43	84.10
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	101.46	104.81
€	యూరో	ఒకటి	88.64	91.77
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.21	55.88
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.79	55.10
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.60	62.59
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.24	22.86
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	21.76	23.56
¥	చైనా యువాన్	ఒకటి	10.36	12.43

స్టాండర్డ్ గ్లాస్‌లో అసాహీ పెట్టుబడి

జపాన్ కంపెనీ నుంచి రూ.200 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గ్లాస్ లైన్డ్ ఎక్విప్‌మెంట్ తయారీలో ఉన్న హైదరాబాద్ కంపెనీ స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీలో ఇంజనీర్డ్ గ్లాస్ సిస్టమ్స్ రంగంలో ఉన్న జపాన్ దిగ్గజం అసాహీ గ్లాస్‌ప్లాంట్ (ఏజీఐ జపాన్) రూ.200 కోట్లు పెట్టుబడి చేసింది. తద్వారా ఏజీఐ జపాన్, జీఎల్ హాకో, అనుబంధ కంపెనీలకు స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీలో మైనారిటీ వాటా దక్కనుంది. జపనీస్ విపణిలోకి తమ కంపెనీ ప్రవేశాన్ని ఏజీఐ జపాన్ సులభతరం చేస్తుందని స్టాండర్డ్ గ్రూప్ ఎండీ నాగేశ్వర రావు కందుల తెలిపారు. ఏజీఐతోపాటు ఆ సంస్థకు చెందిన కస్టమర్లు ఆశించే స్థాయిలో కఠిన నాణ్యతా ప్రమాణాలకు లోబడి ప్రైవేట్ లేబుల్ ఏర్పాట్లు, సహ–బ్రాండింగ్, విడిభాగాల సరఫరాను ఈ భాగస్వామ్యంలో భాగంగా అమలు చేస్తారు. జీఎల్ హాకో ఉత్పత్తుల ఉనికిని విస్తృతం చేయడంతోపాటు గ్లాస్–లైన్డ్ రియాక్టర్‌ల భద్రతను పెంపొందిస్తూ ఎస్‌ఈఎఫ్ గ్లాస్ టెక్నాలజీని రూపొందించాలని స్టాండర్డ్ గ్రూప్ నిర్ణయించింది.

భారీ ప్లాంటు ఏర్పాటు..

ఏజీఐ జపాన్ సీఈవో యసుయుకి ఇకేడ 2023 మార్చి నుంచి స్టాండర్డ్ గ్లాస్ నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. అంతర్జాతీయంగా తమ సంస్థ విస్తరణకు ఇకేడ దోహదం చేస్తున్నారని నాగేశ్వర రావు తెలిపారు. ఈ పెట్టుబడి వ్యాపార అవకాశమేగాక అసాధారణ వ్యాపార భాగస్వామ్యం పెంపొందించి, వాటాదారులకు గణనీయంగా రాబడిని అందిస్తుందన్నారు. స్టాండర్డ్ గ్లాస్ హైదరాబాద్ సమీపంలో 36 ఎకరాల్లో భారీ స్థాయిలో గ్లాస్ ఎక్విప్‌మెంట్ తయారీ ప్లాంటును నిర్మిస్తోంది. వెల్డింగ్ రోబోలు, సెమీ ఆటోమేటెడ్ కట్టింగ్, బెండింగ్, వెల్డింగ్ మెషినరీ, అధునాతన వెల్డింగ్ పవర్ సోర్సెస్‌తో సహా అత్యాధునిక మెషినరీని ఏర్పాటు చేస్తున్నారు. ఉత్పత్తి నాణ్యతను పెంచడం, తక్కువ సమయంలో తయారీ లక్ష్యంగా సాంకేతికతను జోడిస్తున్నారు. 2012లో ప్రారంభమైన స్టాండర్డ్ గ్రూప్ టర్నోవర్ రూ.750 కోట్లు.

15% పెరిగిన సోనాలిక ట్రాక్టర్స్ మార్కెట్ వాటా



న్యూఢిల్లీ: సోనాలిక ట్రాక్టర్స్ వార్షిక ప్రాతిపదికన ఏప్రిల్–అక్టోబర్ కాలంలో తన మార్కెట్ వాటాను 15% పెంచుకుంది. అక్టోబర్‌లో రికార్డు స్థాయిలో 18,002 ట్రాక్టర్ల విక్రయాలు విక్రయించింది. పండుగ సీజన్ సందర్భంగా 'హెవీడ్యూటీ ధమాకా', ఆకర్షణీయమైన ఫైనాన్స్ స్కీంల ప్రకటనలతో హెవీడ్యూటీ ట్రాక్టర్ల అమ్మకాలు భారీగా పెరిగాయి. దేశీయ ట్రాక్టర్ పరిశ్రమలో గత ఆరు నెలల్లో ఈ స్థాయి వృద్ధి కనబరిచిన బ్రాండ్ తమదేనని సంస్థ ఎండీ రమణ్ మిట్టల్ తెలిపారు.

క్రెడిట్ కార్డు.. కొంచెం కష్టమే!

ఆర్‌బీఐ కొత్త నిబంధనలు



ముంబై: క్రెడిట్ కార్డులు, వ్యక్తిగత రుణ మంజూరీల వంటి అన్‌సెక్యూర్డ్ రుణాలు ఇకపై మరింత కఠినతరం కానున్నాయి. ఈ విషయమై బ్యాంకులకు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థలకు (ఎన్‌బీఎఫ్‌సీ) నిబంధనలను కఠినతరం చేస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆదేశాలు జారీ చేసింది. అన్‌సెక్యూర్డ్ వ్యక్తిగత రుణ మంజూరీలు ఇటీవలి కాలంలో పెరుగుతుండడం, ఈ నేపథ్యంలో ఆయా రుణ మంజూరీ పట్ల బ్యాంకింగ్ జాగరూకత పాటించడం ఆర్‌బీఐ తాజా ఆదేశాల లక్ష్యం. హై రిస్క్ వెయిటేజ్ అన్‌సెక్యూర్డ్ వినియోగ రుణాలపై 25 శాతం పెంచాలన్నది ఈ ఆదేశాల ప్రధానాంశం. అంటే కొన్ని వ్యక్తిగత రుణాల విషయంలో బ్యాంకింగ్ కేటాయింపులు మరింత పెంచాల్సి ఉంటుందన్నమాట. అటువంటి క్రెడిట్ మరింత ఖరీదైనదిగా మారడంతో ఇది బ్యాంకుల రుణ సామర్థ్యాన్ని పరిమితం చేస్తుంది. తాజా నిర్ణయం వల్ల క్రెడిట్ కార్డ్ రుణాలపై రిస్క్ వెయిటేజ్ బ్యాంకులపై 150 శాతానికి, ఎన్‌బీఎఫ్‌సీలపై 125 శాతానికి పెరుగుతుంది. కాగా గృహ రుణాలు, విద్యా రుణాలు, వాహన రుణాలు, బంగారం, బంగారు ఆభరణాల ద్వారా పొందే రుణాలపై కొత్త నిబంధనలు వర్తించవని రిజర్వ్ బ్యాంక్ సర్క్యులర్‌లో స్పష్టం చేసింది. 2023 సెప్టెంబర్ చివరి నాటికి పర్సనల్ లోన్‌ల విభాగంలో బ్యాంక్ రుణ బకాయిలు రూ. 48,26,833 కోట్లు. ఇది 2022 అదే నెలతో పోలిస్తే దాదాపు 30 శాతం పెరిగింది.

యూకో కస్టమర్ల ఖాతాల్లోకి రూ. 820 కోట్లు

- సాంకేతిక సమస్యతో బదిలీ
- రివర్స్ చేసే ప్రయత్నాల్లో బ్యాంకు సిబ్బంది

న్యూఢిల్లీ: సాంకేతిక సమస్య కారణంగా ప్రభుత్వ రంగ యూకో బ్యాంకులోని పలువురు కస్టమర్ల ఖాతాల్లోకి ఏకంగా రూ. 820 కోట్లు పొరపాటున జమయ్యాయి. దీన్ని గుర్తించిన బ్యాంకు రికవరీ ప్రక్రియ ప్రారంభించింది. ఆయా ఖాతాదారుల అకౌంట్లను బ్లాక్ చేసి రూ. 649 కోట్లు (సుమారు 79 శాతం) మొత్తాన్ని రాబట్టినట్లు గురువారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు బ్యాంకు తెలియజేసింది. మిగతా రూ. 171 కోట్లు కూడా రాబట్టే ప్రయత్నాల్లో ఉన్నామని, తగు చర్యలు తీసుకునేందుకు ఈ విషయాన్ని దర్యాప్తు సంస్థలకు కూడా తెలియజేసినట్లు వివరించింది. ఈ సాంకేతిక సమస్య మానవ తప్పిదం వల్ల జరిగిందా లేక హ్యాకింగ్ ప్రయత్నమేదైనా జరిగిందా అనే అంశంపై బ్యాంకు స్పష్టత నివ్వలేదు. నవంబర్ 10–13 మధ్య ఇమ్మీడియెట్ పేమెంట్ సర్వీస్ (ఐఎంపీఎస్)లో సాంకేతిక లోపం కారణంగా ఇతర బ్యాంకులకు చెందిన కస్టమర్లు చేపట్టిన కొన్ని లావాదేవీల్లో తమ బ్యాంకు కస్టమర్ల ఖాతాల్లోకి నగదు క్రెడిట్ అయినట్లు బ్యాంకు తెలిపింది. అయితే, ఆయా బ్యాంకుల నుంచి తమకు నిధులు అందకుండానే ఈ లావాదేవీలు చోటు చేసుకున్నాయని గుర్తించినట్లు పేర్కొంది. దీంతో తగు చర్యలు ప్రారంభించినట్లు వివరించింది.

మైగ్రేన్ నివారణకు పరికరం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పార్శ్వపు నొప్పి (మైగ్రేన్) నివారణకు ఔషధ రహిత పరిష్కారాన్ని ఫార్మా రంగ సంస్థ డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ తీసుకువచ్చింది. నెరివియో పేరుతో చేతికి ధరించే పరికరాన్ని ప్రవేశపెట్టింది.



యూఎస్ ఎఫ్‌డీఏ అనుమతి ఉందని, 12 ఏళ్లు, ఆపై వయసున్న వారు వైద్యుల సిఫార్సు మేరకు దీన్ని వాడొచ్చని కంపెనీ గురువారం ప్రకటించింది. తల నొప్పి ప్రారంభమైన 60 నిమిషాలలోపు వాడాలి. లేదా పార్శ్వపు నొప్పి నివారణకు ప్రతి రెండు రోజులకు ఒకసారి ఉపయోగించాల్సి ఉంటుంది.

ఐటీ, ఆటో, ఫార్మా షేర్ల పరుగులు

కనిష్టాల నుంచి కోలుకున్న సూచీలు

ముంబై: ఐటీ, ఆటో, ఫార్మా, వినిమయ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు రెండో రోజూ లాభాలు ఆర్జించాయి. విదేశీ ఇన్వెస్టర్ల తాజా కొనుగోళ్లు, అమెరికా ద్రవ్యోల్బణ దిగిరావడం, బాండ్లపై రాబడులు తగ్గుదల పరిణామాలు కలిసొచ్చాయి. ఫలితంగా సెన్సెక్స్ 307 పాయింట్లు పెరిగి 65,982 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 90 పాయింట్లు బలపడి 19,765 వద్ద నిలిచింది. ఉదయం ఫ్లాటుగా మొదలైన సూచీలు ప్రారంభంలోనే నష్టాల్లోకి జారుకున్నాయి. అయితే దేశీయంగా నెలకొన్న సానుకూల పరిణామాలతో నష్టాలు అధిగమించి లాభాల బాటపట్టాయి. ఒక దశలో సెన్సెక్స్ 682 పాయింట్లు ర్యాలీ చేసి 66,358 వద్ద, నిఫ్టీ 200 పాయింట్లు ఎగసి 19,875 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకున్నాయి. ట్రేడింగ్ చివర్లో మరోసారి అమ్మకాల ఒత్తిడి నెలకొనడంతో సూచీల లాభాలు కొంతమేర తగ్గాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అర శాతం చొప్పున రాణించాయి.

- ఈకామ్, ఇన్‌స్టా ఈఎంఐ కార్డుల ద్వారా రుణాల జారీ, పంపిణీలను తక్షణమే నిలిపివేయాలంటూ ఆర్‌బీఐ ఆదేశాలతో బజాజ్ ఫైనాన్స్ షేరు ట్రేడింగ్ ప్రారంభంలో 4% నష్టపోయి రూ.6937 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. అయితే కనిష్టాల వద్ద కొనుగోళ్ల మద్దతు, ఈక్విటీ మార్కెట్ ర్యాలీ అంశాలు కలిసిరావడంతో షేరు బౌన్స్‌బ్యాక్ అయ్యింది. ట్రేడింగ్ నష్టాలు భర్తీ చేసుకొని చివరికి 2% లాభంతో రూ.7366 వద్ద స్థిరపడింది.



- ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపు అంచనాలు సన్నగిల్లడంతో ఎగుమతి ఆధారిత రంగ ఐటీ షేర్లకు భారీ డిమాండ్ నెలకొంది. బీఎస్‌ఈలో ఈ రంగ షేర్లకు ప్రాతినిధ్యం వహించే బీఎస్‌ఈ ఐటీ ఇండెక్స్ రెండున్నర శాతం ర్యాలీ చేసింది. సెన్సెక్స్ 30 షేర్లలో టీసీఎస్(3%), హెచ్‌సీఎల్ టెక్(2.80%), టెక్ మహీంద్రా(2.70%), ఇన్ఫోసిస్(2.50%)లు తొలి నాలుగు స్థానాలు దక్కించుకున్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
17-11-2023	
విశాఖ	525-00
చిత్తూరు	603-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	72.00
16-11-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	520-00
వరంగల్	522-00
రిటైల్ ధర	5.80

టాటా టెక్నాలజీస్ @ రూ. 475-500

ఈ నెల 22–24 మధ్య ఐపీవో

ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, డిజిటల్ సొల్యూషన్స్ అందించే ఇంజినీరింగ్ సర్వీసుల కంపెనీ టాటా టెక్నాలజీస్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. షేరుకి రూ. 475-500 ధరల శ్రేణిలో ఐపీవో ఈ నెల 22న ప్రారంభంకానుంది. 24న ముగియనున్న ఇష్యూలో భాగంగా కంపెనీ ప్రమోటర్, ఆటో రంగ దిగ్గజం టాటా మోటార్స్‌తోపాటు.. ప్రస్తుత వాటాదారు సంస్థలు అల్ఫా టీసీ హోల్డింగ్స్, టాటా క్యాపిటల్ గ్రోత్ ఫండ్-1 మొత్తం 6.08 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచనున్నాయి. తద్వారా దాదాపు రూ. 3,043 కోట్లు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది. దాదాపు రెండు దశాబ్దాల తదుపరి డైవర్సిఫైడ్ దిగ్గజం టాటా గ్రూప్ నుంచి వస్తున్న తొలి పబ్లిక్ ఇష్యూ ఇదికాగా.. ఇంత క్రితం 2004లో టీసీఎస్ లిస్టయ్యింది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 30 షేర్లకు (ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది.

సెమీకండక్టర్లలో అపార అవకాశాలు

- కేంద్ర మంత్రి గోయల్ వెల్లడి
- మైక్రాన్ సీఈవో మెహ్రోత్రాతో భేటీ

శాన్ ఫ్రాన్సిస్కో: దేశీయంగా సెమీకండక్టర్ల రంగం గణనీయంగా వృద్ధి చెందుతోందని, ఈ విభాగంలో పుష్కలంగా వ్యాపార అవకాశాలు ఉన్నాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోలో మైక్రాన్ టెక్నాలజీ సీఈవో సంజయ్ మెహ్రోత్రాతో సమావేశమైన సందర్భంగా ఆయన ఈ విషయం తెలిపారు. 'మైక్రాన్‌టెక్ సీఈవో మెహ్రోత్రాతో భేటీ అయ్యాను. భారత్‌లో సెమీకండక్టర్ల రంగం వృద్ధి చెందుతున్న తీరు, కంపెనీకి గల వ్యాపార అవకాశాలు మొదలైన అంశాలను చర్చించాము' అని సోషల్ నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫాం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అటు యూట్యూబ్ సీఈవో నీల్ మోహన్‌తో కూడా గోయల్ సమావేశమయ్యారు.



సినిమా

''ప్రేక్షకులు థ్రిల్లర్ చిత్రాలను చాలా ఎంజాయ్ చేస్తున్నారు. స్కిన్ (చర్మం) మాఫియా ముప్పును చూపించే డార్క్ థ్రిల్లర్ చిత్రం 'మై నేమ్ ఈజ్ శృతి'. ఈ నేపథ్యంలో ఓ మూవీ చేయడం ఇదే తొలిసారి. ఈ సినిమా కచ్చితంగా ప్రేక్షకులకు నచ్చడమే కాదు.. ఆలోచింపజేస్తుందని నమ్మకంగా చెప్పగలను'' అని హీరోయిన్ హన్సిక మోత్వాని అన్నారు. శ్రీనివాస్ ఓంకార్ దర్శకత్వంలో హన్సిక మోత్వాని లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'మై నేమ్ ఈజ్ శృతి'. వైష్ణవి ఆర్ట్స్ పతాకంపై బూరుగు రమ్య ప్రభాకర్ నిర్మించిన ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా హన్సిక మోత్వాని మాట్లాడుతూ....



మై నేమ్ ఈజ్ శృతి ఆలోచింపజేస్తుంది - హన్సిక

- మా అమ్మ డెర్మటాలజిస్ట్(చర్మ వైద్య నిపుణురాలు). 'మై నేమ్ ఈజ్ శృతి' సమయంలో నిజంగా స్కిన్ మాఫియా ఉందా? అని అమ్మను అడిగాను. 'ఇలాంటి ఘటన ఎక్కడో జరిగినట్లు చదివాను' అని చెప్పింది అమ్మ. ఈ మాఫియా ద్వారా సామాన్యుడి జీవితంలో చీకటి వ్యాపిస్తుంది. ఈ సినిమా కోసం శ్రీనివాస్ ఓంకార్ పరిశోధన చేస్తున్న సమయంలో కొన్ని అనుకోని సంఘటనలను ఎదుర్కొన్నారు. ఇటువంటి సున్నితమైన అంశాన్ని టచ్ చేస్తూ.. సినిమా చేయడం సవాలుతో కూడుకున్న అంశం. ఊహించని ట్విస్ట్‌లతో చూస్తున్న ప్రతి ఒక్కరికీ ఈ మూవీ థ్రిల్ ఇస్తుంది. ఇలాంటి థ్రిల్లర్ స్పేస్‌లో భాగమైనందుకు చాలా సంతోషంగా అనిపించింది.
- ఈ సినిమాలో నా పాత్ర పేరు శృతి. ఆత్మవిశ్వాసం ఎక్కువ. ఎలాంటి అడ్డంకులు వచ్చినా వాటిని దాటుకుంటూ వెళ్తుంది. ఓ యాడ్ ఏజెన్సీలో పనిచేస్తున్న శృతి స్కిన్ మాఫియా ట్రాప్‌లో పడుతుంది. ఆ మాఫియా నుంచి తను ఎలా బయటపడింది? అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ప్రతి కుటుంబాన్ని ఈ చిత్ర కథ కదిలిస్తుంది. కొన్ని ప్రశ్నలను లేవనెత్తుతుంది. రమ్యగారు ఈ సినిమాని ఎంతో ప్యాషన్‌తో తీశారు. మార్క్ కె.రాబిన్ నేపథ్య సంగీతం సినిమాకి హైలెట్‌గా ఉంటుంది.
- 2019లో వచ్చిన 'తెనాలి రామకృష్ణ' సినిమా తర్వాత నేను నటించిన తెలుగు చిత్రం 'మై నేమ్ ఈజ్ శృతి'. దాదాపు నాలుగేళ్లు గ్యాప్ వచ్చింది. అయితే తమిళ చిత్రాలతో చాలా బిజీగా ఉండటం వల్లే తెలుగులో గ్యాప్ వచ్చింది. ఒక నటిగా సంతృప్తి చెందలేదు.. ఇంకా ఎన్నో గొప్ప పాత్రలు చేయాలని ఉంది. నా కెరీర్ ప్రారంభంలో అల్లు అర్జున్, ప్రభాస్ వంటి వారితో కలిసి పనిచేసినందుకు గర్వపడుతున్నాను. వారి సినిమాలిప్పుడు సరిహద్దులను చెరిపిస్తూ పాన్ ఇండియా రేంజ్‌కి చేరుకున్నాయి. వారి కష్టానికి ఆ గుర్తింపు వచ్చిందని నేను భావిస్తాను. ఎంత పెద్ద స్టార్స్ అయినప్పటికీ ఎప్పటిలాగే వినయంగా ఉండటం వారి గొప్పతనానికి నిదర్శనం. అల్లు అర్జున్‌కి జాతీయ అవార్డు వచ్చినప్పుడు అభినందనలు తెలిపాను.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



• ఉన్ని ముకుందన్

ఉన్ని ముకుందన్, మహిమా నంబియార్ జంటగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'జై గణేష్'. రంజిత్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. రంజిత్ శంకర్‌కు చెందిన డ్రీమ్స్ ఎన్ బియాండ్ ప్రొడక్షన్స్, ఉన్ని ముకుందన్ ఫిలిమ్స్ భాగస్వామ్యంతో రూపొందుతోంది. తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, ఒరియా భాషల్లో తెరకెక్కుతోన్న 'జై గణేష్' ఫస్ట్ లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా రంజిత్ శంకర్ మాట్లాడుతూ–''ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'జై గణేష్'. అన్నివర్గాల ప్రేక్షకులు మెచ్చే థ్రిల్లింగ్ అంశాలు చాలా ఉంటాయి. ఉన్ని ముకుందన్ పాత్ర గత చిత్రాలతో పోలిస్తే ఇందులో అత్యంత సవాల్‌గా ఉంటుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ఎర్నాకులం పరిసర ప్రాంతాల్లో జరుగుతోంది. 2024 వేసవిలో సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: చంద్రు సెల్వరాజ్, సంగీతం: శంకర్ శర్మ.

నాకు కొత్తగా అనిపించింది - మెహరీన్



''స్పార్క్' సినిమా యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందింది. ఈ మూవీలో నేను లేఖ పాత్రలో కనిపిస్తాను. ఎంతో ప్రాధాన్యత ఉన్న రోల్ నాది. సినిమా నాతోనే ప్రారంభం అవుతుంది.. నాతోనే ముగుస్తుంది.. ఇలాంటి థ్రిల్లర్ మూవీలో నటించటం నాకు కూడా కొత్తగా అనిపించింది. ఈ సినిమా అన్నివర్గాల ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అని హీరోయిన్ మెహరీన్ అన్నారు. విక్రాంత్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'స్పార్క్ లైఫ్'. మెహరీన్, రుక్సార్ థిల్లాన్ హీరోయిన్లుగా నటించారు. డెఫ్ ఫ్రాగ్ ప్రొడక్షన్స్‌పై లీల నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా మెహరీన్ పంచుకున్న విశేషాలు...

- కొత్తవాళ్లు, అనుభవం ఉన్న నటీనటులతో పని చేసే క్రమంలో చాలా విషయాలు నేర్చుకుంటాం. 'స్పార్క్' సినిమాతో హీరోగా, దర్శకుడిగా పరిచయమవుతున్న విక్రాంత్ ఓ రోజు ఫోన్ చేసి, 'మీతో కలిసి నటించాలనుంది' అన్నారు. కథ నాకు నచ్చడంతో ఓకే చెప్పాను. విక్రాంత్‌గారు ఈ మూవీ కోసం చేసిన పరిశోధన నన్ను ఆకట్టుకుంది. నా పాత్ర, లుక్ కొత్తగా ఉంటుందని చెప్పారు.. నా లుక్, పాటలు తెరకెక్కించిన విధానం నన్నెంతో ఆకట్టుకుంది. విక్రాంత్ చెప్పిన మాటను నిలబెట్టుకున్నారని నాకు అర్థమైంది. లీల గారు ఎక్కడా రాజీపడకుండా ఈ మూవీ తీశారు.
- విక్రాంత్ అమెరికాలో మంచి స్థాయిలో స్థిరపడ్డారు. అయితే సినిమా చేయాలనే కలని పూర్తి చేసుకోవటానికి ఇక్కడకు వచ్చారు. అమెరికాలో జరిగిన కొన్ని వాస్తవ ఘటనల నేపథ్యంలో 'స్పార్క్' కథను తయారు చేసుకున్నారు విక్రాంత్. ఈ కథకి కమర్షియల్ అంశాలు జోడించి థ్రిల్లర్ మూవీగా తెరకెక్కించారు. తొలిసారి హీరోగా చేస్తూనే డైరెక్షన్ చేయటం ఎంతో కష్టం. కానీ, విక్రాంత్ ఎంతో కష్టపడి ఈ సినిమాను పూర్తి చేశాడు. తను ఓ డెబ్యూ హీరోగా, డెబ్యూ డైరెక్టర్‌గా మెప్పిస్తాడు.
- జీవితంలో ఉన్నతి స్థాయికి ఎదగాలని ప్రతి మనిషి కలలు కంటుంటారు.. నేను కూడా అంతే. నా కలలను నిజం చేసుకునే క్రమంలోనే ముందుకు వెళుతున్నాను. ఈ సినిమాలో నేను చేసిన లేఖ పాత్ర కూడా అలాగే ఉంటుంది.. అందుకే ఈ పాత్రకు నేను కనెక్ట్ అయ్యాను. నటిగా ప్రతి సినిమా నాకెంతో ప్రత్యేకమైనదే. కథ, నా పాత్ర నచ్చితేనే చేస్తాను.. లేకుంటే చేయను. అది నా కెరీర్‌కి ఎంతో సాయపడుతోంది. నన్ను ఇష్టపడేవారు, ప్రేక్షకులే నాలో స్ఫూర్తి నింపుతుంటారు. పాత్ర ఏదైనా నటిగా రెండు వందల శాతం న్యాయం చేయటానికి ప్రయత్నిస్తాను.
- నేను ఏదైనా వేడుకలకి వెళ్లినప్పుడు, నా సినిమా ప్రమోషన్స్‌లో ఉన్నప్పుడు ఎవరైనా నేను చేసిన పాత్ర పేరుతో పిలిస్తే నాకెంతో సంతోషంగా ఉంటుంది. చాలా మంది ఇప్పటికీ నా తొలి చిత్రం 'కృష్ణ గాడి వీర ప్రేమగాథ' లోని మహాలక్ష్మి పాత్ర పేరుతో పిలుస్తుండటం హ్యాపీ.

నటుడిగా చేయడం అదృష్టం - విజయ్ ధరణ్



''లవ్, థ్రిల్లర్, హారర్ నేపథ్యంలో 'అన్వేషి' చిత్రం రూపొందింది. ఈ కథలోని అంశాలు ప్రేక్షకులకు కొత్తగా, ఫ్రెష్‌గా అనిపిస్తాయి. నిజ జీవితంలోని అన్ని పాత్రలను పోషించే అవకాశం నటీనటులకు మాత్రమే ఉంటుంది. ఓ రకంగా నటుడిగా చేయడం ఎంతో అదృష్టం'' అని హీరో విజయ్ ధరణ్ దాట్ల అన్నారు. వీజే ఖన్నా దర్శకత్వం వహించిన చిత్రం 'అన్వేషి'. అనన్యా నాగళ్ల, సిమ్రాన్ గుప్తా హీరోయిన్లుగా నటించారు. అరుణ శ్రీ ఎంటర్‌టైన్మెంట్స్‌పై టి.గణపతి రెడ్డి నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా విజయ్ ధరణ్ దాట్ల మాట్లాడుతూ–''వీజే ఖన్నాగారు ఆడిషన్‌కి పిలిచి 'అన్వేషి' కోసం నన్ను ఎంపిక చేశారు. ఒక ఊరిలోని ఆస్పత్రిలో కొందరు చనిపోతుంటారు. వారి మృతికి ఆత్మలే కారణమని గ్రామస్తులు భయపడుతుంటారు. ఇంతకీ వారు ఏ కారణం వల్ల చనిపోతున్నారు? నిజంగానే అక్కడ ఆత్మలున్నాయా? లేవా? అన్నది సినిమాలో ఆసక్తిగా ఉంటుంది. గణపతి రెడ్డిగారు ప్యాషనేట్ ప్రొడ్యూసర్.. ఎక్కడా రాజీ పడలేదు. 'అన్వేషి' కి రెండో భాగం ఉంటుంది. హీరో కంటే మంచి నటుడు అనిపించుకోవాలనుంది. ప్రస్తుతం రాజేంద్ర ప్రసాద్‌గారు లీడ్ రోల్‌లో చేస్తున్న ఓ సినిమాలో కీలక పాత్ర చేస్తున్నా. తమిళ సినిమాలో విలన్‌గా అవకాశం వచ్చింది'' అన్నారు.

రాజు యాదవ్ వినోదం



• అంకిత ఖరత్, 'గెటప్' శ్రీను

'జబర్దస్త్' ఫేమ్ గెటప్ శ్రీను హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'రాజు యాదవ్'. కృష్ణమాచారి కె. దర్శకునిగా పరిచయమవుతున్న ఈ సినిమాలో అంకిత ఖరత్ హీరోయిన్‌గా నటించారు. సాయి వరుణవి క్రియేషన్స్, చరిష్మా డ్రీమ్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లపై కె.ప్రశాంత్ రెడ్డి, రాజేష్ కళ్లేపల్లి నిర్మించారు. హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'రాజు యాదవ్ చూడు..' అంటూ సాగే పాటని డైరెక్టర్ బాబీ (కేఎస్ రవీంద్ర) విడుదల చేసి, చిత్రయూనిట్‌కి అభినందనలు తెలిపారు. 'రాజు యాదవ్ చూడు..' పాటకి చంద్రబోస్ లిరిక్స్ అందించగా, రామ్ మిరియాల పాడారు. ''ప్రేమ, వినోదంతో పాటు ప్రేక్షకుల హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాలు 'రాజు యాదవ్' సినిమాలో ఉన్నాయి. త్వరలో మూవీ విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: సాయిరామ్ ఉదయ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: విప్లవ్.

పల్లెటూరి ప్రేమకథ



• అపర్ణా దేవి, వినాయక్ దేశాయ్


వినాయక్ దేశాయ్, అపర్ణా దేవీ జంటగా దాసరి ఇస్సాకు దర్శకత్వం వహించిన చిత్రం 'రాధా మాధవం'. గోనల్ వెంకటేష్ నిర్మించిన ఈ మూవీ ఫస్ట్ లుక్‌ను నిర్మాత రాజ్ కందుకూరి విడుదల చేసి, మాట్లాడుతూ–''రాధా మాధవం' ఫస్ట్ లుక్ పోస్టర్ చాలా బాగుంది. కథ బాగుంటే చిన్న చిత్రాలను కూడా ప్రేక్షకులు ప్రోత్సహిస్తారు.. ఈ సినిమాని కూడా ఆదరిస్తారని నమ్ముతున్నాను'' అన్నారు. ''చక్కని కథాంశంతో రూపొందిన మా సినిమాను ప్రేక్షకులు చూసి, యూనిట్‌ని ఆశీర్వదించాలి'' అన్నారు వినాయక్ దేశాయ్. ''అందమైన పల్లెటూరి ప్రేమ కథా చిత్రమిది'' అన్నారు వెంకటేష్. ''విలేజ్ లవ్ డ్రామాలకు ఆడియన్స్ నుంచి ఎప్పుడూ ఆదరణ ఉంటుంది. ఆ కోవలో వస్తున్న మరో చక్కని గ్రామీణ ప్రేమ కథా చిత్రం ఇది'' అన్నారు దాసరి ఇస్సాకు.

దేవి వచ్చేశారు!



సుధీర్ బాబు హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'హరోం హర'. జ్ఞాన సాగర్ ద్వారక దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మాళవిక శర్మ హీరోయిన్. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్‌పై సుమంత్ జి.నాయుడు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో మాళవిక శర్మను దేవిగా పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు మేకర్స్. చీరలో సంప్రదాయకంగా ఉన్న ఆమె లుక్ ఆకట్టుకుంటోంది. ''చిత్తూరు జిల్లా కుప్పంలో 1989 నాటి నేపథ్యంలో సాగే చిత్రం 'హరోం హర'. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. సునీల్ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: చేతన్ భరద్వాజ్, కెమెరా: అరవింద్ విశ్వనాథన్.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14+4 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 236
శుక్రవారం 17-11-2023


'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'



SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



దోచేసిన డబ్బును హవాలా మార్గంలో మళ్లించారు

పలు కీలక విషయాలను కోర్టు ముందుంచిన సీఐడీ

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబు తదితరులు లూటీ చేసిన డబ్బు మొత్తాన్ని హవాలా మార్గంలో మళ్లించారని సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టుకు నివేదించారు. సీమెన్స్ మాజీ ఎండీ సుమన్ బోస్ తనకు సంబంధించిన చెన్నప్ప అనే వ్యక్తి ద్వారా రూ. 10 నోట్లను వినియోగించి కావాల్సిన చోటుకు హవాలా మార్గంలో నిధులను మళ్లించారని తెలిపారు. దర్యాప్తులో భాగంగా వారి నుంచి స్వాధీనం చేసుకున్న ఎలక్ట్రానిక్ పరికరాల ద్వారా జరిగిన వారి చాటింగ్ వివరాలను ఆయన కోర్టుకు వివరించారు. నిధులు మళ్లింపు, డబ్బు జమకు వారి మధ్య కోడ్ భాషలో సంభాషణలు జరిగాయని తెలిపారు. సీమెన్స్ ప్రతినిధి మాథ్యూ థామస్ అసలు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుతో తమకు ఏ మాత్రం సంబంధం లేదని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముందు వాంగ్మూలం ఇచ్చారని ఆయన కోర్టుకు వివరించారు. 90 శాతం పెట్టుబడి పెట్టాల్సిన సీమెన్స్ ఒక్క రూపాయి కూడా పెట్టుబడి పెట్టక ముందే చంద్రబాబు ప్రభుత్వం రూ. 270 కోట్లను ముందుగానే విడుదల చేసేసిందని, ఈ విషయంలో ప్రతీ దశలో నిబంధనల ఉల్లంఘన జరిగిందని ఆయన కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిధులను విడుదల చేయాలని కోరగానే, ఆ నిధులను విడుదల చేసినట్లు అప్పటి ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీవీ రమేశ్ తన నోట్‌ఫైల్‌లో పేర్కొన్నారని, ఇదంతా కూడా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రోద్బలంతోనే జరిగిందని సుధాకర్‌రెడ్డి కోర్టుకు వివరించారు.

టీడీపీ ఖాతాల్లోకి నిధులు

స్కిల్ కుంభకోణం నిధుల్లో కొంత భాగం అంతిమంగా తెలుగుదేశం పార్టీ బ్యాంకు ఖాతాల్లో చేరాయని, ఇందుకు సంబంధించిన వివరాలను సీఐడీ కోరితే ఆ పార్టీ వర్గాలు ఇవ్వడం లేదని ఏఏజీ కోర్టుకు తెలిపారు. సీఐడీ ఇచ్చిన నోటీసులను ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. స్కిల్ కుంభకోణంపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించి నిధుల దుర్వినియోగాన్ని ధ్రువీకరించిన శరత్ అసోసియేట్స్‌పై ఈ కేసులో నిందితుడైన వికాస్ ఖన్విల్కర్‌తో చార్టెడ్ అకౌంటెంట్స్ ఇండియా వద్ద ఫిర్యాదు చేయించారన్నారు. ఇలా చేయించడం ద్వారా ఈ కేసులో కీలక సాక్షి అయిన శరత్ అసోసియేట్స్‌ను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అంతేకాక చంద్రబాబు అరెస్ట్ తర్వాత దర్యాప్తుకు విఘాతం కలిగేలా సుమన్ బోస్, ఖన్విల్కర్‌లు మీడియా సమావేశాలు నిర్వహించారన్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేయవద్దని.. ఆ పిటిషన్ కొట్టివేయాలని ఆయన కోర్టును అభ్యర్థించారు.

గుండె జబ్బన్నారు.. ఈసీజీలో అలాంటిదేమీ లేదు

కంటికి శస్త్ర చికిత్స నిమిత్తం మధ్యంతర బెయిల్‌పై బయట ఉన్న చంద్రబాబు స్కిల్ కుంభకోణంలో సహనిందితుల ద్వారా సాక్షులను పరోక్షంగా ప్రభావితం చేస్తున్నారని ఏఏజీ తెలిపారు. తమ పార్టీ నేతల ద్వారా విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేయడం, స్టేట్‌మెంట్లు ఇప్పించడం, పోలీసులపై కేసులు పెట్టించడం వంటివి చేస్తున్నారని వివరించారు. బెయిల్ పొందేందుకు వీలుగా తప్పుడు మెడికల్ రిపోర్ట్‌ను కోర్టు ముందుంచారని ఆయన తెలిపారు. తాజా మెడికల్ రిపోర్టులో చంద్రబాబు 'హైపర్‌ట్రోఫిక్ కార్డియోపతి విత్ ఇర్రెగ్యులర్ హార్ట్ రిథమ్'తో బాధపడుతున్నట్లు పేర్కొన్నారని.. ఇది శుద్ధ అబద్ధమని, ఆ వ్యాధితో బాధపడేవారికి వైద్యులు ఐసీడీ అనే పరికరాన్ని అమరుస్తారని తెలిపారు. ఇదేమీ అసాధారణ వ్యాధి కాదన్నారు. ఆ జబ్బు ప్రభావం ఈసీజీ ద్వారా తెలుస్తుందని, అయితే చంద్రబాబు ఈసీజీలో అలాంటిది ఏమీ లేదని ఆయన వివరించారు. కేవలం బెయిల్ కోసం ఈ మెడికల్ రిపోర్టును సృష్టించారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వ వైద్యుల బృందం పర్యవేక్షణలో వైద్య పరీక్షలు చేయించుకునేలా చంద్రబాబును ఆదేశించాలని కోరారు. చంద్రబాబును ఢిల్లీ ఎయిమ్స్‌కు తీసుకెళ్లేందుకు సైతం తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. తనకు కావాల్సిన చోట చికిత్స పొందేందుకు చంద్రబాబుకు అనుమతినివ్వడం ద్వారా ఈ కోర్టు ఓ ప్రతికూల అభిప్రాయాన్ని కలిగించిందని, రాజమండ్రి జైలులో ప్రస్తుతం 2 వేల మంది ఖైదీలు ఉన్నారని, వారంతా కూడా కోర్టుకొచ్చి తమకూ అలాంటి అవకాశం ఇవ్వాలని కోరే ప్రమాదం ఉందన్నారు.



కోర్టు ఆదేశాలు ఉల్లంఘించేలా వైద్య నివేదికలు

వాస్తవానికి మధ్యంతర బెయిల్ మంజూరు సమయంలో హైకోర్టు పలు షరతులు విధించిందని, చంద్రబాబు వైద్య నివేదికలను రాజమండ్రి జైలు సూపరింటెండెంట్‌కు సీల్డ్ కవర్‌లో ఇవ్వాలని వైద్యులను ఆదేశించిందని ఏఏజీ తెలిపారు. అయితే వైద్యులు నేరుగా చంద్రబాబుకే ఆ నివేదికలు ఇచ్చారని, ఇది కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడమేనని చెప్పారు. హైదరాబాద్‌లో కూడా చంద్రబాబు కోర్టు షరతులను ఉల్లంఘించారన్నారు. ఇందుకు సంబంధించి తెలంగాణ పోలీసులు కేసు కూడా నమోదు చేశారని తెలిపారు.

తీర్పు రిజర్వు

సీఐడీ వాదనలకు చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, దమ్మాలపాటి శ్రీనివాస్ సమాధానం ఇచ్చారు. నిధుల మళ్లింపుతో చంద్రబాబునాయుడుకు సంబంధం లేదన్నారు. రాజకీయ ప్రతీకారంలో భాగంగానే చంద్రబాబు అరెస్ట్ జరిగిందన్నారు. ఆయన షరతులను ఉల్లంఘించలేదని తెలిపారు. ఆయనకు పూర్తి స్థాయి బెయిల్ మంజూరు చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు తీర్పును రిజర్వ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ చంద్రబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంలో సీఐడీ తరఫున వాదనలు వినిపిస్తున్న సుధాకర్‌రెడ్డి రెండో రోజూ గురువారం తన వాదనలను కొనసాగించారు.

కీలక సాక్షులు దర్యాప్తునకు ఏ మాత్రం సహకరించడం లేదు..

స్కిల్ కుంభకోణంలో సీఐడీ పలు కీలక విషయాలను హైకోర్టు ముందుంచింది. కుంభకోణంలో నిధులను షెల్ కంపెనీల ద్వారా ఎలా మళ్లించారు.. వాటిని తిరిగి టీడీపీ బ్యాంకు ఖాతాల్లోకి ఎలా తీసుకొచ్చారు.. డీమానిటైజేషన్ సమయంలో డబ్బును ఎలా మార్పిడి చేశారు.. తదితర వివరాలను సీఐడీ లిఖితపూర్వకంగా కోర్టు ముందుంచింది. ఈమేర అదనపు కౌంటర్‌ను కోర్టులో దాఖలు చేసింది. 2014 జూన్ 1 నుంచి 2018 జూన్ వరకు మొత్తం రూ. 65.86 కోట్లు టీడీపీకి చెందిన నాలుగు బ్యాంకు ఖాతాల్లోకి చేరాయని సీఐడీ వివరించింది. అంతేకాక 2016 నవంబర్, 2017 జనవరి మధ్య మొత్తం నగదు డిపాజిట్లన్నీ కూడా రూ. 500, రూ. 1,000 నోట్ల ద్వారా మాత్రమే జరిగిన విషయాన్ని దర్యాప్తులో గుర్తించామని సీఐడీ తెలిపింది. డీమానిటైజేషన్‌ను నవంబర్ 8న ప్రకటించారని, అందువల్ల ఈ రూ. 500, రూ. 1,000 జమ లావాదేవీలన్నీ కూడా అత్యంత అనుమానాస్పదంగా ఉన్నాయంది. తెలుగుదేశం పార్టీ బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన వారి వివరాలేవీ సరిగా లేవని, కేవైసీ నిబంధనలు అసలు పాటించలేదని సీఐడీ హైకోర్టు దృష్టికి తీసుకొచ్చింది. ఈ డిపాజిట్లకు సంబంధించిన వివరాలను సమర్పించేందుకు తెలుగుదేశం పార్టీ ఎంత మాత్రం సుముఖత వ్యక్తం చేయడం లేదని, తామిచ్చిన నోటీసులకు సైతం సరైన రీతిలో స్పందించడం లేదని వివరించింది. చంద్రబాబు ప్రభావితం చేస్తున్న కారణంగా కీలక సాక్షులు దర్యాప్తునకు ఏ మాత్రం సహకరించడం లేదని తెలిపింది. ఈ కుంభకోణంలో కీలక వ్యక్తులు పెండ్యాల శ్రీనివాస్, షాపూర్‌జీ పల్లోంజీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్ పార్థసాని విదేశాలకు పారిపోయారని సీఐడీ తన అదనపు కౌంటర్‌లో హైకోర్టు దృష్టికి తీసుకొచ్చింది.

చంద్రబాబు మెడికల్ రిపోర్టు ఇచ్చింది

వైద్యులా? రాజకీయ నేతలా?

వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ధ్వజం

సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు మరికొంత కాలం బెయిల్‌పై బయట ఉండటానికే ఆయనకు మెడికల్ రిపోర్టు ఇచ్చినట్లు ఉందని, ఆ మెడికల్ రిపోర్టు ఇచ్చింది వైద్యులా? లేక రాజకీయనేతలా? అంటూ వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎవరికైనా గుండెలో క్యాల్షియం స్కోర్ (స్థాయి) 900 దాటితే స్టంట్ లేదంటే బైపాస్ సర్జరీనో చేయించుకోవాలని వైద్యులు సూచిస్తారన్నారు. అయితే చంద్రబాబు మెడికల్ రిపోర్టును పరిశీలిస్తే.. ఆయన గుండెలో క్యాల్షియం స్కోర్ 1,600 దాటిందని ఏఐజీ వైద్యులు పేర్కొన్నారని చెప్పారు. క్యాల్షియం స్కోర్ ఇంత ఉన్నా స్టంట్ లేదంటే బైపాస్ సర్జరీనో చేయించుకోవాలని సూచించకపోగా.. చంద్రబాబు బయటకు వెళితే ఆయన వెంట అంబులెన్స్ ఉండాలంటూ నివేదికలో పేర్కొనడమేంటని ప్రశ్నించారు. దీన్ని బట్టి చూస్తే.. వైద్యులు పరిధి దాటి మెడికల్ రిపోర్టు ఇచ్చినట్లు స్పష్టమవుతోందన్నారు. చంద్రబాబుకు ఉన్న చర్మ వ్యాధులు క్యాన్సరో కాదో తేల్చడానికి మరిన్ని పరీక్షలు చేయాలని, ఇందుకు మరింత సమయం కావాలని మెడికల్ రిపోర్ట్‌లో పేర్కొనడాన్ని సజ్జల ఎత్తిచూపారు. వీటిని అన్నింటిని చూస్తే వ్యవస్థలను మేనేజ్‌మెంట్ చేయడంలో దిట్టయిన చంద్రబాబు.. తాను మరింతకాలం బయట ఉండటానికే ఆ రిపోర్టు ఇప్పించుకున్నట్లుగా ఉందన్నారు. ఆ రిపోర్టు ఆధారంగా చంద్రబాబుపై ప్రజల్లో సానుభూతి పెంచడానికి ఎల్లో మీడియా హడావుడి చేస్తోందంటూ మండిపడ్డారు. చంద్రబాబు జైల్లోనే ఉండాలని తాము కోరుకోవడం లేదన్నారు. తాను అధికారంలో ఉన్నప్పుడు చేసిన కుంభకోణాలకు ప్రజలకు సంజాయిషీ చెప్పుకోవాల్సిన అవసరం చంద్రబాబుకు ఉందన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

సానుభూతి కోసం నాటకాలు

స్కిల్ స్కాంలో అడ్డంగా దొరికి జైలుకు వెళ్లిన రోజు నుంచే చంద్రబాబు ఆరోగ్యంపై ఆయన కుటుంబ సభ్యులు రోజుకో నాటకానికి తెరతీశారు. చర్మవ్యాధులు ప్రాణాంతకమైనవి అన్నట్లుగా చిత్రీకరించారు. తన ఆరోగ్య పరిస్థితి బాగోలేదంటూ చంద్రబాబు బతిమాలుకుంటే కోర్టు మెడికల్ బెయిల్ ఇచ్చింది. అనారోగ్య కారణాలతో జైలు నుంచి బయటకు వచ్చిన చంద్రబాబు.. రాజమండ్రి నుంచి విజయవాడ వరకూ రోడ్‌షో చేశారు. ఆరోగ్యం బాగోలేని వ్యక్తి 14 గంటలు రోడ్ షో చేస్తారా? 2004లో అలిపిరి ఘటనలో గాయపడకున్నా గాయపడినట్లు చేతికి కట్టుకట్టుకుని చంద్రబాబు ఆడిన నాటకాలను ప్రజలు అప్పుడు తిప్పికొట్టారు. ఇప్పుడు స్కిల్ స్కాం కేసులో అడ్డంగా దొరికిన దొంగ చంద్రబాబు సానుభూతి కోసం ఆడుతున్న నాటకాలను ప్రజలు ఛీకొడుతున్నారు.

ఉమ్మడి మేనిఫెస్టోతో మోసగాళ్లు..

ఎన్నికల మేనిఫెస్టోలో 99.5 శాతం హామీలను సీఎం వైఎస్ జగన్ అమలు చేశారు. పారదర్శకంగా పాలన అందిస్తూ.. పదవుల్లో సామాజిక న్యాయం చేశారు. అందుకే సీఎం వైఎస్ జగన్‌కు ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారు. 2014 ఎన్నికల్లో బాబు ఇచ్చిన హామీలకు తనది పూచీ అంటూ పవన్ చెప్పారు. ఇచ్చిన హామీలను అమలు చేయని చంద్రబాబు, ఆ మేనిఫెస్టోనే పార్టీ వెబ్‌సైట్ నుంచి మాయం చేయించారు. ఇప్పుడు మళ్లీ అదే చంద్రబాబు, పవన్ ఉమ్మడి మేనిఫెస్టోతో ప్రజల చెవుల్లో కాలీఫ్లవర్ పెట్టేందుకొస్తున్నారు. ఆ విషయాన్ని ఇంటింటికీ వెళ్లి మేం గుర్తుచేస్తున్నాం. ఆ మోసగాళ్లకు గుణపాఠం చెప్పాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

ఒక్కో చోట ఒక్కో పొత్తా?

తన అవసరాల కోసమే పవన్‌తో చంద్రబాబు జనసేనను స్థాపించారు. తెలంగాణ ఎన్నికల్లో బీజేపీతో పవన్ పొత్తు పెట్టుకున్నారు. కాంగ్రెస్‌కు టీడీపీ పరోక్షంగా మద్దతిస్తోంది. ఏపీలో బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి మాత్రం మరిది చంద్రబాబు కోసం రాజకీయాలు చేస్తున్నారు. వారి డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారు. తగినరీతిలో బుద్ధి చెబుతారు.

భగవంతుడు మిమ్మల్ని క్షమిస్తాడా?

- పురందేశ్వరి తీరును ఎండగట్టిన విజయసాయిరెడ్డి



సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై అదే పనిగా విమర్శలు చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిపై వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ విజయసాయిరెడ్డి విరుచుకుపడ్డారు. ఆమె తండ్రి ఎన్టీ రామారావును వెన్నుపోటు పొడిచి, ఆయన మరణానికి కారణమైన చంద్రబాబుకే మద్దతివ్వడం శోచనీయమన్నారు. కన్న తండ్రికి వెన్నుపోటు పొడిచిన మరిదికి శిక్ష పడకుండా పురందేశ్వరి చేస్తున్న పనిని ఏమంటారో ఆమే చెప్పాలని, ఆమెను దేవుడు క్షమిస్తాడా అంటూ గురువారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. వైఎస్ జగన్ విజ్ఞత కలిగిన సీఎం అయినందునే కొత్తగా ఏర్పడ్డ జిల్లాకు ఆమె తండ్రి ఎన్టీయార్ పేరు పెట్టారని చెప్పారు. సీఎం జగన్ నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని పేర్కొన్నారు.

జిల్లా వార్తలు

ఆది దేవునికి ఆలవాలం బెజ'వాడ'

- శివాలయాలకు కేంద్రమైన విజయవాడ నగరం
- కార్తిక మాసంలో విశేష పూజలకు సిద్ధమైన ఆలయాలు
- ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలకు ఏర్పాట్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): చారిత్రక నేపథ్యంతో పాటుగా పురాణ ఇతిహాసాలతో ముడిపడి విజయవాడ శివాలయాలకు కేంద్రంగా ఉంది. కార్తికం పరమశివునికి అత్యంత ప్రీతికరం. ఈ నెలలో శివుడికి చేసే ప్రతి పూజ అద్భుత ఫలాన్ని అందిస్తుందని పండితులు పేర్కొంటారు. అటువంటి కార్తిక మాసంలో నగరంలోని శివాలయాల్లో స్వామికి పలు రకాలు పూజలు నిర్వహించేందుకు ఆయా ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

■ ఇంద్రకీలాద్రిపై బ్రహ్మాది దేవతల అభీష్టం మేరకు ఆదిపరాశక్తి మహిషాసురమర్దిని స్వరూపంతో అవతరించింది. విశేష తేజస్సుతో కనకవర్ణంతో వెలుగొందుతున్న ఆ అమ్మ కాలక్రమంలో కనకదుర్గగా కీర్తించబడింది. ఆ పర్వతంపైనే ఈశ్వరుణ్ణి కూడా కొలువుండేలా చేయాలని భావించిన బ్రహ్మ అత్యంత భక్తిప్రపత్తులతో శతాశ్వమేధ యాగాలను చేశాడు. సంతసించిన పరమేశ్వరుడు జ్యోతిర్లింగ స్వరూపంతో ఆ బ్రహ్మదేవునికి దర్శనమిచ్చినట్లు స్కాంధ పురాణం పేర్కొంటోందని పండితులు తెలిపారు. ఇంద్రకీలాద్రి మీద దివ్యజ్యోతిర్లింగ స్వరూపుడై నిలిచిన పరమేశ్వరుణ్ణి బ్రహ్మ మల్లీకదంబ పుష్పాలతో అర్చించాడు కాబటి ఆ స్వామికి మల్లేశ్వరుడు అనే పేరు వచ్చింది. ద్వాపర యుగంలో పాండవ మధ్యముడైన అర్జునుడు పాశుపతాస్త్రం కోసం ఈ పర్వతం మీద ఘోర తపస్సు చేశాడు. కాలక్రమంలో కలి ప్రభావం వలన ఈ జ్యోతిర్లింగం అదృశ్యంగా ఉండటాన్ని చూసిన శంకరాచార్యులు కనకదుర్గాదేవి ఆలయానికి ఉత్తర భాగంలో మల్లేశ్వర లింగాన్ని పునఃప్రతిష్ఠ చేశారు. ప్రస్తుతం స్వామి ఆలయంలో అభివృద్ధి కార్యక్రమాల దృష్ట్యా బాలాలయంలో పూజలు నిర్వహిస్తున్నారు.



ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి గోపురానికి అభివృద్ధి పనులు

■ శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం) పూర్వం వేయి స్తంభాలతో విస్తరించి ఉండేదని చరిత్ర చెబుతోంది. శ్రీశైల దేవస్థానం తరువాత అంతటి ప్రాచీనత ఈ ఆలయానికి ఉందని పండితులు చెబుతారు. ఈ ఆలయాన్ని ధర్మరాజు ప్రతిష్ఠించాడని, పశ్చిమ చాళుక్య రాజైన త్రిభువనమల్లుడు క్రీస్తు శకం పదో శతాబ్దంలో తన పేరుమీదుగా త్రిభువన మల్లేశ్వరాలయాన్ని నిర్మాణం చేశారని చెబుతుంటారు. కార్తిక మాసంలో ఈ ఆలయంలోని శ్రీ భ్రమరాంబ అమ్మవారు ఈ నెల రోజులూ రోజుకొక అలంకారంలో దర్శనమిస్తారు.

■ వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలో ఉన్న శ్రీ వసంత మల్లికార్జునస్వామి ఆలయాన్ని(బుద్ధ వారిగుడి) బుద్ధ వంశీయులు నిర్మాణం చేశారని చెబుతారు. కార్తిక మాసం నెలరోజులు ఇక్కడ స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహిస్తారు.

■ గవర్నరుపేట చల్లపల్లి బంగ్లా సమీపంలో ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణాదేవి దేవస్థానంలో కార్తికమాసంలో నిత్యం రుద్రాభిషేకం, రుద్ర హోమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

■ వన్‌టౌన్ సైకంవారి వీధిలోని శ్రీ గంగా సమేత దర్పేశ్వరస్వామి వారి ఆలయంలో కార్తిక మాసంలో పలు విశేష పూజలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రోజూ స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. మహాలింగార్చన తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు.



పాతశివాలయం

విజయేశ్వరస్వామి ఆలయం



దుర్గగుడి దిగువన కనకదుర్గనగర్ సమీపంలో ఉన్న విజయేశ్వరస్వామి ఆలయంలో స్వామిని పాండవ మధ్యముడైన అర్జునుడు ప్రతిష్ఠించాడని ప్రతీతి. పరమేశ్వరుని ద్వారా పాశుపతాస్త్రం పొందిన అర్జునుడు ఇంద్రకీలాద్రి దక్షిణ భాగాన ఒక శివలింగాన్ని ప్రతిష్ఠించాడు. కాలక్రమంలో ఈ ఆలయం విజయేశ్వరస్వామి ఆలయంగా ప్రసిద్ధికెక్కింది. కార్తిక మాసంలో ఇక్కడ స్వామివారికి ప్రీతికరమైన బిల్వార్చన, రుద్రాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు.

యనమలకుదురు ఆలయం

యనమలకుదురు శ్రీ రామలింగేశ్వరస్వామి వార్ల దేవస్థానం జిల్లాలోనే అత్యంత ప్రముఖమైన శివాలయం. పరశురాముడు ఇక్కడి స్వామి వారి లింగస్వరూపాన్ని ప్రతిష్ఠ చేశారని ప్రతీతి. పూర్వం వెయ్యి మంది మునులు ఇక్కడ తపస్సు చేశారని, అందువల్ల వెయ్యి మునులకుదురుగా కాలక్రమంలో యనమలకుదురుగా రూపాంతరం చెందిందని చెబుతారు. శివరాత్రి పర్వదినం రోజున స్వామివారిని దర్శించుకునేందు లక్షల సంఖ్యలో భక్తులు బారులు తీరుతారు.



యనమలకుదురు దేవస్థానం

ప్రభుత్వాస్పత్రుల్లో అధునాతన వైద్యం

- కార్పొరేట్‌కు మించిన మౌలిక సౌకర్యాలు
- ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యమే ప్రభుత్వ లక్ష్యం
- వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు
- సిద్ధార్థ వైద్య కళాశాల డాక్టర్స్ ట్రస్టు భవనానికి శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న వైద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, కలెక్టర్ ఢిల్లీరావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ప్రభుత్వాస్పత్రికి వచ్చిన వారికి అధునాతన వైద్య సేవలు అందిస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు అన్నారు. అందుకోసం కార్పొరేట్‌కు మించిన మౌలిక సదుపాయాలు ప్రభుత్వాస్పత్రుల్లో కల్పించినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వాస్పత్రి ఆవరణలో రూ.80 లక్షల అంచనాతో నిర్మించనున్న ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల డాక్టర్స్ భవనానికి గురువారం ఆయన కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, రాష్ట్ర వైద్య విద్య సంచాలకుడు డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహంలతో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం ఎంటీ కృష్ణబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మెరుగైన వైద్య సహాయాన్ని ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకూ 5 వేలకు పైగా ఆరోగ్య సురక్ష క్యాంపులను నిర్వహించినట్లు తెలిపారు. విజయవాడ ప్రభుత్వాస్పత్రి, సిద్ధార్థ వైద్య కళాశాలకు చెందిన వైద్యులు ట్రస్టుగా ఏర్పడి క్యాంటీన్ నిర్మించుకోవాలని నిర్ణయించగా, స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వాస్పత్రిలో కార్పొరేట్ కంటే మెరుగైన సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల 15 పడకలతో ఎమర్జెన్సీ మెడికల్ డిపార్ట్‌మెంట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాలో 14 యూపీహెచ్‌సీలకు నూతన భవనాలు నిర్మించినట్లు చెప్పారు. మరో 5 సెంటర్లకు భవన నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో ఇప్పటివరకూ 520 జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించి 3.07 లక్షల మందికి వైద్య సేవలు అందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిద్ధార్థ వైద్య కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎస్ విఠల్‌రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.వెంకటేష్, డాక్టర్స్ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ కె.అప్పారావు, ఉపాధ్యక్షుడు డాక్టర్ బి.నెహ్రూ, కోశాధికారి డాక్టర్ సొంగా వినయ్‌కుమార్ ఇతర వైద్యులు పాల్గొన్నారు.

నేడు గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు రాహుల్ గాంధీ రాక

గన్నవరం: తెలంగాణ ఎన్నికల ప్రచారానికి వెళ్లే నిమిత్తం ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ శుక్రవారం గన్నవరం విమానాశ్రయానికి రానున్నారు. జైపూర్ నుంచి ఆయన ఉదయం 11.20 గంటలకు ఇక్కడికి చేరుకుని 11.30కు ప్రత్యేక హెలికాప్టర్‌లో తెలంగాణలోని మణుగూరు, పినపాక వెళ్లనున్నారు. ఈ సందర్భంగా ముందస్తు భద్రత ఏర్పాట్లపై గురువారం అధికారులతో ఎయిర్‌పోర్ట్‌లో సమన్వయ సమావేశం నిర్వహించారు. పరిపాలన అదనపు ఏఎస్పీ ఎస్‌వీడీ ప్రసాద్, ఐఎస్‌డబ్ల్యూ అదనపు ఎస్పీ కేడీఎంవీఆర్ ప్రసాద్, డీఎస్పీ కృపాకర్, సీఆర్‌పీఎఫ్ అధికారి రూపేంద్రసింగ్ భారతి నేతృత్వంలో జరిగిన సమావేశంలో భద్రత ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎంఎల్‌కే రెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

మహిళలకు సుస్థిర స్వయం ఉపాధి శిక్షణ

- ఈనెల 20 నుంచి కేఎల్ వర్సిటీలో ప్రారంభం
- మెప్మా ఎండీ వీ విజయలక్ష్మి వెల్లడి

సాక్షి, అమరావతి: పట్టణ స్వయం సహాయక సంఘ సభ్యులకు సుస్థిర జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మెప్మా ఎండీ వి.విజయలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీన్లో భాగంగానే 'పట్టణ ప్రగతి యూనిట్లు' పేరుతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. స్వయం ఉపాధిపై ఆసక్తి కలిగిన పట్టణ సమాఖ్యలోని మహిళలను గుర్తించి ఆరు విభాగాల్లో సంపూర్ణ శిక్షణ అందిస్తామన్నారు. కంప్యూటరైజ్డ్ ఎంబ్రాయిడరీ వర్క్స్, పేపర్ ప్లేట్ తయారీ, క్లాత్ బ్యాగ్స్ తయారీ, స్క్రీన్ ప్రింటింగ్, ఆర్టిఫీషియల్ జ్యూయలరీ, కర్పూరం, దీపం వత్తులు, సాంబ్రాణీ తయారీ, కారం, మసాలా పౌడర్, మిల్లెట్ల తయారీలో నాలుగు రోజుల పాటు నైపుణ్య, వ్యాపారాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు. ఈ నెల 20 నుంచి 23 వరకు రాష్ట్రవ్యాప్తంగా 167 పట్టణ సమాఖ్యల నుంచి ఎంపిక చేసిన మహిళలకు గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ వర్సిటీ ప్రాంగణంలో శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు యూనిట్ ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం గ్రాంట్ రూపంలో పెట్టుబడి సాయాన్ని సమకూరుస్తుందన్నారు.

సృజనాత్మకత కోసం బాలల చిత్రాలు అవసరం

బాలల చిత్ర దర్శకుడు, సినీ గీతరచయిత డాడీ శ్రీనివాస్

తెనాలి: బాలల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి చలన చిత్రోత్సవాలు ఎంతో ఉపకరిస్తాయని ప్రముఖ సినీ గీత రచయిత, చిత్ర దర్శకుడు డాడీ శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాలను ప్రభుత్వాలు క్రమం తప్పకుండా నిర్వహించటం మంచిదని ఆయన అభిప్రాయపడ్డారు. తెనాలి కల్చరల్ ఫిలిం సొసైటీ సహకారంతో చిల్డ్రన్ ఫిలిం సొసైటీ, తెనాలి ఆధ్వర్యంలో వివేకానంద సెంట్రల్ స్కూల్ ఆవరణలోని ఏవీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ థియేటర్‌లో జరుగుతున్న అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవంలో మూడో గురువారం జరిగిన సభకు సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రావిపాటి వీర నారాయణరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాడీ శ్రీనివాస్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, ప్రభుత్వాలు జరపాల్సిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలను తెనాలిలో ఏటా జరుపుతున్న సొసైటీని అభినందించారు. చిత్రోత్సవాలు ప్రతిభ కలిగిన వారికి ఒక వేదికగా ఉపయోగపడతాయన్నారు. బాలల చిత్రాలకు ప్రభుత్వాలు ప్రకటించిన సబ్సిడీ మొత్తాన్ని సకాలంలో జమ చేసినట్లయితే నిర్మాత, దర్శకులు మరిన్ని మంచి చిత్రాలను తీసేందుకు అవకాశం కల్పించినట్లు అవుతుందన్నారు. తాను తీసిన బాలల చిత్రం మట్టిలో మాణిక్యాలకు ద్వితీయ ఉత్తమ బాలల చిత్రంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నంది అవార్డుతోపాటు ఉగాది ఎక్సలెన్సీ, జాతీయస్థాయి అంబేడ్కర్ అవార్డులు వచ్చాయన్నారు. ఇప్పటికీ తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు సబ్సిడీ జమ చేయటకపోవటం విచారకరమని శ్రీనివాస్ అన్నారు. తెనాలి దగ్గర్లోని దుండిపాలెం నుంచి కట్టుబట్టలతో వెళ్లిన తాను, అనేక కష్టాలను అనుభవిస్తూ సినీ రంగంలో పాటల రచయితగా నిలదొక్కుకుని ఇప్పటికి 396 సినిమాల్లో 800 పైగా పాటలు రచించినట్లు చెప్పారు. బింబిసారలో నటించిన బాలనటి శ్రీదేవి, భగవంత్ కేసరి సినిమా బాలనటుడు పుష్కర్, టీవీ, సినిమా, వెబ్ సిరీస్‌ల్లో నటిస్తున్న బాలనటి భవ్యశ్రీ పాల్గొన్నారు. వీరికి సర్టిఫికెట్లను, జ్ఞాపికలను బహూకరించారు. వివిధ సినిమాల్లో వీరు నటించిన సన్నివేశాలను ప్రదర్శించారు.



డాడీ శ్రీనివాస్, బాలనటులు శ్రీదేవి, భవ్యశ్రీ, పుష్కర్‌ను సత్కరించిన సొసైటీ నిర్వాహకులు


'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 236

శుక్రవారం 17-11-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఆసీస్ ఎనిమిదోసారి

కీలక మ్యాచ్‌లో స్థాయికి తగ్గ ప్రదర్శన కనబరిచి ఆస్ట్రేలియా జట్టు ఎనిమిదోసారి వన్డే ప్రపంచకప్ టోర్నీలో ఫైనల్లోకి దూసుకెళ్లింది. గతంలో మాదిరిగానే ఒత్తిడికి లోనైన దక్షిణాఫ్రికా జట్టు ఐదో ప్రయత్నంలోనూ ఈ మెగా ఈవెంట్‌లో ఫైనల్లోకి ప్రవేశించలేకపోయింది. కోల్‌కతాలో గురువారం జరిగిన రెండో సెమీఫైనల్లో ఆస్ట్రేలియా 3 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది.

- వివరాలు స్పోర్ట్స్‌లో..





సామాజిక సాధికారతకు జై: విజయనగరం జిల్లా రాజాంలో నిర్వహించిన సామాజిక సాధికార యాత్రకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం | డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలో జరిగిన సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం 2లో

రెండంకెల పరుగు

సీఎం జగన్ పాలనలో అన్ని రంగాల్లో భారీగా వృద్ధి నమోదు

నాలుగేళ్లలో ఏకంగా రూ.4.44 లక్షల కోట్లు పెరిగిన జీఎస్‌డీపీ

- ఏటా సగటున 12.70 శాతం వృద్ధితో మొత్తంగా 50.81 శాతం పెరుగుదల
- చంద్రబాబు హయాంలో వ్యవసాయ వృద్ధి తిరోగమనం.. 5.42 శాతం తగ్గుదల
- వైఎస్సార్‌సీపీ పాలనలో వ్యవసాయ రంగంలో 63.19 శాతం వృద్ధి
- పారిశ్రామిక రంగంలో 50.48 శాతం పెరుగుదల
- నిర్మాణ రంగంలో 39.83 శాతం, తయారీలో 48.24 శాతం వృద్ధి
- బ్యాంకింగ్ రంగంలో 71.94 శాతం పెరుగుదల
- సేవారంగంలో 47.43 శాతం పెరుగుదల
- రాష్ట్రంలో రంగాల వారీగా వృద్ధిపై ఆర్బీఐ నివేదిక



సాక్షి, అమరావతి: నాలుగేళ్లలో దాదాపు రూ.నాలుగున్నర లక్షల కోట్లు పెరుగుదల! జీఎస్‌డీపీతో పాటు అన్ని రంగాల్లో ఏటా రెండంకెల వృద్ధి రేటు. ఆర్థిక మందగమనం, కోవిడ్ సంక్షోభాలను అధిగమించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వరుసగా నాలుగేళ్లుగా రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో గణనీయమైన పెరుగుదల నమోదు చేసింది. రాష్ట్ర స్థూల ఉత్పత్తితో పాటు వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగం, నిర్మాణ, తయారీ తదితర అన్ని రంగాల్లో గత నాలుగేళ్లుగా సగటున ఏటా రెండంకెల వృద్ధి నమోదైంది. ఆయా రంగాల్లో ఆర్థిక కార్యకలాపాల ద్వారా 2022–23కి సంబంధించి ఏ మేరకు రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరిగిందో ఆర్బీఐ గురువారం రాష్ట్రాల వారీగా నివేదికను విడుదల చేసింది. ప్రస్తుత ధరల ప్రకారం 2019–20 నుంచి 2022–23 వరకు వరుసగా నాలుగేళ్లుగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువ పెరుగుతూనే ఉందని నివేదిక పేర్కొంది. 2018–19లో చంద్రబాబు హయాంలో ప్రస్తుత ధరల ప్రకారం రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువ రూ.8,73,721.11 కోట్లు ఉండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక 2020–23 నాటికి

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

సాఫ్ట్‌వేర్ సమస్యతో యూకో కస్టమర్లకు రూ. 820 కోట్లు



సాంకేతిక సమస్య వల్ల యూకో బ్యాంకులోని పలువురు కస్టమర్ల ఖాతాల్లోకి ఏకంగా రూ.820 కోట్లు జమయ్యాయి. దీన్ని గుర్తించిన బ్యాంకు రికవరీ ప్రక్రియ ప్రారంభించింది. ఇప్పటికే రూ.649 కోట్లు రాబట్టినట్లు తెలిపింది.

వివరాలు బిజినెస్‌లో ▸

పారిశ్రామిక వృద్ధిలో దేశానికే ఏపీ దిక్సూచి



నాలుగున్నరేళ్లలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికంగా గణనీయమైన అభివృద్ధిని సాధించి, పెట్టుబడుల విషయంలో దేశానికే దిక్సూచిగా నిలిచిందని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. టీడీపీ హయాంలో కుదేలైన పారిశ్రామిక రంగం సీఎం వైఎస్ జగన్ పాలనలో ఊపందుకుందని తెలిపారు.

వివరాలు 3లో ▸

జనసేన X టీడీపీ



టీడీపీ–జనసేన నిర్వహిస్తున్న ఆత్మీయ సమావేశాలు ఇరు పార్టీ నేతల మధ్య ఉన్న అంతరాలను బట్టబయలు చేస్తున్నాయి. తాజాగా జగ్గంపేట, పెడన, మదనపల్లె నియోజకవర్గాల సమావేశాలు ఇరు పార్టీల నేతల వాగ్వాదాలు, బాహాబాహీలతో రసాభాసగా మారాయి. జగ్గంపేట, పెడనలో పరస్పరం కొట్లాడుకున్నారు.

వివరాలు 7లో ▸





వాళ్ల పార్టీ స్టార్ క్యాంపెయినరట!

జిన్‌పింగ్ ఓ నియంత

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వ్యాఖ్య

చైనా అధినేతతో 4 గంటలపాటు భేటీ

పరస్పరం కలిసి పని చేయడానికి ఇరువురు నేతల అంగీకారం

6లో



కాలిఫోర్నియాలో జో బైడెన్, జిన్‌పింగ్ కరచాలనం

> నిజమే, అతడు (జిన్‌పింగ్) ఒక నియంత. కమ్యూనిస్టు దేశమైన చైనాను పరిపాలిస్తున్నాడన్న కోణంలో జిన్‌పింగ్‌ను నియంతగా అభివర్ణిస్తున్నా. అమెరికా కంటే పూర్తి భిన్నమైన పరిపాలన చైనాలో కొనసాగుతోంది. చర్చల్లో మేమిద్దరం కొంత పురోగతి సాధించాం. ఫలవంతమైన, నిర్మాణాత్మక చర్చలు జరిపాం.
> - జిన్‌పింగ్‌తో భేటీ అనంతరం మీడియాతో బైడెన్

మహేంద్ర కుటుంబానికి ప్రభుత్వం అండ

తూర్పుగోదావరి జిల్లా దొమ్మేరులో ఫ్లెక్సీ వివాదం కారణంగా ఆత్మహత్య చేసుకున్న దళిత యువకుడు బొంత మహేంద్ర కుటుంబానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా నిలిచింది. ప్రభుత్వం నుంచి తక్షణ సాయంగా రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎస్.రాజీవ్‌కృష్ణ రూ.10 లక్షలు సాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు.

3లో



దొమ్మేరులో బొంత మహేంద్ర కుటుంబసభ్యులకు చెక్కు అందజేస్తున్న మంత్రి మేరుగు నాగార్జున



మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో

నేడే పోలింగ్

ఎంపీలో మొత్తం 230 సీట్లు

ఛత్తీస్‌లో 70 అసెంబ్లీ స్థానాలు

బీజేపీ, కాంగ్రెస్ హోరాహోరీ

- వివరాలు 6లో

గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న వైఎస్ భారతీరెడ్డి



పురస్కార విజేతలు.. స్ఫూర్తి ప్రదాతలు

ప్రతిభకు గుర్తింపు విషయంలో 'సాక్షి' కృషి ప్రశంసనీయం

సాక్షి మీడియా ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

సాక్షి, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాలు గర్వించే విజయాలు సాధించిన వారికి తగిన గుర్తింపును అందించడంలో సాక్షి మీడియా గ్రూప్ కృషి ప్రశంసనీయమని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అభినందించారు. విభిన్న రంగాల్లో విజయాలు సాధించిన వారిని గౌరవించేందుకు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని జేఆర్సీ కన్వెన్షన్ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన 9వ సాక్షి ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో

మిగతా 7వ పేజీలో ▶

ఇళ్ల సౌకర్యాలు బాగుండాలి

వైఎస్సార్ జగనన్న కాలనీల్లో సదుపాయాలపై నిరంతర పర్యవేక్షణ: సీఎం జగన్

- ఏ చిన్న సమస్య గుర్తించినా వెంటనే పరిష్కరించేలా చర్యలు
- నిర్మాణం పూర్తయిన ప్రతి ఇంటికి ఆడిట్ నిర్వహించాలి
- నీరు, విద్యుత్, ఇంకుడు గుంతలు లాంటివి నిర్ధారించుకోవాలి
- ఇంటి రుణాలపై ప్రభుత్వం భరించే వడ్డీ డబ్బుల విడుదలకు చర్యలు తీసుకోవాలి
- టిడ్కో ఇళ్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశం.. వచ్చే ఫిబ్రవరికి మరో 5 లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేస్తామన్న అధికారులు

2లో



భూ విప్లవం

ఒకేసారి సమస్యలన్నింటికీ పరిష్కారం చూపిన సీఎం జగన్

27.41 లక్షల ఎకరాలపై పేదలకు యాజమాన్య హక్కులు

7లో

గోడు విన్నారు.. పోడు భూములిచ్చారు

ఆర్వోఎఫ్ఆర్ పట్టాల పంపిణీలో దేశానికే ఆంధ్రప్రదేశ్ ఆదర్శం

7లో

బాబు మెడికల్ రిపోర్టు ఇచ్చింది వైద్యులా? రాజకీయ నేతలా?



- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల ధ్వజం
- బెయిల్‌పై బయట ఉండేందుకే ఆ రిపోర్టు ఇచ్చినట్లు ఉంది
- గుండెలో కాల్షియం స్థాయి 900 దాటి ఉంటేనే రిస్క్
- కానీ చంద్రబాబుకు 1,600 ఉందంటూ రిపోర్టు
- పరిధి దాటి నివేదిక ఇవ్వడంలో ఆంతర్యమేంటి?
- సానుభూతి కోసమే చంద్రబాబు నాటకాలు

VIలో

దోచేసిన డబ్బును హవాలా మార్గంలో

మళ్లించారు

- చెన్నప్ప అనే వ్యక్తి ద్వారా సుమన్ బోస్‌కు డబ్బు.. వారి మధ్య కోడ్ భాష
- స్కిల్ కుంభకోణం డబ్బులో కొంత మొత్తం టీడీపీ ఖాతాలకు
- ఆ వివరాలు ఇచ్చేందుకు టీడీపీ అంగీకరించడం లేదు
- సహనిందితుల ద్వారా చంద్రబాబు సాక్షులను ప్రభావితం చేస్తున్నారు
- బెయిల్ కోసం తప్పుడు మెడికల్ రిపోర్టు కోర్టు ముందుంచారు
- ప్రభుత్వ వైద్యులతో పరీక్షలు చేయించుకునేలా ఆదేశాలివ్వండి
- మధ్యంతర బెయిల్ షరతులు ఉల్లంఘించారు

VIలో



- దర్యాప్తునకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నారు.. చంద్రబాబుకు బెయిల్ ఇవ్వొద్దు.. పిటిషన్ కొట్టేయండి
- హైకోర్టుకు నివేదించిన అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి.. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పు రిజర్వ్
- పలు కీలక విషయాలను కోర్టు ముందుంచిన సీఐడీ

సామాజిక సాధికారతకు
జై కొట్టిన కొత్తపేట

బస్సు యాత్రకు పోటెత్తిన జనం

- మహిళలు అత్యధికంగా హాజరు
- బైక్‌లతో భారీ ర్యాలీ చేసిన యువత
- యాత్రకు గజమాలలతో స్వాగతం పలికిన ప్రజలు
- జగన్ గెలుపు మన అవసరం అన్న మంత్రులు


కొత్తపేటలో జరిగిన సభలో ప్రసంగిస్తున్న మంత్రి కారుమూరి

సాక్షి అమలాపురం: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాధించిన సామాజిక సాధికారతకు కొత్తపేట జై కొట్టింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రకు జనం పోటెత్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు వేలాదిగా తరలిరావడంతో కొత్తపేట మెయిన్ రోడ్డు జన గోదావరిని తలపించింది. ఈ కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరు కావడం గమనార్హం. ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో రావులపాలెం నుంచి బస్సు యాత్ర ప్రారంభమైంది. యువత మోటార్ సైకిల్ ర్యాలీతో యాత్రను అనుసరించారు. ప్రజలు పూలు జల్లుతూ భారీ గజమాలలతో ఎదురేగి యాత్రకు స్వాగతం పలికారు. పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు కొత్తపేట సభలో పాల్గొన్నారు. సీఎం జగన్ సామాజిక విప్లవం, సంక్షేమ పాలనను వివరించినప్పుడు సభకు హాజరైన ప్రజలు హర్షధ్వానాలు చేశారు.

సామాజిక న్యాయం చేసింది జగన్ ఒక్కరే: మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

పార్టీలకు అతీతంగా పేదల అభ్యున్నతికి కృషి చేస్తూ సామాజిక న్యాయం చేస్తున్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఒక్కరే నని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చెప్పారు. చంద్రబాబు సీఎంగా ప్రమాణం చేశాక నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో వారి వాళ్లకు, ఆయన పార్టీ వాళ్లకు మాత్రమే పని చేయాలని చెప్పారన్నారు. సీఎం జగన్ మాత్రం కులం, మతం, పార్టీలు అని చూడకుండా ప్రతి పేదవాడికీ మేలు చేయాలని చెప్పారని, అదే చేస్తున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధికి సీఎం జగన్ చేస్తున్న కృషి నభూతో నభవిష్యతి అని చెప్పారు. పిల్లి సుభాష్ చంద్రబోస్, మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్ రావు, ఆర్.కృష్ణయ్య ఎంపీలు అయ్యారంటే అందుకు జగన్ కారణమన్నారు.

ఇది దేశంలోనే ఒక చరిత్ర: మంత్రి చెల్లుబోయిన

నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అంటూ సీఎం జగన్ ఈ వర్గాలను అక్కున చేర్చుకున్నారని మంత్రి చెల్లుబోయిన చెప్పారు. చంద్రబాబు పాలనలో వివక్షకు గురైన అణగారిన వర్గాలకు రాజ్యాధికారం ఇచ్చి, సంక్షేమ పథకాల ద్వారా వారి అభ్యున్నతికి సీఎం కృషి చేస్తున్నారని, ఇది దేశంలోనే ఒక చరిత్ర అని అన్నారు.

పేదలవైపు ఉన్నది జగన్ ఒక్కరే: శాసన మండలి చైర్మన్ మోషేన్ రాజు

రాష్ట్రంలో పెత్తందారులకు, పేదలకు జరుగుతున్న పోరాటంలో పేదల వైపు ఉన్నది జగన్ ఒక్కరేనని శాసన మండలి చైర్మన్ మోషేన్ రాజు చెప్పారు. దళితులు, అణగారిన వర్గాల వారికి ఉన్నత పదవులు అందించి, ఈ వర్గాల అభ్యున్నతికి సీఎం జగన్ చర్యలు చేపట్టారని వివరించారు.

జగన్ గెలుపు మన అవసరం: మంత్రి మేరుగు నాగార్జున

సీఎం జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావడం రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అవసరమని మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. ఇంతమంది వెనుకబడిన, దళిత వర్గాల వారం వేదిక మీద ఉన్నామంటే సీఎం జగనే కారణమని అన్నారు. వెనుకబడిన వారిని జగన్ బ్యాక్ వర్డ్ క్యాస్ట్ కాదు.. బ్యాక్ బోన్ క్యాస్ట్‌గా గుర్తించారని తెలిపారు. పేద పిల్లలకు ఇంగ్లిష్ మీడియంతోపాటు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను సీఎం జగన్ అందిస్తున్నారని, దీని వల్ల వారి భవిష్యత్తు ఉన్నతంగా మారుతోందని వివరించారు.

గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా సచివాలయ వ్యవస్థ: ఎంపీ మార్గాని భరత్

గాంధీ మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపన లక్ష్యంగా సీఎం జగన్ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ చెప్పారు. ప్రజల ముంగిటకు ప్రభుత్వ పాలన, సంక్షేమ పథకాలు తేవడంలో జగన్ ఒక శక్తిలా పని చేస్తున్నారని తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వాలంటీర్ల వ్యవస్థను ఉంచుతారో తీసేస్తారో చెప్పలేని పరిస్థితుల్లో ఉన్నారని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎంపీ చింతా అనూరాధ, ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, పోతుల సునీత, బొమ్మి ఇజ్రాయిల్, పండుల రవీంద్రబాబు, తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం జిల్లా రాజాంలో జరిగిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం


రాజాంలో సామాజిక జైత్రయాత్ర

- యాత్రలో పెద్ద ఎత్తున యువత, మహిళలు
- 3 వేల బైక్‌లతో యువత ర్యాలీ
- ఘనంగా స్వాగతం పలికిన ప్రజలు
- రాజాం సభకు వేలాదిగా తరలివచ్చిన ప్రజలు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అందిస్తున్న సుపరిపాలనలో రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధిని ప్రతిబింబిస్తూ వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర విజయనగరం జిల్లా రాజాంలో ఆ వర్గాల జైత్రయాత్రలా ఘనంగా సాగింది. ఈ యాత్రకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. యువత, మహిళలు యాత్రలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రాజాం మండలం బొద్దాం గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను యాత్రలో పాల్గొన్న మంత్రులు, ఇతర నేతలు ప్రారంభించారు. అక్కడి నుంచి ప్రధాన రహదారి మీదుగా ప్రారంభమైన యాత్ర రాజాం పట్టణ సమీపంలో కంచరాం తృప్తి రిసార్ట్ వరకూ సాగింది. మధ్యాహ్నం 3.30 గంటలకు రాజాం పట్టణంలోకి ప్రవేశించింది. దాదాపు మూడు వేల మంది బైక్‌ర్యాలీగా బస్సు యాత్ర ముందు సాగారు. అంబేడ్కర్ కూడలిలో సాయంత్రం 4 గంటలకు భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు రాజాం, వంగర, సంతకవిటి, రేగిడి మండలాలకు చెందిన వేలాది మంది తరలివచ్చారు. వెనుకబడిన వర్గాలకు సీఎం వైఎస్ జగన్ చేసిన మేలును నేతలు వివరిస్తుంటే చప్పట్లతో స్వాగతించారు. జై జగన్.. జై జై జగన్ అంటూ నినదించారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఆత్మ బంధువు సీఎం జగన్: స్పీకర్ తమ్మినేని సీతారాం

రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆత్మ బంధువు అని శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం చెప్పారు. దేశంలో మరే సీఎం చేయని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్ని పదవుల్లో పెద్దపీట వేసి, అనేక పథకాలతో అభివృద్ధి పథం వైపు నడిపిస్తున్నారని చెప్పారు. అందుకే ఈరోజు సామాజిక సాధికార యాత్రను ఓ జైత్రయాత్ర నిర్వహించుకోగలుగుతున్నామన్నారు. 139 బీసీ సామాజికవర్గాలను గుర్తించి 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేశారని, వాటికి చైర్మన్‌లతో పాటు 700 డైరెక్టర్ల పదవులను ఇచ్చి ఆత్మగౌరవాన్ని కాపాడారని వివరించారు. కులగణన జరగాలని దేశంలోనే మొట్టమొదటగా మంత్రివర్గంలో నిర్ణయం తీసుకున్నదీ సీఎం జగనే అని చెప్పారు. విద్య, వైద్యాన్ని బడుగు, బలహీనవర్గాలకు చేరువ చేస్తూ జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నారని, ఇదే అసలైన అభివృద్ధి అని వివరించారు. తాండ్ర పాపారాయుడు పుట్టిన గడ్డపై ఓట్ల కోసం అబద్ధాలు చెప్పే టీడీపీ నాయకులను తిప్పికొడతామని హెచ్చరించారు.

సంతృప్తకర స్థాయిలో సంక్షేమం: ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీలంటూ నాలుగున్నరేళ్లుగా సీఎం వైఎస్ జగన్ ఈ వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్నారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు చెప్పారు. సంక్షేమ పథకాలను సంతృప్తికర స్థాయిలో అమలు చేస్తున్నారని, అన్ని రంగాలనూ అభివృద్ధి చేస్తూ సుపరిపాలన అందిస్తున్నారని తెలిపారు.

గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి: ఎమ్మెల్యే జోగులు

రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడుతూ రాజాం నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి జరిగిందన్నారు. నామినేటెడ్ పదవుల్లో ఈ ప్రాంతానికి చెందిన సామాజిక వర్గానికి 70 శాతం మేర పదవులు వచ్చాయని వెల్లడించారు. నాగావళి నదిపై రుషింగి, కిమ్మి గ్రామాల మధ్య వంతెన నిర్మాణానికి వైఎస్ రాజశేఖరరెడ్డి రూ. 25 కోట్లు మంజూరుచేస్తే, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ పనులు పూర్తిచేయించారని చెప్పారు. తోటపల్లి రెగ్యులేటర్ కుడికాలువ ఆధునికీకరణకు రూ.40 కోట్లు మంజూరుచేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, విశ్వాసరాయి కళావతి, పాముల పుష్పశ్రీవాణి, అలజంగి జోగారావు, బొత్స అప్పలనర్సయ్య, శంబంగి వెంకటచిన్న అప్పలనాయుడు, విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇళ్ల సౌకర్యాలు బాగుండాలి

వైఎస్సార్ జగనన్న కాలనీల్లో సదుపాయాలపై నిరంతర పర్యవేక్షణ: సీఎం జగన్


గృహ నిర్మాణ శాఖపై ఉన్నత స్థాయి సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా నిరుపేద అక్కచెల్లెమ్మల ఇంటి నిర్మాణం కోసం మంజూరు చేసిన బ్యాంకు రుణాలకు సంబంధించి వడ్డీ డబ్బుల విడుదలకు చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఇళ్ల లబ్ధిదారులపై భారం పడకుండా అదనపు సాయం కింద పావలా వడ్డీకి రూ.35 వేల చొప్పున బ్యాంకు రుణాలను అందిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటివరకూ మంజూరు చేసిన రుణాలకు సంబంధించి ప్రభుత్వం భరించే వడ్డీ మొత్తాన్ని జమ చేసేందుకు సన్నాహాలు చేయాలని సూచించారు. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. ఎక్కడ ఏ చిన్న సమస్య తలెత్తినా వెంటనే సరిదిద్దేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. గృహ నిర్మాణ శాఖపై గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం పురోగతిని పరిశీలించి అధికారులకు కీలక సూచనలు చేశారు.

ప్రతి ఇంటినీ ఆడిట్ చేయండి

జగనన్న కాలనీల రూపంలో ఏకంగా 17 వేలకు పైగా ఊళ్లనే కొత్తగా నిర్మిస్తున్నాం. ఈ క్రమంలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. నిర్మాణాలు పూర్తి చేసుకున్న ప్రతి ఇంటిని ఆడిట్ చేయాలి. అందులో భాగంగా విద్యుత్, తాగునీరు కనెక్షన్లు ఇచ్చారా? ఇంకుడు గుంత ఉందా? తదితర అంశాలను పరిశీలించాలి. ఇంటి నిర్మాణంలో పేదలపై భారం పడకూడదు అదనపు సాయం కింద పావలా వడ్డీకి బ్యాంకు రుణాలను మంజూరు చేశాం. మిగిలిన వడ్డీని ప్రభుత్వం భరిస్తుంది. ఇప్పటి వరకూ మంజూరు చేసిన రుణాలపై వడ్డీ డబ్బుల విడుదలకు సన్నద్ధం కావాలి.

ఫిబ్రవరికి మరో ఐదు లక్షల ఇళ్లు

నవరత్నాల పథకం కింద 21.25 లక్షల పేదల ఇళ్లకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వగా ఈ ఏడాది అక్టోబర్ నాటికి 7.43 లక్షల గృహ నిర్మాణాలను పూర్తి చేసి పేదింటి అక్కచెల్లెమ్మలకు అందించినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నట్లు వివరించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి మరో 5 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టామని, ఇందుకు సంబంధించిన పనులు చురుగ్గా సాగుతున్నాయని వెల్లడించారు. గత సమీక్షలో సీఎం నిర్దేశించిన ప్రకారం నిర్మాణాలు పూర్తై లబ్ధిదారులకు అందించిన ఇళ్లకు సంబంధించి మౌలిక సదుపాయాలపై నిశితంగా పరిశీలన చేసినట్లు వివరించారు. విద్యుత్, తాగునీరు సౌకర్యాలను సమకూర్చడంతోపాటు ఇంకుడు గుంతలు, ఇతర సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. ఇళ్ల నిర్మాణం కోసం అదనపు సాయం కింద 12,72,143 మంది మహిళలకు పావలా వడ్డీకి రూ.35 వేలు చొప్పున రుణాలను అందించామన్నారు. ఇలా రూ.4,483 కోట్ల మేర రుణాలను మహిళలు అందుకున్నట్లు సీఎం దృష్టికి తెచ్చారు. సమీక్షలో గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దవులూరి దొరబాబు, సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి దీవాన్ మైదీన్, టిడ్కో ఎండీ శ్రీధర్, మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ


పట్టణ ప్రాంత పేదలకు అందించిన టిడ్కో ఇళ్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన అసోసియేషన్లు సమర్థంగా పనిచేసేలా చూడాలి. వారికి తగిన అవగాహన కల్పించి ప్రభుత్వం అందించిన రూ.లక్షల విలువైన ఆస్తిని ఎలా సమర్థంగా నిర్వహించుకోవాలో దిశానిర్దేశం చేయాలి. తద్వారా భవనాలు నాణ్యతగా ఉండటంతోపాటు పరిసరాలు నిరంతరం పరిశుభ్రంగా ఉండేలా పర్యవేక్షణ ఉంటుంది.

రెండంకెల పరుగు..



▶ మొదటి పేజీ తరువాయి

నాలుగేళ్లలో రూ.13,17,728.15 కోట్లకు పెరిగింది. అంటే నాలుగేళ్లలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి ఏకంగా రూ.4.44 లక్షల కోట్లకుపైగా పెరగడం గమనార్హం. కోవిడ్ లాంటి సంక్షోభాలు లేనప్పటికీ టీడీపీ హయాంలో వ్యవసాయ రంగం వృద్ధి తిరోగమనంలోకి వెళ్లినట్లు ఆర్బీఐ గణాంకాలు స్పష్టం చేశాయి.



- గత నాలుగేళ్లలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువ 50.81 శాతం పెరగ్గా ఏటా సగటున వార్షిక వృద్ధి 12.70 శాతం నమోదైంది. కోవిడ్ సంక్షోభ సమయంలో వ్యవసాయ రంగానికి, రైతులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది. వ్యవసాయం, అనుబంధ రంగాల కార్యకలాపాలు కొనసాగేలా చర్యలు తీసుకుంది. దీంతో వరుసగా నాలుగేళ్లు వ్యవసాయ రంగంలో ఏటా సగటున రెండంకెల వృద్ధి నమోదైంది. ప్రస్తుత ధరల ప్రకారం నాలుగేళ్లలో వ్యవసాయ రంగంలో రూ.68,808.49 కోట్ల మేర ఉత్పత్తి పెరిగి 63.19 శాతం వృద్ధి నమోదైంది. అంటే ఏటా సగటున 15.79 శాతం వార్షిక వృద్ధి నమోదైంది. ప్రస్తుత ధరల ప్రకారం చంద్రబాబు హయాంలో 2017–18తో పోల్చితే 2018–19లో వ్యవసాయ రంగం వృద్ధి 5.42 శాతం మేర క్షీణించినట్లు ఆర్బీఐ గణాంకాలు స్పష్టం చేశాయి.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండేళ్ల పాటు కోవిడ్ సంక్షోభం ఉన్నా దాన్ని అధిగమించి పారిశ్రామిక రంగంలో ఏటా సగటున రెండంకెల వృద్ధి నమోదైంది. 2019–20 నుంచి 2022–23 వరకు వరుసగా నాలుగేళ్లలో పారిశ్రామిక రంగంలో రూ.95,220.02 కోట్ల మేర ఉత్పత్తి పెరిగి 50.48 శాతం వృద్ధి నమోదైంది. అంటే ఏటా సగటున వార్షిక వృద్ధి 12.62 శాతం ఉంది.
- గత నాలుగేళ్లలో సేవా రంగంలోనూ భారీ వృద్ధి నమోదైంది. సేవా రంగంలో రూ.1,58,255.53 కోట్ల మేర ఉత్పత్తి విలువ పెరిగి 47.43 శాతం వృద్ధి నమోదైంది. ఏటా సగటు వార్షిక వృద్ధి సేవారంగంలో 11.87 శాతం నమోదైనట్లు స్పష్టమైంది. నిర్మాణ రంగంలో రూ.23,931.67 కోట్ల మేర ఉత్పత్తి పెరిగి 39.83 శాతం వృద్ధి నమోదైంది. ఏగా సగటున వార్షిక వృద్ధి 9.95 శాతంగా ఉంది. తయారీ రంగంలో రూ.40,582.27 కోట్ల మేర ఉత్పత్తి పెరిగి 48.24 శాతం వృద్ధి నమోదైంది. అంటే ఏటా సగటు వార్షిక వృద్ధి 12.06 శాతంగా ఉంది. నాలుగేళ్లలో బ్యాంకింగ్ రంగంలో రూ.23,878.47 కోట్ల మేర విలువ పెరిగి 71.94 శాతం వృద్ధి నమోదైంది. ఏటా సగటు వార్షిక వృద్ధి 17.98 శాతంగా ఉంది.
- రాష్ట్రం తీవ్ర కోవిడ్ సంక్షోభాన్ని ఎదుర్కొన్నప్పటికీ 2019–20 నుంచి 2022–23 వరకు వరుసగా నాలుగేళ్లుగా తలసరి ఆదాయం పెరుగుతూనే ఉందని ఆర్బీఐ గణాంకాలు స్పష్టం చేశాయి. 2022–23లో రాష్ట్ర తలసరి ఆదాయం తొలిసారిగా రూ.రెండు లక్షలు దాటిందని నివేదిక వెల్లడించింది.

బాధితులకు తక్షణం సహాయం

మాచర్ల పర్యటనలో మానవత్వం చాటుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, నరసరావుపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనారోగ్య, ఇతర బాధితులకు అండగా నిలిచి, వారికి తక్షణ సహాయం అందేలా చూశారు. వరికపుడిశెల ఎత్తిపోతల పథకం శంకుస్థాపనకు బుధవారం పల్నాడు జిల్లా మాచర్ల పర్యటనకు వెళ్లిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. 20 మంది బాధితుల గోడు స్వయంగా విని, వివరాలు తెలుసుకుని వారిని తక్షణం ఆదుకోవాలని పల్నాడు జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆ బాధితులకు గురువారం జిల్లా కలెక్టరేట్‌లో ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున 20 మందికి రూ. 20 లక్షలు ఆర్థిక సాయం చేశారు. సహాయం అడగ్గానే మానవత్వం చూపించి, ఆర్థిక సహాయం చేసిన సీఎంకు బాధితులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆర్థిక సాయం పొందినవారు.. నూతలపాటి రాణి (నవజాత శిశువు), రావిపాడు, నరసరావుపేట మండలం., వెంకట శివ పూర్వన్, నరసరావుపేట., డి.మోక్షిత, గింజుపల్లి తాండా, అచ్చంపేట., టి.హాస్సేన్ మోక్షజ్ఞ, బండ్లమోటు, బొల్లాపల్లి మండలం., పి.నాగేశ్వరరెడ్డి, దొండపాడు, నరసరావుపేట మండలం., బుసి ఎమాన్యులియన్, బ్రాహ్మణపల్లి, పిడుగురాళ్ల మండలం., బానావత రమేశ్ నాయక్, నీలేశ్వరపాలెం, అచ్చంపేట మండలం., రమేష్ బాబు, అంగలూరు, ఈపూరు మండలం., ఎ.వెంకట శివసాయి అక్షయ్, తంగేడ, దాచేపల్లి మండలం., బి.గిరిజా ప్రసాద్ కుమార్తె (నవజాత శిశువు), తంగేడ గ్రామం, దాచేపల్లి మండలం., మాచెర్ల నిస్సిప్రియ, రావిపాడు, నరసరావుపేట మండలం., వి.సాయితేజ, మాచర్ల., అమరరోజ్ సాయి రమణ, క్రోసూరు., కె.అంజిరెడ్డి, చింతగుంటపాలెం, పర్చూరు మండలం., సయ్యద్ జాస్మిన్, అడిగొప్పుల, దుర్గి మండలం., బత్తుల సౌమ్య, హనుమానగర్, వినుకొండ., కె.రామలక్ష్మి శరణ్య, మాచర్ల., కటకం జయశ్రీ, దాచేపల్లి., జె. వెంకట సూర్య గోపీచంద్, ఒప్పిచెర్ల, కారెంపూడి., పి.రజనీకుమారి, రావిపాడు, నరసరావుపేట మండలం.


సీఎం వైఎస్ జగన్‌కు సమస్యను వివరిస్తున్న గిరిజా ప్రసాద్ ←


పల్నాడు జిల్లా కలెక్టర్ చేతులు మీదుగా చెక్ అందుకుంటున్న గిరిజా ప్రసాద్


సీఎం వైఎస్ జగన్‌కు సమస్యను వివరిస్తున్న సౌమ్య తండ్రి ఆనంద్


చెక్ అందుకుంటున్న చిన్నారి సౌమ్య తండ్రి ఆనంద్


సీఎం వైఎస్ జగన్‌కు సమస్యను వివరిస్తున్న నిస్సి ప్రియ తల్లి


చెక్ అందుకుంటున్న చిన్నారి నిస్సి ప్రియ తండ్రి భరత్

శ్రీసిటీని సందర్శించిన జపాన్ బృందం



వరదయ్యపాళెం(తిరుపతి జిల్లా): జపాన్ రాయబార కార్యాలయ ఉన్నతాధికారుల బృందం గురువారం శ్రీసిటీని సందర్శించింది. ఆర్థికమంత్రి క్యోకో హోకుగో తోపాటు ఎంబసీ ప్రథమ కార్యదర్శులు మసాహిరో కవాకమి, జునిచిరో సుజుకి, చెన్నైలోని జపాన్ కాన్సులేట్ అధికారి నవోకో యుజావా ఈ పర్యటనలో పాల్గొన్నారు. వీరికి శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సాదర స్వాగతం పలుకగా, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్. శివశంకర్ శ్రీసిటీలో ప్రపంచ శ్రేణి మౌళిక సదుపాయాలు, పారిశ్రామిక ప్రగతి, ప్రత్యేకతల గురించి వివరించారు. శ్రీసిటీలోని అనుకూల వాతావరణంపై క్యోకో హోకుగో సంతృప్తి వ్యక్తం చేశారు.

ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. వివరించే కార్యక్రమంలో భాగంగా..


విశాఖ జిల్లా గండిగుండంలో జగనే రాష్ట్రానికి ఎందుకు కావాలి అనే అంశాలతో రూపొందించిన బుక్‌లెట్‌ను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి ప్రదర్శిస్తున్న ప్రజలు


శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా దంపూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాలను ఎగురవేసిన సర్పంచ్ సురేంద్రరెడ్డి, గ్రామస్తులు


కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం రమణయ్యపేటలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం పేచుపాలెంలో ఇంటింటికీ వెళ్లి బ్రోచర్‌ను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, గృహ సారథులు


ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట సచివాలయంలో సంక్షేమ పథకాల అమలు డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరిస్తున్న తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి


నంద్యాల జిల్లా రుద్రవరం మండలంలోని చిన్నకంబలూరులో వైఎస్సార్‌సీపీ జెండాలు ప్రదర్శిస్తున్న పార్టీ నాయకులు


శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం కొర్లాం సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ


విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం ఒమ్మి గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బడుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు


అనంతపురం జిల్లా ఉరవకొండలోని సచివాలయం-3 వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తదితరులు


తిరుపతిలో ఇంటింటికి వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తున్న టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి


అన్నమయ్య జిల్లా మదనపల్లెలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరించిన ఎమ్మెల్యే నవాజ్‌బాషా

టీడీపీ ఖాతాల్లోకి 'స్కిల్' సొమ్ము

2016లో నోట్ల రద్దు సమయంలో విడతల వారీగా రూ.65.86 కోట్లు జమ.. నాలుగు బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ

- ఆదాయ మార్గాలు వెల్లడించకుండానే డిపాజిట్
- స్కిల్ స్కాం కేసులో సీఐడీ దర్యాప్తులో వెల్లడి
- నిధుల వివరాలు చెప్పాలని టీడీపీకి సీఐడీ నోటీసులు

సాక్షి, అమరావతి: 'స్కిల్' స్కాంలో రోజుకో కథ వెలుగులోకి వస్తోంది. టీడీపీ హయాంలో చోటు చేసుకున్న ఈ కుంభకోణం ద్వారా దోచుకున్న సొమ్ములో సింహభాగం చంద్రబాబుకు చేరినట్లు సీఐడీ గుర్తించింది. ఆ తర్వాత ఈ సొమ్మును ఏపీ ఖాతాల్లోకి మళ్లించారన్న విషయాన్ని దర్యాప్తు సంస్థ తాజాగా ఆధారాలతో సహా తేల్చింది. నిజానికి.. సీమెన్స్ కంపెనీకి తెలియకుండా ఆ ప్రాజెక్టు పేరుతో దోచుకున్న రూ.371 కోట్లలో రూ.241 కోట్లు హవాలా మార్గంలో చంద్రబాబుకు చేరాయని సీఐడీ తన దర్యాప్తులో ఇప్పటికే నిగ్గుతేలింది. అనంతరం ఆ మొత్తాన్ని అక్రమంగా ఏ ఏ ఖాతాల్లోకి మళ్లించారో కూడా సీఐడీ ఇప్పుడు వెలుగులోకి తీసుకొచ్చింది. అందులోని రూ.65.86 కోట్లు టీడీపీ బ్యాంకు ఖాతాల్లోకి చేరినట్లు ఆధారాలతో సహా గుర్తించింది. దీంతో చంద్రబాబు అవినీతికి సంబంధించి మరిన్ని ఆధారాలు వెలుగులోకి వచ్చినట్లయింది.

నాలుగు ఖాతాలు.. రూ.65.86 కోట్లు..

రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధులను చంద్రబాబు హయాంలో నిబంధనలకు విరుద్ధంగా విడుదల చేసిన సమయంలోనే.. గుర్తుతెలియని ఆదాయ మార్గాల ద్వారా టీడీపీ బ్యాంకు ఖాతాల్లోకి ఆ నిధులు చేరాయి. ఇందుకు సంబంధించి సీఐడీ కీలక ఆధారాలు సేకరించింది. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో నాలుగు బ్యాంకు ఖాతాల్లోకి టీడీపీ పేరిట మొత్తం రూ.65,86,47,510లు మళ్లించారు. జూబ్లీహిల్స్‌లోని బ్యాంకు ఆఫ్ బరోడా బ్రాంచిలో టీడీపీకి మూడు ఖాతాలున్నాయి. ఆ మూడు ఖాతాల్లో వరుసగా రూ.4,81,60,587, రూ.25,31,31,352, 2,26,28,500 జమచేశారు. అలాగే, అదే ప్రాంతంలోని యూనియన్ బ్యాంకు ఖాతాలో మరో రూ.33,47,27,071 డిపాజిట్ చేశారు.

గోప్యంగా ఆదాయ మార్గాలు..

దర్యాప్తులో భాగంగా ఆ బ్యాంకు ఖాతాల వివరాలను సీఐడీ పరిశీలించగా అసలు విషయం బయటపడింది. 2016 నవంబరు నుంచి 2017 జనవరి మధ్యలో ఆ నిధులను డిపాజిట్ చేశారు. అంతేకాక.. రూ.500, రూ.వెయ్యి నోట్ల కట్టలను తీసుకొచ్చి మరీ డిపాజిట్ చేసినట్లు సీఐడీ గుర్తించింది. ఇక ఈ నిధులు తమకు ఏ ఆదాయ మార్గాల ద్వారా వచ్చాయన్నది డిపాజిట్ సమయంలో టీడీపీ వెల్లడించకపోవడం ఆశ్చర్యకరం. ఎందుకంటే.. 2016లో పెద్దనోట్ల రద్దుచేసినప్పుడు భారీ డిపాజిట్లకు ఆదాయ మార్గాలను పేస్లిప్‌లో వెల్లడించాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. కానీ, టీడీపీ అటువంటివేవీ వెల్లడించకుండానే దాని ఖాతాల్లోకి ఏకంగా రూ.65.86 కోట్లు జమయ్యాయి.

టీడీపీకి సీఐడీ నోటీసులు..

టీడీపీ బ్యాంకు ఖాతాల్లో చేరిన నిధుల వివరాలను చెప్పాలని టీడీపీ ప్రధాన కార్యాలయానికి ని సీఐడీ నోటీసులు జారీచేసింది. అందుకు టీడీపీ కోరిన నాలుగు వారాల గడువును కూడా అనుమతించింది. కానీ, గడువు ముగిసినప్పటికీ ఆ పార్టీ ఎలాంటి వివరాలను వెల్లడించలేదు. దాంతో 2014 నుంచి 2019 వరకు టీడీపీ బ్యాంకు ఖాతాల వివరాలను తెలపాలని సీఐడీ తాజాగా టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి–కోశాధికారి పేరిట నోటీసులు జారీచేసింది. ఈనెల 18న సీఐడీ కార్యాలయానికి వచ్చి ఆ వివరాలను చెప్పి దర్యాప్తునకు సహకరించాలని అందులో పేర్కొంది.

మహేంద్ర కుటుంబానికి ప్రభుత్వం అండ

దొమ్మేరులో దళిత యువకుడి కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి మేరుగు, ముఖ్య నేతలు.. రూ.20 లక్షల పరిహారం అందజేత

కొవ్వూరు: తూర్పుగోదావరి జిల్లా దొమ్మేరులో ఫ్లెక్సీ వివాదం కారణంగా ఆత్మహత్య చేసుకున్న దళిత యువకుడు బొంత మహేంద్ర కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి తక్షణ సాయంగా రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎస్.రాజీవ్‌కృష్ణ రూ.10 లక్షలు సాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు గురువారం దొమ్మేరు వచ్చారు. మేరుగు నాగార్జున, వెంకట్రావు, రాజీవ్ కృష్ణ వెళ్లి మహేంద్ర కుటుంబాన్ని పరామర్శించి రూ.20లక్షలు ఆర్థిక సాయం అందించారు. మహేంద్ర కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అల్లర్లకు సంబంధించి గ్రామ యువకులపై కేసులు లేకుండా చూడాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను తక్షణమే అరెస్ట్ చేయాలని విజ్ఞప్తిచేశారు. చట్టప్రకారం నిందితులపై చర్యలు తీసుకుంటామని నాయకులు హామీ ఇచ్చారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే ఎస్ఐ భూషణాన్ని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

మహేంద్ర కుటుంబానికి పూర్తిస్థాయిలో సాయం అందించడానికి సిద్ధం

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తాము దొమ్మేరు వచ్చినట్లు మంత్రి నాగార్జున, నాయకులు తెలిపారు. మహేంద్ర మృతి బాధాకరమన్నారు. ప్రభుత్వపరంగా పూర్తిస్థాయిలో సాయం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. టీడీపీ పాలనలో గరగపర్రులో దళితులపై దాడులు, మహిళలను వివస్త్రలను చేయడం, హత్యలు, దాడులతో సహా ఎన్నో అరాచకాలు చేశారని గుర్తుచేశారు. అయినా నాటి సీఎం చంద్రబాబు ఏ నాడు పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ పేదలు, దళితులకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ, ఇతర నాయకులు పాల్గొన్నారు. కాగా, దొమ్మేరులో అల్లర్లు సద్దుమణిగాయి. ఎస్పీ జగదీష్ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా...

ధూళిపాళ్ల సహా 15 మందిపై కేసు నమోదు

చేబ్రోలు: బోనస్ డబ్బులు ఇవ్వాలని అడిగిన ఏలూరు జిల్లాకు చెందిన పాడి రైతులపై సంగం డెయిరీ కిరాయి సిబ్బంది దాడి చేసిన ఘటనలో 15మందిపై చేబ్రోలు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ కె.ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు జిల్లా రంగాపురం, వేములపల్లి గ్రామాలకు చెందిన పాడి రైతులకు సంగం డెయిరీ నుంచి బోనస్ డబ్బులు చెల్లించాల్సి ఉంది. చాలారోజుల నుంచి జాప్యం జరుగుతుండటంతో అక్కడి రైతులు వేములపల్లి గ్రామ సర్పంచ్ ముసులూరి రాము, నర్సన్నపాలెం సర్పంచ్ కూరపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం సంగం డెయిరీకి వచ్చి యాజమాన్యం దృష్టికి తమ సమస్యను తెలియజేసేందుకు ప్రయత్నించారు. డెయిరీ వద్ద రైతులపై కొందరు వ్యక్తులు ఒక్కసారిగా కర్రలు, రాడ్లు, రాళ్లతో దాడి చేశారు. దాడిలో మూడు కార్లు ధ్వంసమయ్యాయి. ఏడుగురికి గాయాలు కాగా, వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. వేములపల్లి సర్పంచ్ ముసులూరి రాము, బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌తోపాటు 15మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేదలకు 'ఇంగ్లిష్' చదువు వద్దా బాబూ..


1,145వ రోజు దీక్షలో బహుజన నేతలు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నాయకులు

తాడికొండ: తమ పిల్లలను మాత్రం ఇంగ్లిష్ మీడియంలో చదివిస్తూ.. పేదలకు ఆ హక్కు లేదని కోర్టుల్లో తప్పుడు కేసులు వేయించిన చంద్రబాబు అండ్‌కోను రాజకీయంగా తరిమికొట్టాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు పిలుపునిచ్చారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారం 1,145వ రోజుకు చేరాయి. నాయకులు మాట్లాడుతూ పేదలకు రాజ్యాంగపరంగా రావాల్సిన హక్కులను అడ్డుకుంటూ ఇబ్బందులకు గురిచేసేందుకు రాష్ట్రంలో ఓ కుల మాఫియా గ్యాంగ్ తయారైందన్నారు. పేదలకు రాజధానిలో జానెడు జాగా, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్య, వికేంద్రీకరణ ద్వారా బహుజనులకు సమాన హక్కులు, ఫలాలు, అభివృద్ధి అందుతుంటే తప్పుడు కేసులు వేసి అడ్డుకుంటూ రాక్షసానందం పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వ్యవస్థలను ప్రభావితం చేయగల చంద్రబాబు.. ఆరోగ్య కారణాలను చూపి జైలు నుంచి తప్పించుకు తిరగడం ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమన్నారు. చంద్రబాబు బెయిలు రద్దు చేసి జైలుకు పంపాలని కోరారు. నాయకులు మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, పులి దాసు, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మునిగిపోయే నావ..

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్



సీతమ్మధార (విశాఖ ఉత్తర): తెలుగుదేశం పార్టీ మునిగిపోయే నావ అని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ అన్నారు. ఆశీలమెట్టలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రానికి రావాల్సిన పెట్టుబడుల కోసం సమ్మిట్ నిర్వహించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలుస్తానన్నారు. 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి 175 నియోజకవర్గాల్లో ప్రజాశాంతి పార్టీ పోటీ చేస్తుందని చెప్పారు. స్టీల్‌ప్లాంట్‌కు చెందిన 19 వేల ఎకరాల భూములను అమ్మేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తుందని మండిపడ్డారు. తెలంగాణ సీఎం కేసీఆర్, టీడీపీ అధినేత చంద్రబాబుకు ప్రధాని మోదీని ఢీకొనే దమ్ములేదని, విశాఖను అభివృద్ధి చేయడానికి ఎంపీగా పోటీ చేస్తానన్నారు.

పారిశ్రామిక వృద్ధిలో దేశానికే ఏపీ దిక్సూచి

- టీడీపీ హయాంలో పారిశ్రామిక రంగం కుదేలైంది
- సీఎం జగన్ పాలనలో ఊపందుకుంది
- జీఐఎస్‌లో ఎంవోయూలు కార్యరూపం దాలుస్తున్నాయి
- ఇండోసోల్‌కు భూమి కేటాయించడం తప్పట
- చంద్రబాబు స్క్రిప్టును నాదెండ్ల కట్టప్ప చదువుతున్నారు
- పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: నాలుగున్నరేళ్ల వైఎస్ జగన్ పరిపాలనలో రాష్ట్రంలో పారిశ్రామికంగా గణనీయమైన అభివృద్ధిని సాధించి, పారిశ్రామిక పెట్టుబడుల విషయంలో దేశానికే దిక్సూచిగా నిలిచిందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. ఆయన గురువారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ హయాంలో కుదేలైన పారిశ్రామిక రంగం సీఎం వైఎస్ జగన్ పాలనలో ఊపందుకుందని తెలిపారు. విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)లో జరిగిన ఒప్పందాలు కార్యరూపం దాలుస్తున్నాయని చెప్పారు. తాజాగా రూ.20 వేల కోట్ల ఎంవోయులకు అవసరమైన అనుమతులను రాష్ట్ర కేబినెట్ ఆమోదించిందని తెలిపారు. రాష్ట్రంలో నాలుగు కొత్త పోర్టుల నిర్మాణం శరవేగంగా జరుగుతోందన్నారు. 10 ఫిషింగ్ హార్బర్లు నిర్మిస్తున్నామని తెలిపారు. పోర్టు ఆధారిత పరిశ్రమలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, వీటి కోసం 45 వేల ఎకరాలను సిద్ధంగా ఉంచామన్నారు. కోవిడ్ సమయంలో కుదేలైన ఎంఎస్ఎంఈ రంగానికి రూ.950 కోట్ల రీస్టార్ట్ ప్యాకేజీని అందించి ఆదుకున్నామని తెలిపారు. గతేడాదిలో ఎంఎస్ఎంఈ రంగానికి ఇవ్వాల్సిన రూ.2 వేల కోట్ల ఇన్సెంటివ్స్ చెల్లించడానికి కూడా సిద్ధంగా ఉన్నామన్నారు.

ఇవీ అభివృద్ధి సూచికలు

పారిశ్రామిక అభివృద్ధిలో 2019లో చంద్రబాబు హయాంలో 22వ స్థానంలో ఉన్న మన రాష్ట్రం సీఎం జగన్ పాలనలో మూడో స్థానంలో నిలిచిందని తెలిపారు. పరిశ్రమలను ఆకర్షించడంలో గుజరాత్ తర్వాత మన రాష్ట్రమే రెండో స్థానంలో నిలిచిందన్నారు. పారిశ్రామికంగా, ఆర్థికంగా ఏపీ మిగతా రాష్ట్రాలకన్నా మెరుగైన స్థానంలో ఉందని నీతి ఆయోగ్ కూడా వెల్లడించిందన్నారు. 2019లో చంద్రబాబు పాలనలో 22వ స్థానంలో ఉన్న రాష్ట్ర జీఎస్‌డీపీ వైఎస్ జగన్ వచ్చిన తర్వాత దేశంలోనే నంబర్ వన్ స్థానానికి చేరుకుందన్నారు. తలసరి ఆదాయంలో 17వ స్థానం నుంచి 9వ స్థానానికి వచ్చిందన్నారు. గత ప్రభుత్వం 34 వేల మందికే పరిశ్రమల్లో ఉద్యోగాలివ్వగా, తమ ప్రభుత్వం భారీ, మధ్య తరహా పరిశ్రమల్లో 1,45,000 మందికి ఉద్యోగావకాశాలు కల్పించిందని మంత్రి వివరించారు. 27వ స్థానంలో ఉన్న వ్యవసాయరంగం ఇప్పుడు ఆరో స్థానానికి ఎదిగిందన్నారు. పారిశ్రామిక రంగం అభివృద్ధికి సీఎం జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన సంస్కరణలే ఈ అభివృద్ధికి కారణమని చెప్పారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో గత మూడేళ్లుగా రాష్ట్రమే దేశంలో నంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. దేశంలోని పారిశ్రామిక దిగ్గజాలన్నీ ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నాయని తెలిపారు. ఏపీ ఎయిర్ కండిషన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారుతోందని, త్వరలోనే 50 శాతం ఏసీలు రాష్ట్రం నుంచి ఉత్పత్తి అవుతాయన్నారు. ఈ అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు.

వారి దుష్టబుద్ధికి నిదర్శనం

గ్రీన్ ఎనర్జీకి ఏపీ దిక్సూచి అవుతోందని నీతి ఆయోగ్ సీఈవో చెప్పారని, ఈ నేపథ్యంలో ఇండోసోల్‌కు 5000 ఎకరాలు కేటాయిస్తే, నాదెండ్ల కట్టప్ప (మనోహర్) తప్పు పట్టడం వారి దుష్టబుద్ధికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. నాదెండ్ల మనోహర్ ఆరోపణలలో పసలేదని, బాబు ఇచ్చిన స్క్రిప్ట్ చదువుతున్నాడని, ఇప్పటికైనా ఆయన కట్టప్ప వేషాలు మానుకోవాలని అన్నారు. మనోహర్ తండ్రి ఎన్టీఆర్‌కి వెన్నుపోటు పొడిచారని, అదే తరహా ఆలోచన కలిగిన మనోహర్ ఏదో ఒక రోజు పవన్‌కూ వెన్నుపోటు పొడుస్తారని అమర్‌నాథ్ అన్నారు.

వడ్డెరలు నమ్మదగిన వారు కాదు

నోరు పారేసుకున్న శ్రీసత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు పార్థసారథి

- వడ్డెర కులస్తుల ఆగ్రహావేశాలు
- బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్


బీకే పార్థసారథి వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వడ్డెర కులస్తులు

సాక్షి, పుట్టపర్తి: బీసీల తోకలు కత్తిరిస్తామని, ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా.. అనే వ్యాఖ్యలు చేసిన టీడీపీ అధినేత చంద్రబాబుకు ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినప్పటికీ.. ఆ పార్టీ నేతలు ఇప్పటికీ అధినేత పంథానే అనుసరిస్తున్నారు. తాజాగా.. కులం పేరుతో గుణాన్ని వక్రీకరిస్తూ శ్రీసత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీకే పార్థసారథి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. బుధవారం పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ, జనసేన సమన్వయ సమావేశం నిర్వహించగా.. ఆ సమావేశంలో పాల్గొన్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి వడ్డెర కులస్తులపై చేసిన వ్యాఖ్యలు గురువారం వెలుగులోకి వచ్చాయి. సమావేశానికి ఎల్లో మీడియాను మాత్రమే అనుమతించగా.. దీనిపై వార్తలు ప్రచురితం కాకుండా జాగ్రత్త పడ్డారు. అయితే వడ్డెర కులస్తులపై బీకే పార్థసారథి చేసిన వ్యాఖ్యలతో కూడిన వీడియో గురువారం వాట్సాప్ గ్రూపుల్లో వైరల్‌గా మారింది. పుట్టపర్తి నియోజకవర్గంలో వడ్డెర కులాలకు చెందిన ఓటర్లు 12 వేలు, కదిరి నియోజకవర్గంలో 18 వేల వరకు ఉన్నారు. ఈ దృష్ట్యా తాము ఎన్నో ఏళ్లుగా టీడీపీని నమ్ముకుని ఉన్నామని.. రాజకీయంగా ప్రాధాన్యం కల్పించాలని వడ్డెర సంఘం నాయకులు కోరారు. దీనికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు పార్థసారథి బదులిస్తూ.. 'వడ్డెర కులస్తులు నమ్మదగిన వ్యక్తులు కాదు. గతంలో ఓసారి టికెట్ ఇస్తే.. గెలిచిన తర్వాత పార్టీ మారారు. కదిరి నియోజకవర్గంలోని నంబులపూలకుంట నుంచి 2006లో వడ్డే రాఘవయ్య టీడీపీ తరఫున జెడ్పీటీసీగా గెలిచారు. వెంటనే పార్టీ ఫిరాయించి కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ ఫిరాయించే వడ్డెర్లకు అవకాశాలు ఎలా కల్పించాలి' అని ప్రశ్నించారు. దీంతో సమావేశం రసాభాసగా మారింది. తమకు ఎలాంటి సమాచారం లేకుండా సభ నిర్వహించారని జనసేన నేతలు టీడీపీ నేతలపై విరుచుకుపడ్డారు.

క్షమాపణకు డిమాండ్

పార్థసారథి వ్యాఖ్యలపై వడ్డెర సంఘాలు భగ్గుమన్నాయి. వడ్డెర్లపై బీకే పార్థసారథి చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని.. బహిరంగ క్షమాపణ చెప్పాలని వడ్డెర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దండగల మారెప్ప డిమాండ్ చేశారు. గురువారం పుట్టపర్తిలో వడ్డెర కులస్తులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మారెప్ప మాట్లాడుతూ.. వడ్డెర్లను కించపరిచే రాజకీయ పార్టీలకు ఓటుతో తగిన బుద్ధి చెబుతామన్నారు. వడ్డెర్లకు ప్రాధాన్యం ఇచ్చే రాజకీయ పార్టీలకే మద్దతు ఇస్తామని ప్రకటించారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి డైరెక్షన్‌లోనే పార్థసారథి వడ్డెర్లను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారని పలువురు వడ్డెర సంఘ నాయకులు ఆరోపించారు.

హిందూపురంలో బాలకృష్ణకు పరాభవం


- శుభకార్యం ఉంటేనే నియోజకవర్గానికి వస్తావా అంటూ జనం మండిపాటు
- కాన్వాయ్ అడ్డుకుని బాలయ్యకు వ్యతిరేకంగా నినాదాలు


బాలకృష్ణ కాన్వాయ్‌ను అడ్డుకుంటున్న స్థానికులు

సాక్షి, పుట్టపర్తి: హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు సొంత నియోజకవర్గంలో ఘోర పరాభవం జరిగింది. ఆరు నెలలుగా హిందూపురం వైపు కన్నెత్తి చూడని బాలకృష్ణ బుధవారం రాత్రి ఓ శుభకార్యంలో పాల్గొని వెళ్లిపోతుండగా స్థానికులు ఆయన కాన్వాయ్‌ను మేళాపురం సర్కిల్‌లో అడ్డుకున్నారు. 'చుట్టపు చూపుగా నియోజకవర్గానికి వచ్చే నాయకులు మాకు అవసరం లేదు.. ఇక్కడి నుంచి వెళ్లిపోండి' అంటూ నినాదాలు చేశారు. వెంటనే పోలీసులు రంగప్రవేశం చేసి వాహనానికి అడ్డుగా వస్తున్న జనాన్ని చెదరగొట్టారు. దీంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. వివాహ వేడుకలకు మాత్రమే ఎమ్మెల్యేకు హిందూపురం గుర్తుకు వస్తుంది.. ప్రజల గురించి ఏనాడూ పట్టించుకోలేదు. చుట్టపు చూపుగా వచ్చే ప్రజాప్రతినిధులు మాకు అవసరం లేదు.. అసలు బాలకృష్ణ మా ఎమ్మెల్యే అని చెప్పుకోవడానికే సిగ్గుగా ఉంది అని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక గురువారం ఉదయం హిందూపురంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిని సందర్శించిన బాలకృష్ణ.. ప్రభుత్వం లక్ష్యంగా విమర్శించడానికి ప్రయత్నించి అవమానపడ్డారు. సౌకర్యాలు ఎలా ఉన్నాయి అంటూ ఆస్పత్రిలో రోగులను ప్రశ్నించి ఆ వెంటనే ప్రభుత్వాన్ని ఏదో అనేందుకు ప్రయత్నించగా.. రోగులు అడ్డుకుని ఆస్పత్రిలో సౌకర్యాలన్నీ బాగున్నాయని, జగన్ ప్రభుత్వం బాగా పనిచేస్తోందని గట్టిగా చెప్పారు. దీంతో కంగుతిన్న బాలయ్య నోటికొచ్చినట్లు ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు.

దొంగ ఓట్లు తొలగిస్తుంటే విషప్రచారమా?

- బాబు కోసం రంగంలోకి దిగిన ఎస్ఈసీ మాజీ కమిషనర్ నిమ్మగడ్డ
- ఏపీ ఇంటెలెక్చువల్స్ అండ్ సిటిజన్స్ ఫోరం రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు


సమావేశంలో ఏపీ ఇంటెలెక్చువల్స్ అండ్ సిటిజన్స్ ఫోరం ప్రతినిధులు

సాక్షి, అమరావతి: గతంలో చంద్రబాబు చేర్పించిన దొంగఓట్లను ఇప్పుడు తొలగిస్తుంటే దొంగే దొంగ దొంగ అన్నట్లుగా ఉందని ఏపీ ఇంటెలెక్చువల్స్ అండ్ సిటిజన్స్ ఫోరం (ఎపిక్ ఫోరం) వ్యాఖ్యానించింది. 'దొంగఓట్లు–కుట్ర రాజకీయాలు' పేరుతో ఏపీ ఇంటెలెక్చువల్స్ అండ్ సిటిజన్స్ ఫోరం గురువారం విజయవాడలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు విద్యావేత్తలు, లాయర్లు, జర్నలిస్టులు, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా చంద్రబాబు, అతని అనుబంధ మీడియా దొంగ ఓట్ల పేరుతో కుట్ర రాజకీయాలకు తెరతీయడాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో దొంగ ఓట్లు తొలగిస్తుంటే విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇందుకోసం తమ కులానికి చెందిన వ్యక్తులతో కొత్త ఫోరంలను ఏర్పాటుచేశారని.. అందులో భాగమే రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎపిక్ ఫోరం చైర్మన్, రాష్ట్ర అధికార భాషా సంఘం చైర్మన్ పి.విజయబాబు, ఏపి ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణంరాజు, బీబీఏ ప్రతినిధి విఠల్‌రావు, కోట జయరాజ్, ప్రొఫెసర్ రామచంద్రారెడ్డి, న్యాయవాదులు ధనలక్ష్మి, ఉషాజ్యోతి, సౌమ్య, పీకే చిన్నా, ప్రసాదరావు, జయలక్ష్మి, విద్యావేత్త ఎంవీరావు తదితర మేధావులు పాల్గొని మాట్లాడారు.

ఓటర్ల జాబితాను ప్రైవేట్‌కు ఇచ్చిందెవరు?

సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ పేరుతో కొత్త అవతారం ఎత్తిన నిమ్మగడ్డ తన జాతి ప్రయోజనాల కోసం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని అందరూ ఖండించాలి. చంద్రబాబు పాలనలో ఓటర్ల జాబితాను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే దానిపై తెలంగాణలో కేసు నమోదైన విషయం నిమ్మగడ్డకు తెలియదా? ఆయన ఇప్పుడు ధర్మం, నైతికత అంటూ ప్రవచనాలు చెబుతుంటే నవ్వొస్తోంది.

– పి.విజయబాబు, ఎపిక్ ఫోరం చైర్మన్, అధికార భాషా సంఘం చైర్మన్

బాబు కోసమే అది పుట్టింది..

సిటిజన్ ఫర్ డెమోక్రసీ పేరుతో ఏర్పడిన సంస్థ తన కార్యవర్గం కూడా ఏర్పాటు చేయకుండానే చంద్రబాబు అరెస్టు అక్రమం అన్నదంటే ఈ సంస్థ ఎవరి ప్రయోజనాల కోసం పుట్టిందో అర్థంచేసుకోవచ్చు. అది బాబు కోసమే పుట్టింది.

– కృష్ణంరాజు, ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు

2014 రిపీట్ కాకూడదు

చంద్రబాబు తన కులానికి చెందిన నిర్మాణ సంస్థల్లోని వలస కార్మికులను ఓటర్లుగా చేర్పించి గెలుస్తూ వచ్చేవారు. అదే విధంగా 2014లో గెలిచారు. అది మళ్లీ జరగకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలి.

– పిల్లా రవి, అడ్వకేట్

ఎవరైతే పశ్చాత్తాపపడి మరియు విశ్వసించి సత్కార్యాలు చేస్తారో... అలాంటివారు స్వర్గంలో ప్రవేశిస్తారు. వారికెలాంటి అన్యాయమూ జరుగదు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 17 నవంబర్ 2023

ఒక్క అడుగు... ఒకే ఒక్క అడుగు!

అవును. 2023 ప్రపంచ వన్డే క్రికెట్ కప్‌కూ, భారత క్రికెట్ జట్టుకూ మధ్య మిగిలిన దూరం ఇక ఒకే ఒక్క అడుగు. 2011లో ఆఖరుసారిగా కప్ గెలిచిన తర్వాత మళ్ళీ పన్నెండేళ్ళకు తొలిసారిగా భారత జట్టు ప్రపంచకప్ ఫైనల్స్‌కు చేరడం అభిమానుల్లో ఆనందోత్సాహాల్ని నింపుతోంది. లక్ష్యం చాలా చేరువగా కనిపిస్తుండడంతో అందరిలో ఆశలు రేపుతోంది. బుధవారం ముంబయ్‌లోని వాంఖెడే స్టేడియమ్‌లో భారత, న్యూజిలాండ్ జట్ల మధ్య ఒక దశ వరకు పోటాపోటీగా సాగిన తొలి సెమీ ఫైనల్‌లో మన జట్టు విజయం సాధించిన తీరు మునుపెన్నడూ లేని ఆత్మవిశ్వాసాన్ని అందిస్తోంది. ఈ ప్రపంచకప్‌లో అప్రతిహతంగా 10 మ్యాచ్‌ల్లో విజయం సాధించిన టీమిండియా ఆదివారం అహ్మదాబాద్‌లో మరొక్కసారి చేసే ఫైనల్ ఇంద్రజాలానికై అందరూ ఎదురుచూస్తున్నారు.

2011లో ప్రపంచ కప్ గెలిచిన తర్వాత నుంచి చూస్తే గడచిన 2015, 2019 టోర్నీల్లో కన్నా ఈసారే భారత జట్టు విజయావకాశాలు మెరుగ్గా, అధికంగా ఉన్నాయని మొదటి నుంచి క్రికెట్ పండితుల మాట. నిరుడు టీ–20 వరల్డ్ కప్ సెమీ ఫైనల్ నుంచి అవమానకరమైన రీతిలో వెనుదిరిగిన జట్టు ఏడాది తిరిగేసరికల్లా ఇంత బలమైన జట్టుగా రూపొందడం ఒక రకంగా అనూహ్యమే. ఆ ఘోర ఓటమి తర్వాత జట్టును పటిష్ఠంగా తీర్చిదిద్దడం వెనుక కెప్టెన్ రోహిత్ శర్మ పట్టుదల, కోచ్ రాహుల్ ద్రావిడ్ కృషి, ఆటగాళ్ళ నిరంతర శ్రమ దాగి ఉన్నాయి. మునుపటి రెండు కప్‌ల కన్నా ఈసారి భారత జట్టు మరింత స్థిరంగా, నిలకడగా కనిపిస్తోంది. ఆటగాళ్ళందరూ కలసి కట్టుగా సాగుతూ, వ్యక్తులుగా కన్నా ఒక జట్టుగా ప్రతిభా ప్రదర్శన చేయడం కలిసొస్తోంది.

జట్టు సారథిగా రోహిత్ శర్మ ఆ విషయంలో అందరికీ ఆదర్శమయ్యాడు. ఈ టోర్నీలో కనీసం 3 సందర్భాల్లో వ్యక్తిగత మైలురాళ్ళకు దగ్గర ఉన్నా, దాని కన్నా జట్టు ప్రయోజనాల కోసం వేగంగా పరుగులు చేయడం మీదే దృష్టి పెట్టి, ఆ క్రమంలో ఔటవడమే అందుకు ఉదాహరణ. ఓపెనర్‌గా పరుగుల వరదతో ప్రత్యర్థి బౌలర్ల మానసిక స్థైర్యాన్ని చిత్తు చేసి, భారీ ఇన్నింగ్స్‌కు ఆయన పునాది వేస్తూ వస్తున్నారు. ఈ టోర్నీలో రోహిత్ శతకాలేమీ సాధించకపోయి ఉండవచ్చు. 124.15 స్ట్రైకింగ్ రేట్‌తో 550 పరుగులు చేసి, అత్యధిక పరుగుల వీరుల జాబితాలో నిలవడం విశేషం. సాధారణంగా వ్యక్తిగత విజయాలు, ప్రతిష్ఠను ఆశించే, ఆరాధించే చోట ఇది అసాధారణం. జట్టులో ఎవరి పాత్ర వారికి నిర్దిష్టంగా నిర్వచించడంలోనూ తెలివైన వ్యూహం, లక్ష్యంపై గురి కనిపిస్తున్నాయి.

బుధవారం నాటి సెమీస్ అందుకు మంచి ఉదాహరణ. ఓపెనర్లు వేసిన పునాదిని పటిష్ఠం చేయడంలో కోహ్లీ, శరవేగంతో పరుగుల వరద పారించడంలో శ్రేయాస్ అయ్యర్, కొనసాగింపుగా రాహుల్, బౌలింగ్‌లో ప్రత్యర్థుల భాగస్వామ్యాన్ని ఛేదించడానికి పేసర్లు బుమ్రా, షమీ, సిరాజ్‌ల త్రయం, స్పిన్నర్లుగా కుల్దీప్, జడేజాలు సమర్థంగా పాత్ర పోషిస్తున్నారు. ముఖ్యంగా జట్టులో ప్రతి ఒక్కరూ అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తుండడం విశేషం. శుభ్‌మన్ గిల్ లాంటి వారి పాత్ర తక్కువేమీ కాదు. బ్యాటింగ్‌లో కోహ్లీ, శ్రేయాస్‌లు వరుసగా సెంచరీల మీద సెంచరీలు కొడుతున్నారు. సెమీస్‌లోనే వన్డేల్లో శతకాల అర్ధ సెంచరీ పూర్తి చేసి, బ్యాట్స్‌మన్ల కింగ్ కోహ్లీ అయ్యాడు. ఆరాధ్య దైవమైన సచిన్ చూస్తుండగా, అతని రికార్డును అధిగమిస్తూ ఈ కొత్త చరిత్ర సృష్టించాడు.

ఈసారి భారత బౌలర్ల అమోఘ ప్రతిభా ప్రదర్శన మళ్ళీ 1983 నాటి కపిల్ డెవిల్స్‌ను తలపిస్తోంది. ఈ వరల్డ్ కప్‌లో మొదటి 4 మ్యాచ్‌ల తర్వాత ఆలస్యంగా తుది జట్టులోకి వచ్చిన పేస్‌బౌలర్ షమీ ఇప్పటికే ఈ టోర్నీలో అత్యధిక వికెట్లు పడగొట్టి, వికెట్ల వేటగాడిగా నిలిచాడు. వికెట్లలో అర్ధశతకం పూర్తిచేశాడు. ప్రపంచ కప్ చరిత్రలో మరి ఏ ఇతర భారతీయ ఆటగాడికీ లేని రీతిలో 57 పరుగులిచ్చి 7 వికెట్లు పడగొట్టిన అత్యుత్తమ గణాంకాలు నమోదు చేసి, నంబర్ 1గా నిలిచాడు. లయ తప్పకుండా, పిచ్ మీద వికెట్ల గురి తప్పకుండా, పరుగు వేగం తగ్గకుండా ప్రత్యర్థులపై పులిలా విరుచుకుపడుతున్న షమి ఈ భారత జట్టు అమ్ములపొదిలో బ్రహ్మాస్త్రం. ఈ 19న జరిగే ఫైనల్‌లో షమీ ఇలాగే విజృంభిస్తే మనం కప్పు కొట్టడం కష్టమేమీ కాదు.

గురువారం నాటి రెండో సెమీఫైనల్‌లో ఎప్పటిలానే సెమీస్ శాపం తప్పించుకోలేక సౌతాఫ్రికా బ్యాటింగ్‌లో తడబడింది. ఈ టోర్నీలో మొదట తడబడినా తర్వాత నిలబడిన ఆస్ట్రేలియా ఆఖరికి తక్కువ పరుగుల లక్ష్యాన్ని సైతం శ్రమించి, గెలిచింది. ఓడితేనేం పోరాటస్ఫూర్తిలో సౌతాఫ్రికా జనం మనసు గెలిచింది. అయిదుగురు రెగ్యులర్ బౌలర్లతోనే ప్రయోగం చేస్తున్న భారత్, అయిదుసార్లు ప్రపంచ విజేతగా నిలిచిన బలమైన ఆసీస్‌తో మహాయుద్ధానికి సమస్త శక్తియుక్తులూ కేంద్రీకరించాలి. అయితే, ఇప్పటికే భారత టాప్ 5 బ్యాట్స్‌మన్లు 65.8 సగటుతో 2570 పరుగులు సాధించారు. 2007 నాటి ఆసీస్ జట్టు బ్యాట్స్‌మన్ల సగటు కన్నా ఇది ఎక్కువ. అలాగే ఈ టోర్నీలో తొలి రెండు మ్యాచ్‌లలో ఓడిన ఆసీస్ ఆటను గమనిస్తే ఆ జట్టు మరీ అజేయమైనదేం కాదనీ అర్థమవుతుంది.

అందుకే, వరల్డ్ కప్ వేదికపై 1983లో అనామకంగా వెళ్ళి అద్భుతం చేసిన కపిల్ సేన, 2011లో ఒత్తిడిని తట్టుకొని అంచనాలందుకున్న ధోనీ అండ్ కో తర్వాత ముచ్చటగా మూడోసారి ఇప్పుడు రోహిత్ శర్మ అండ్ టీమ్ ఆ ఘనత సాధిస్తే ఆశ్చర్యం లేదు. పుష్కరకాలం నిరీక్షణ ఫలిస్తే శతకోటి భారతీయులకు అంతకన్నా ఆనందమూ లేదు. అనూహ్య ఘటనలు జరిగితే తప్ప ఆతిథ్య దేశమైన మనమే ఈ ఆదివారం ఐసీసీ వరల్డ్ కప్ అందుకోవచ్చు. ఎందుకంటే– ప్రతిసారి కన్నా భిన్నంగా ఈసారి మనది వట్టి ఆశ, అభిమానుల ప్రార్థన కాదు... అంతకు మించిన ప్రతిభా ప్రదర్శన, ఆత్మవిశ్వాస ప్రకటన!

దుష్ప్రవర్తనను నిగ్గు తేల్చడమెలా?

విశ్లేషణ



పి.డి.టి. ఆచారి

తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా తీవ్రమైన దుష్ప్రవర్తనతోపాటు, సభను ధిక్కరించినందుకు గానూ ఆమెను పార్లమెంటు నుండి బహిష్కరించాలని లోక్‌సభ ఎథిక్స్ కమిటీ సిఫార్సు చేసింది. లోక్‌సభ ఎథిక్స్ కమిటీ, దాని పేరు సూచించినట్లుగానే, ఎంపీల అనైతిక ప్రవర్తనను పరిశీలించి తగిన శిక్షలను సిఫారసు చేస్తుంది. నేటి వరకూ, 'అనైతిక ప్రవర్తన' అనేదానికి తగిన నిర్వచనం లేదు. ఎంపీల ప్రవర్తన తీరును పరిశీలించి, అది అనైతికమా, కాదా అని కమిటీ నిర్ణయిస్తుంది. ఎథిక్స్ కమిటీ చరిత్రలో ఎప్పుడూ ఒక ఎంపీని బహిష్కరించాలని సిఫారసు చేయలేదు. సభ్యులను విచారించి శిక్షించే అధికారం పార్లమెంటుకు ఉన్నప్పటికీ, సత్యాన్ని తెలుసుకునేందుకు అనుసరించే ప్రక్రియ సమర్థతపై సరైన అంచనా ఇంకా రావలసే ఉంది.

పశ్చిమ బెంగాల్‌కు చెందిన తృణమూల్ కాంగ్రెస్ పార్లమెంటు సభ్యురాలు మహువా మొయిత్రా తీవ్రమైన దుష్ప్రవర్తనతోపాటు, సభను ధిక్కరించినందుకుగానూ ఆమెను పార్లమెంటు నుండి బహిష్కరించాలని లోక్‌సభ ఎథిక్స్ కమిటీ సిఫార్సు చేసింది. పార్లమెంటులో ప్రశ్నలను లేవనెత్తడం కోసం ఆమెకు ఇచ్చిన లాగిన్ వివరాలు, పాస్‌వర్డ్‌ను దుబాయ్‌కి చెందిన ఒక వ్యాపారవేత్తతో పంచుకున్నారనేది ఆమెపై ఉన్న ప్రధాన అభియోగం. ఆ వ్యాపారవేత్త ఆమె పేరుతో లోక్‌సభకు ప్రశ్నలు పంపడానికి ఆమె లాగిన్, పాస్‌వర్డ్‌ను ఉపయోగించుకున్నారు. ఆయన వ్యాపార ప్రయోజనాల సమర్థవంతమైన ప్రమోషన్ కోసం ఆమె లాగిన్ ఐడీని దుర్వినియోగం చేయడానికి అనుమతించారనేది మొయిత్రాపై ఉన్న అభియోగంలోని ప్రధానాంశం.

ఎథిక్స్ కమిటీ రెండు రోజులపాటు సమావేశమై, మొయిత్రాను దోషిగా నిర్ధారించి, ఆమెను బహిష్కరించాలని కోరింది. లోక్‌సభ ఎథిక్స్ కమిటీ, దాని పేరు సూచించినట్లుగానే, ఎంపీల అనైతిక ప్రవర్తనను పరిశీలించి తగిన శిక్షలను సిఫారసు చేయవలసి ఉంటుంది. అయితే, నేటి వరకూ, 'అనైతిక ప్రవర్తన' అనేదానికి తగిన నిర్వచనం లేదు. ఎంపీల ప్రవర్తన తీరును పరిశీలించి, అది అనైతికమా కాదా అని కమిటీ నిర్ణయిస్తుంది.

కమిటీ చరిత్రలో లేని బహిష్కరణ

ఎథిక్స్ కమిటీ ఇప్పటివరకు పరిశీలించిన కేసులు ఏమంత ఎక్కువగా లేవు. సాధారణ ప్రవర్తనా నియమాలకు భిన్నమైన చిన్న చిన్న అతిక్రమణలతో ఈ కమిటీ వ్యవహరించింది. అటువంటి అతిక్రమణల తీవ్రతను బట్టి శిక్షలు మారుతూ ఉంటాయి: ఉపదేశించడం, మందలించడం, సభా సమావేశాల నుండి నిర్దిష్ట కాలానికి సస్పెండ్ చేయడం సాధారణంగా సిఫారసు చేస్తారు. లోక్‌సభ ఎథిక్స్ కమిటీ చరిత్రలో ఎప్పుడూ ఒక ఎంపీని సభ నుంచి బహిష్కరించాలని సిఫారసు చేయలేదు. పార్లమెంటు నుండి బహిష్కరించడం చాలా తీవ్రమైన శిక్ష. ఎందుకంటే బహిష్కరించబడిన ఎంపీకి చెందిన నియోజకవర్గ ప్రజలకు సభలో ప్రాతినిధ్యం వహించే హక్కు, అవకాశం లేకుండాపోతాయి. అందువల్ల, బహిష్కరణ చాలా అరుదుగా సిఫారసు చేస్తారు. 1951లో, తాత్కాలిక పార్లమెంటు సభ్యుడు హెచ్‌డి ముద్గల్, ఒక వ్యాపార సంస్థ ప్రయోజనాలను ప్రోత్సహిస్తున్నట్లూ, దానికిగానూ ఆర్థిక ప్రయోజనాలను పొందుతున్నట్లూ గుర్తించి సభ నుండి బహిష్కరించారు. హౌస్‌లోని ప్రత్యేక కమిటీ ఈ కేసును విచారించి, ఆయన బహిష్కరణకు సిఫారసు చేసింది.

అదే విధంగా, 2005లో, 10 మంది ఎంపీలు పార్లమెంట్‌లో ప్రశ్నలు వేసేందుకు డబ్బును స్వీకరిస్తున్నట్లు ఒక స్టింగ్ ఆపరేషన్‌లో దొరికిపోయిన సందర్భంలో వారిని లోక్‌సభ నుండి బహిష్కరించారు.



మహువా మొయిత్రా

ఈసారి కూడా ప్రత్యేక కమిటీ కేసు దర్యాప్తు చేసింది. ఒకరి వ్యక్తిగత ప్రయోజనాలను ప్రోత్సహించడానికి పార్లమెంటరీ పని చేయడం కోసం డబ్బును స్వీకరించడం సభా నియమాలకు సంబంధించి తీవ్రమైన ఉల్లంఘనగా పరిగణిస్తారు. కాబట్టి, అటువంటి దుష్ప్రవర్తనకు గాను అంగీకరించిన శిక్ష– బహిష్కరణ. రాజా రామ్ పాల్ వర్సెస్ గౌరవనీయ స్పీకర్, లోక్‌సభ (2007) ఉదంతంలో సుప్రీంకోర్టు... ప్రత్యేక హక్కును ఉల్లంఘించినందుకు సభ్యుడిని బహిష్కరించే సభ అధికారాన్ని ఆమోదించింది.

అధికారం ఉందా, లేదా?

అయితే, (ఆ సందర్భంలో) అటువంటి ప్రత్యేక హక్కు ఉందా లేదా అనే అంశాన్ని కోర్టు నిర్ధారిస్తుంది. అలాంటి హక్కు ఉనికిలో లేదని గుర్తిస్తే, సదరు బహిష్కరణను కొట్టివేస్తుంది. రాజా రామ్ పాల్ కేసు ప్రాముఖ్యత ఏమిటంటే, ఒక ఎంపీని బహిష్కరించే సభ అధికారం ఒక ప్రత్యేక హక్కు ఉనికితో నేరుగా ముడిపడి ఉండటం. దాన్ని ఉల్లంఘిస్తే బహిష్కరణ సాధ్యపడుతుంది. అయితే ఇది ఒక ముఖ్యమైన ప్రశ్నకు దారి తీస్తుంది. విశేషాధికారాల కమిటీకి కాకుండా, ఇతర కమిటీకి బహిష్కరణను సిఫార్సు చేసే అధికారం ఉందా? (1951, 2005 సంవత్సరాలలో ఎంపీల బహిష్కరణకు సిఫార్సు చేసిన కమిటీలు నైతిక లేదా విశేషాధికారాల కమిటీలు కావు. నిర్దిష్ట సమస్యలపై విచారణ కోసం సభ ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీలు.)

రాజా రామ్ పాల్ తీర్పులోని తర్కాన్ని అనుసరించినట్లయితే, విశేషాధికారాల కమిటీ లేదా సభ నియమించిన ప్రత్యేక కమిటీ మాత్రమే విశేషాధికారాల ఉల్లంఘనపై ఎంపీని బహిష్కరించే వ్యవహారాన్ని నడపగలదు. పార్లమెంట్‌లోని ఏ ఇతర సాధారణ కమిటీ ఆ సిఫారసు చేయలేదు. విశేషాధికారాల కమిటీ ముందుకు తేలేని సమస్యలతోనే ఎథిక్స్ కమిటీ వ్యవహరిస్తుంది. ఎథిక్స్ కమిటీని ఏర్పాటు చేయడంలోని తర్కం ఏమిటంటే, విశేషాధికారాల కమిటీ ముందుకు తేనక్కరలేనంతటి దుష్ప్రవర్తనలు చాలా ఉన్నాయి.

అయితే అదే సమయంలో అటువంటి ప్రవర్తనతో తగిన విధంగా వ్యవహరించడానికి సభా క్రమశిక్షణా యంత్రాంగం అందుబాటులో ఉండాలి. వివిధ కమిటీల పాత్రల్లోని ఈ వ్యత్యాసం పార్లమెంటు దృష్టిని డిమాండ్ చేస్తుంది. తద్వారా పార్లమెంట్ శిక్షాస్మృతి అధికారాల కార్యాచరణలో మరింత స్పష్టత తేవడం జరుగుతుంది. పార్లమెంటరీ కమిటీలు చేసే దర్యాప్తు పరిధి, ప్రయోజనం, దాని స్వభావం కూడా ఇక్కడ దృష్టిలో ఉంటుంది.

తక్షణ అవసరం

స్కామ్‌లు, ఇతర తీవ్రమైన కేసులకు దారితీసే ఆర్థిక దుర్వినియోగానికి సంబంధించిన విషయాలను పార్లమెంట్ పరిశోధిస్తుంది. ఇటువంటి పరిశోధనలు భారీ ఆర్థిక మోసాలకు దారి తీసే వ్యవస్థాగత లోపాలను వెలికితీసేంత సమగ్రంగా ఉంటాయి. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) వంటి దర్యాప్తు సంస్థ చేయలేని ఈ విధిని జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) నిర్వహిస్తుంది. అయితే సభ్యుడిని బహిష్కరించే అధికారంపై ఎటువంటి వివాదం లేనప్పటికీ, విచారణ విధానం గురించి కొన్ని ఆందోళన కలిగించే అంశాలు ఉన్నాయి.

ఫిర్యాదుదారు, ప్రతివాది ఎంపీ, ఇతర ప్రమేయం గల వ్యక్తులతో సహా సాక్ష్యం తీసుకోవడం కమిటీ సాధారణంగా అనుసరించే విధానం. వారు రాతపూర్వక పత్రాలను సమర్పించవచ్చు. అలాగే మౌఖిక ప్రకటనలు తీసుకోవచ్చు. ఆధారాలు సేకరించిన తర్వాత, సచివాలయ అధికారులు అటువంటి సాక్ష్యాలను జల్లెడ పట్టి, కనుగొన్న విషయాలు, సిఫార్సులతో కూడిన ముసాయిదా నివేదికను సిద్ధం చేస్తారు.

కాబట్టి, ఒక ఎంపీకి ఇచ్చే అత్యంత తీవ్రమైన శిక్ష అయిన బహిష్కరణను కమిటీలోని మెజారిటీ ఆధారంగా నిర్ణయిస్తారు. పార్లమెంటరీ విచారణ స్వభావాన్ని మనం పరిశీలించినప్పుడు, సాక్ష్యాధారాలను బేరీజు వేసే అధికారుల సామర్థ్యాలు, దర్యాప్తు రంగంలో వారి నైపుణ్యం, మరియు ఎక్కువగా నిపుణులు కాని, న్యాయపరంగా శిక్షణ పొందని కమిటీ సభ్యుల మనస్సును అన్వయించడం వంటి సంబంధిత అంశాలను ఎప్పుడూ పరిగణనలోకి తీసుకోవాలి.

పరిశోధనాత్మక యంత్రాంగాల ద్వారా విధానపరమైన సమగ్రతను కొనసాగించినప్పుడు మాత్రమే న్యాయం, సత్యం నిర్ధారించబడతాయి. ఏ తప్పు చేసినా దాని సభ్యులను విచారించి శిక్షించే అధికారం పార్లమెంటుకు ఉన్నప్పటికీ, సత్యాన్ని తెలుసుకునేందుకు, న్యాయం చేయడానికి అనుసరించే ప్రక్రియ సమర్థత, దాని పటిష్ఠతపై సరైన అంచనా అనేది ఇంకా రావలసే ఉంది. మహువా మొయిత్రా కేసు ఈ పనికి సంబంధించిన ఆవశ్యకతను మనకు గుర్తు చేస్తోంది.

వ్యాసకర్త లోక్‌సభ మాజీ ప్రధాన కార్యదర్శి
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

నమో!



భారత్‌ను రూపాంతరీకరించడానికి నిస్వార్థ, గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకుంటున్న తీవ్ర చర్యలే నా మనసు మారడానికి కారణం. తీవ్ర విమర్శలను ఎదుర్కొన్నప్పటికీ, ఎవరినీ విస్మరించని సంఘటిత అభివృద్ధి కోసం ఆయన స్థిరంగా నిలబడ్డారు.

– శెహలా రషీద్, యాక్టివిస్ట్

చివరికి ఒంటరే!



తన ఉచ్ఛస్థితిలో, సుబ్రతో రాయ్ (సహారా గ్రూప్) నడిచినప్పుడు, పెద్ద సినిమా తారలు, అత్యంత శక్తిమంతులైన రాజకీయ నాయకులు, పెద్ద వ్యాపార వేత్తలు ఆయన్ని అనుసరించడం చూశాను. ఆయన తీవ్ర కష్టాల్లోకి జారినప్పుడు, ఆయన దాదాపు ఒంటరిగా ఉన్నారు. ప్రియతములారా! దురదృష్ట వశాత్తూ జీవిత నియమం ఇదే.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

అసలు అండ



మహమ్మద్ షమీ 2006 ప్రాంతంలో బెంగాల్‌లో క్లబ్ క్రికెట్ ఆడటానికి వచ్చారు. 2010లో బెంగాల్ తరఫున మొదటిసారి ఆడారు. జీత్ బెనర్జీ, కోచ్ డేవ్ వాట్‌మోర్‌ల సిఫార్సు మీద 2011లో వేలం లేకుండా కేకేఆర్ (కోల్‌కతా నైట్ రైడర్స్) జట్టు ఆయన్ని తీసుకుంది. (షమీని మమతా బెనర్జీ బెంగాల్‌కు ఆహ్వానించారన్నదాన్ని కొట్టేస్తూ.)

– జాయ్ భట్టాచార్య, స్పోర్ట్స్ ప్రొడ్యూసర్

ఎవరి జేబుల్లోకి?



పాకిస్తానీ ఎయిర్‌లైన్స్‌ను రెండు బిలియన్ డాలర్లకు ఖతార్ కొంటున్నదని చదివాను. అలాగే, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) సంస్థ వచ్చే నెల 72 మిలియన్ డాలర్లు ఇవ్వనుంది. తర్వాతి బిలియనీర్ ఎవరు కానున్నారు?

– సాజిద్ ఎస్. తరార్, వ్యాపారవేత్త

కాబోలు!



పుష్పక విమానమే మొదటి విమానమనీ, పౌరాణిక గాథల్లో వర్ణించిన బ్రహ్మాస్త్రమే అణ్వాయుధాలకు మూలమనీ నమ్మేవాళ్లే ఇక నుంచీ ఐఐటీలను నడుపుతారేమో!

– రవి నాయర్, జర్నలిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఆ స్ఫూర్తిని కొనసాగిద్దాం

"గాలి, నీరు, వెలుతురు ఎంత సులభంగా సేవ్యమైయున్నవో అంత సులభంగా గ్రంథాలయ సేవ లభ్యం కావాలి."

– చిలకమర్తి లక్ష్మీనరసింహం

రాజమహేంద్రవరంలో 1839లో జేమ్స్ థామస్ పబ్లిక్ లైబ్రరీ స్థాపించడంతో తెలుగు నేలపై ఆధునిక గ్రంథాలయాలు ప్రారంభమయ్యాయని చెప్పవచ్చు. గ్రంథాలయ రంగంలో లబ్ధప్రతిష్ఠులైన గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకటరమణయ్య, దేవులపల్లి రామానుజరావు, మాడపాటి హనుమంతరావు, భాగ్యరెడ్డి వర్మ, పాతూరి నాగభూషణం, వావిలాల గోపాలకృష్ణయ్య వంటివారు గ్రంథాలయ ఉద్యమ వ్యాప్తికి విశేష కృషి సల్పారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో 'ఫూల్స్ క్లబ్' స్థాపించి స్వాతంత్ర్య కాంక్ష రగల్చడానికి అందరినీ ఒక చోట చేర్చడానికి ఈ ఉద్యమం ఎంతో దోహదపడింది.

గుంటూరులో 'థియోసోఫికల్ సొసైటీ' గ్రంథాలయం, పులివెందులలో 'సరస్వతీ విలాసము' ఒంగోలులో 'సీపీఎస్ లైబ్రరీ', విజయనగరంలో 'సింహాచలపతిరావు గ్రంథాలయం', ఉండిలో 'నేరోజి క్లబ్', పశ్చిమగోదావరి జిల్లా కుముదవల్లిలో 'కవి సమాజం', రాజమహేంద్రవరంలో 'గౌతమి గ్రంథాలయం', నెల్లూరులో 'వర్ధమాన సమాజం', హైదరాబాద్‌లో 'అసఫియా లైబ్రరీ, 'భారత గుణవర్ధక గ్రంథాలయం', 'శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం', గుంటూరు జిల్లా కొల్లూరులో 'ద రీడింగ్ క్లబ్', గుంటూరులో 'ది యంగ్ మెన్స్ అసోసియేషన్ (లిటరరీ)', విజయవాడలో 'రామమోహన లైబ్రరీ' వంటివి తొలిదశలో స్థాపితమైన ముఖ్యమైన గ్రంథాలయాలుగా పేర్కొనవచ్చు.

స్వాతంత్ర్యానంతరం 'లోకల్ లైబ్రరీ అథారిటీ' ఆధ్వర్యంలో గ్రంథాలయాల స్థాపన జరిగింది. తదనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థల ఆధ్వర్యంలో నలుచెరగులా ప్రభుత్వ రంగంలో గ్రంథాలయాలను స్థాపించారు. 1970–90 కాలంలో ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ గాంధీ డా॥ వెలగా వెంకటప్పయ్య, గ్రంథాలయ సారథి బెజగం వెంకట దాశరథి ద్వయం ఎన్నో కార్యక్రమాలను నిర్వహించి గ్రంథాలయ ఉద్యమ వ్యాప్తిని ముందుకు తీసుకెళ్లిన మలితరం నాయకులయ్యారు.

నవంబర్ 14న నెహ్రూ జన్మ దినోత్సవం (బాలల దినోత్సవం) నాడు ప్రారంభమైన గ్రంథాలయ వారోత్సవాలు ఇందిరాగాంధీ జన్మదినోత్సవం 20వ తేదీతో ముగుస్తాయి. పాఠకులను చైతన్యవంతులను చేయడం, గత చరిత్ర స్మరించుకోవడం, గ్రంథాలయాల ద్వారా స్వాతంత్ర్య కాంక్ష రగిల్చిన స్ఫూర్తిని జ్ఞాపకం చేసుకోవడం, పఠనాశక్తిని పెంపొందించడం, మంచి పుస్తకాలను పరిచయం చేయడం గ్రంథాలయ వారోత్సవాల ప్రధా నోద్దేశం. ఈ గ్రంథాలయ వారోత్సవాల ద్వారా మరింత స్ఫూర్తి కలగాలని ఆశిద్దాం.

– బెజగం వెంకట శ్రీనివాసు,
పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంఘం వైస్ ప్రెసిడెంట్
(నవంబర్ 20 వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు)

సహకార స్వర్ణయుగం రానుందా?!

ఉమ్మడి ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక అవసరాలు తీర్చుకోవడానికి కొంతమంది తమ సమష్టి యాజమాన్యం ద్వారా ఏర్పాటు చేసుకొని ప్రజాస్వామికంగా తామే నిర్వహించుకునే వ్యాపార, సేవా సంస్థలే సహకార సంఘాలు. వ్యక్తులు, ప్రైవేటు సంస్థలు లాభార్జనే ధ్యేయంగా చేసే వ్యాపారానికి భిన్నమైనది సహకార వ్యవస్థ. ప్రపంచీకరణ నేపథ్యంలో బహుళ జాతి సంస్థల కేంద్రీకృత ఆధిపత్య లాభార్జన వాణిజ్య ధోరణికి భిన్నంగా సమష్టి ప్రయోజనాల కోసం నానాటికీ విస్తరిస్తున్న ఈ వికేంద్రీకృత వ్యవస్థకు స్వయంపాలన, స్వావలంబనలే మూలస్తంభాలు. కరోనా మహమ్మారి నేర్పిన కొన్ని గుణపాఠాల నేపథ్యంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సహకార వ్యవస్థను మరింత విస్తరింపజేయాల్సిన ఆవశ్యకత ఉంది. ఐక్యరాజ్యసమితి కూడా సహకార సంఘాల ప్రాధాన్యాన్ని నొక్కి చెబుతూ... 2025ను అంతర్జాతీయ సహకార సంవత్సరంగా జరుపుకోవాలని ఇటీవలే తీర్మానం చేసింది. పుష్కర కాలం ముందు 2012లో కూడా అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని జరుపుకోవటం విశేషం. స్కాట్లండ్‌లోని ఫెన్‌విక్‌లో క్రీ.శ. 1761 మార్చి 14న ఏర్పాటైన ఫెన్‌విక్ చేనేత కార్మికుల సహకార సంఘమే తొట్టతొలి కోఆపరేటివ్ సొసైటీ. ప్రపంచంలో కనీసం 12 శాతం మంది ప్రజలు సహకారులే. సుమారు 30 లక్షల సహకార సంఘాలు ప్రపంచ దేశాల్లో లాభం కోసం కాకుండా విలువల కోసం పనిచేస్తున్నాయి.

భారతీయ సహకారోద్యమం ప్రపంచంలోనే అతిపెద్ద సహకార వ్యవస్థ. దేశం వలస పాలనలో మగ్గిపోతున్న కాలంలో సివిల్ సర్వీసెస్ అధికారిగా పనిచేసిన సర్ ఫ్రెడరిక్ నికల్సన్ మన దేశంలో సహకార వ్యవస్థకు బీజం వేశారు. మొట్టమొదటి సహకార సంఘం 1904లో ప్రస్తుత తమిళనాడులో తిరువళ్లూరు జిల్లాలోని 'తిరుర్' అనే గ్రామంలో ప్రారంభమైంది. ప్రస్తుతం మన దేశంలోని 8,54,355 సహకార సంఘాల్లో సుమారు 30 కోట్ల మంది సభ్యులున్నారు. మరో 2 లక్షల సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించి చురుగ్గా చర్యలు చేపట్టింది. మన దేశంలో వ్యవసాయ రుణాలిచ్చే సొసైటీల సంఖ్యే ఎక్కువ. కింది స్థాయిలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార



సంఘాలు మొదలుకొని చాలా రాష్ట్రాల్లో మూడంచెల సహకార వ్యవస్థ అమల్లో ఉంది. జిల్లా, రాష్ట్రస్థాయి సొసైటీల రిజిస్ట్రేషన్లు రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉంటాయి. అనేక రాష్ట్రాల్లో వ్యాపార లావాదేవీలు, సేవలు అందించే సొసైటీల (మల్టీస్టేట్ కోఆపరేటివ్ సొసైటీలు) రిజిస్ట్రేషన్ కేంద్ర సహకార రిజిస్ట్రార్ పరిధిలోకి వస్తుంది. రెండేళ్ల క్రితం హోం మంత్రి అమిత్ షా నేతృత్వంలో జాతీయ స్థాయిలో ప్రత్యేక సహకార మంత్రిత్వశాఖ ఏర్పాటు కావటంతో ఈ రంగంలో సరికొత్త కదలిక చోటుచేసుకుంది. జాతీయ సహకార విధానం రూపొందించేందుకు కసరత్తు జరుగుతోంది. పూర్వం నుంచి ఉన్న వ్యవసాయం, హౌసింగ్, ఉద్యోగుల సహకార సంఘాలు వంటి సంప్రదాయ రంగాలకు మాత్రమే పరిమితం కాకుండా... ముఖ్యంగా యువతను భాగస్వాముల్ని చేసే విధంగా అనేక సేవా రంగాల్లో సొసైటీల ఏర్పాటును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

మన దేశ ఆర్థిక వ్యవస్థను 5 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి పెంపొందించగల శక్తి సహకార రంగానికి ఉందని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా భారీ లక్ష్యాలతో మూడు వేర్వేరు మల్టీ స్టేట్ కోఆపరేటివ్‌లను కేంద్రం ఇటీవలే నెలకొల్పింది. మొదటిది మన ఉత్పత్తులను విదేశాలకు భారీస్థాయిలో ఎగుమతులను చేపట్టే లక్ష్యంతో ఏర్పాటైంది. సొసైటీల ద్వారా సర్టిఫైడ్/దేశీ విత్తనోత్పత్తి చేయటంతో పాటు విదేశాలకు ఎగుమతి చేయటమే లక్ష్యంగా రెండో సొసైటీ ఏర్పాటైంది. ఇక మూడోది మరింత ముఖ్యమైనది. వివిధ రాష్ట్రాల్లో ప్రకృతి సేద్యం చేసే రైతుల సొసైటీలు, ఎఫ్‌పీఓల నుంచి సేకరించి 'భారత్ ఆర్గానిక్స్' బ్రాండ్ పేరుతో ఆన్‌లైన్ ద్వారా, అవుట్‌లెట్ల ద్వారా దేశ విదేశాల్లో విక్రయించే లక్ష్యంతో ఇది ఏర్పాటైంది. భారీ వాణిజ్య లక్ష్యాలతో పనిచేసే ఈ సొసైటీలకు వచ్చే లాభాల్లో సగాన్ని నేరుగా రైతులు, ఇతర ఉత్పత్తిదారులకు అందించబోతున్నారు. అనుకున్నట్లు యువతను సహకార వ్యాపార, సేవా రంగాల వైపు సమర్థవంతంగా ఆకర్షించగలిగితే భారతీయ సహకార రంగానికి స్వర్ణయుగం తథ్యమని చెప్పొచ్చు.

– పంతంగి రాంబాబు, సీనియర్ జర్నలిస్టు
(ఈ నెల 20 వరకు 70వ జాతీయ సహకార వారోత్సవాలు)

పాములను కాపాడదాం!

ఆశ్వయుజ బహుళ అమావాస్య తరువాత వచ్చే కార్తీక శుద్ధ చవితిని 'నాగుల చవితి' పండుగగా జరుపుకొంటారు. మన తెలుగు రాష్ట్రాలతో పాటుగా కర్ణాటక, తమిళనాడుల్లో సైతం ఈ పండుగ జరుపుకొంటారు. పామును నాగ దేవతగా పూజించే పండుగ ఇది. ముఖ్యంగా హిందూ మహిళలూ, యువతులూ పాముల పుట్ట వద్దకు వెళ్లి పాలు పోసి కోడిగుడ్డును సైతం అక్కడ ఉంచడం లేదా దాన్ని కూడా పగులగొట్టి పుట్టలో పోయడం చేస్తారు. పుట్టలో పాలుపోస్తే పిల్లలు కలుగని వివాహిత స్త్రీలకు పిల్లలు పుడతారనీ, వివాహం కాని యువతులకు వివాహం అవుతుందనీ, అనారోగ్యవంతులకు ఆరోగ్యం బాగుపడుతుందనీ నమ్ముతారు.

పుట్టలో పాలు పోస్తే ఇవన్నీ జరిగే అవకాశం ఎంత మాత్రం లేదనేది సైన్స్ చెబుతున్న మాట. స్వచ్ఛమైన పాలను పుట్టలో పోయడమంటే పౌష్టికాహారం నేలపాలు చెయ్యడమేననీ, అంతేకాని కోరికలు తీరవనీ పరిశోధకులు అంటున్నారు. అసలు పాము పాలు తాగదు. పాము కప్పలను, ఎలుకలను, క్రిమి, కీటకాలను తిని బ్రతికే ప్రాణి. ఇది కేవలం మాంసాహార జీవి మాత్రమే. ద్రవ పదార్థాలను పాము తీసుకోదు. వాస్తవానికి పాలను జీర్ణం చేసుకోవాలంటే జీర్ణాశయంలో 'లాక్టోజ్' అనే ఎంజైము ఉత్పత్తి అవ్వాలి. పాముకు జీర్ణాశయంలో ఆ ఎంజైము విడుదల అవదు. అందువల్ల పాము పాలను జీర్ణం చేసుకోలేదు. ఈ ఎంజైము క్షీరదాలలో ఉంటుంది. సరీసృపాలయిన పాములలో ఉండదు. పాములకు ద్రవరూపంలో ఉన్న వాటిని నోటిలోకి పీల్చే సామర్థ్యం లేదు. వాటి నోటి నిర్మాణం అందుకు సహకరించదు.ప్రతి సంవత్సరం పుట్టల్లో పాలుపోయడం ద్వారా కేవలం ఒక్క రోజే 5 వేలకు పైగా పాములు పుట్టల్లోనే మరణిస్తున్నాయని అంచనా. జంతు పరిరక్షణ సంస్థలు పుట్టలో పాలు పోయొద్దని చెప్తున్నా నమ్మకాల పేరుతో మనం ఈ పద్ధతిని ఇంకా కొనసాగిస్తున్నాం.

పాములు నివసించే పుట్టలు పాములు నిర్మించుకున్నవి కావు. పాముల శరీర నిర్మాణం పుట్టలు నిర్మాణం చేసుకోవడానికి సహకరించదు. చెద పురుగులు ఏర్పాటు చేసిన పుట్టలలో పాములు వచ్చి చేరతాయి. పాములు రైతులకు సహజమిత్రులు. రైతు ఎంతో శ్రమకోర్చి పండించిన పంటను నాశనం చేసే చిన్న జీవులను అవి తింటాయి.

ఈ భూమి మీద ప్రతి జీవికీ ప్రకృతిలో దాని కంటూ ఓ పాత్ర ఉంటుంది. కొన్ని నమ్మకాల కారణంగా ప్రకృతిలో ఆ యా జీవులు పోషించాల్సిన పాత్రను పోషించకుండా చేస్తున్నాడు మానవుడు.అందుకు పాములకు పాలు పోసి వాటికి హాని కలుగజేయడం ఒక ఉదాహరణ మాత్రమే. మూఢ నమ్మకాలను నిర్మూలించి శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం అందరం కృషి చేద్దాం.

– చార్వాక, సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ సమన్వయకర్త

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** శు.చవితి ఉ.11.31 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** పూర్వాషాఢ రా.2.31 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** ప.12.40 నుండి 2.11 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.24 నుండి 9.09 వరకు, తదుపరి ప.12.08 నుండి 12.53 వరకు, **అమృతఘడియలు:** రా.9.34 నుండి 11.22 వరకు, నాగులచవితి ; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.09, **సూర్యాస్తమయం:** 5.21.

• 'పీఎంశ్రీ'కి ఎంపికైన పాఠశాలల ఉపాధ్యాయులకు త్వరలో ఐఐటీ (తిరుపతి)లో ఐదు రోజుల పాటు రెసిడెన్షియల్ విధానంలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు సమగ్ర శిక్ష పీడీ బి.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన తిరుపతిలో ఐఐటీ డైరెక్టర్ డా.కె.ఎస్.సత్యనారాయణతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మ్యాథ్స్, ఫిజిక్స్, బయోలజీ, ఇంగ్లిష్ సబ్జెక్టుల ఉపాధ్యాయులకు ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలైన ఐఐటీ, ఐఐఎస్ఈఆర్ అధ్యాపకులతో శిక్షణ ఇచ్చేందుకు ఐఐటీ (తిరుపతి)తో అంగీకార ఒప్పందం (ఎంవోయూ) చేసుకోనున్నట్టు వివరించారు.

రైతుల మోముల్లో 'ధర'హాసం



పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధరను మించి రికార్డు స్థాయి ధరలు

- మార్కెట్‌లో ప్రభుత్వ జోక్యంతో రైతులకు మేలు
- వ్యాపారుల మధ్య పెరుగుతున్న పోటీ
- వాణిజ్య, ఉద్యాన పంటలకు ఎమ్మెస్పీకి మించి ధరలు
- గరిష్ఠంగా మిరప క్వింటాకు రూ.27,525, మినుము రూ.11,500
- వేరుశనగ రూ.7,596
- పత్తి రూ.7,453

సాక్షి, అమరావతి: అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ)ను మించి రికార్డు స్థాయి ధరలు లభిస్తున్నాయి. ముఖ్యంగా మిరప, మినుము, పసుపు, పెసలు, కందులు ఎమ్మెస్పీని మించి మంచి ధర పలుకుతున్నాయి. కోవిడ్ నేపథ్యంలో రెండేళ్ల పాటు కనీస మద్దతు ధరలు దక్కని రైతులకు ప్రభుత్వం అండగా నిలిచింది. రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి ఆదుకుంది. దీని ద్వారా ఎమ్మెస్పీ దక్కని వ్యవసాయ, వాణిజ్య పంటలను మార్కెట్‌లో జోక్యం చేసుకొని మరీ ప్రభుత్వం కొనుగోలు చేసింది. తద్వారా ప్రధాన వ్యవసాయ, వాణిజ్య పంటలకు మద్దతు ధర దక్కింది. నాలుగున్నరేళ్లలో 6.17 లక్షల మంది రైతుల నుంచి రూ.7,751.43 కోట్ల విలువైన 21.60 లక్షల టన్నుల పంట ఉత్పత్తులు కొనుగోలు చేసింది. ఇలా ధర తగ్గిన ప్రతీసారి ప్రభుత్వం మార్కెట్‌లో జోక్యం చేసుకోవడంతో వ్యాపారుల మధ్య పోటీ పెరిగింది. ఫలితంగా మార్కెట్‌లో ప్రస్తుతం ఆయా ఉత్పత్తులకు మంచి ధర లభిస్తోంది. ఖరీఫ్ పంట ఉత్పత్తులు మార్కెట్‌లోకి వచ్చే వేళ అపరాలు, చిరుధాన్యాలు, ఉద్యాన, వాణిజ్య పంటల ధరలు ఎమ్మెస్పీకి మించి రికార్డు స్థాయిలో పలుకుతుండడం శుభపరిణామన్నారు.

మిరప, పసుపులకు రికార్డు స్థాయి ధర

అంతర్జాతీయంగా పెరిగిన డిమాండ్‌తో మిరప రికార్డు స్థాయి ధర పలుకుతోంది. ఎమ్మెస్పీ క్వింటా రూ.7 వేలు కాగా, కాస్త నాణ్యత ఉంటే చాలు రూ.20 వేలకు పైగా లభిస్తోంది. గరిష్ఠంగా రూ.27,525 పలుకుతోంది. ప్రతికూల వాతావరణంలో సాగు చేసిన మిరపపై ఈసారి నల్లతామర ప్రభావం పెద్దగా కనిపించకపోవడం, మార్కెట్‌లో రికార్డు స్థాయిలో ధరలు ఉండడంతో రైతులు మంచి లాభాలను ఆర్జించే పరిస్థితులు ఉన్నాయి. పసుపు ఎమ్మెస్పీ క్వింటా రూ.6,850 కాగా గుంటూరు జిల్లా దుగ్గిరాల పసుపు మార్కెట్‌లో బుధవారం గరిష్ఠంగా క్వింటా రూ.10,650 పలికింది. ఈసారి రూ.15 వేలు దాటుతుందని అంచనా వేస్తున్నారు. ఇక పత్తి పొడుగు పింజ రకం ఎమ్మెస్పీ క్వింటా రూ.7,020 కాగా, మార్కెట్‌లో గరిష్ఠంగా రూ.7,453 పలుకుతోంది. మధ్యస్థ పింజ రకం ఎమ్మెస్పీ రూ.6,620 కాగా మార్కెట్‌లో రూ.7 వేలు లభిస్తోంది. మిగిలిన పంట ఉత్పత్తులకు సైతం మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో కనీస మద్దతు ధర కంటే ఎక్కువ ధర ఇచ్చేందుకు వ్యాపారులు పోటీపడుతున్నారు.

క్వింటా రూ.10 వేలు దాటిన అపరాలు

అపరాలకు మార్కెట్‌లో రికార్డు స్థాయి ధరలు పలుకుతున్నాయి. మినుము ఎమ్మెస్పీ క్వింటా రూ.6,950 కాగా, మార్కెట్‌లో రూ.11,500 పలుకుతోంది. కందులు ఎమ్మెస్పీ రూ.7 వేలు కాగా రూ.10,500, పెసలు ఎమ్మెస్పీ రూ.8,558 ఉండగా మార్కెట్‌లో రూ.10,500 వరకు ధరలు పలుకుతున్నాయి. రాగులు, సజ్జలు, జొన్నలు వంటి చిరుధాన్యాలకు కూడా మంచి ధరలు లభిస్తున్నాయి. ఇక ఉల్లి ఎమ్మెస్పీ క్వింటా రూ.700 కాగా, మార్కెట్‌లో గరిష్ఠంగా రూ.5,500 వరకు రైతుకు ధర లభిస్తోంది. వేరుశనగ కూడా ఎమ్మెస్పీ రూ.6,377 కాగా, గరిష్ఠంగా మార్కెట్‌లో రూ.7,596 పలుకుతోంది. అరటి ఎమ్మెస్పీ క్వింటా రూ.800 కాగా, మార్కెట్‌లో గరిష్ఠంగా రూ.2,880 లభిస్తోంది. బత్తాయి ఎమ్మెస్పీ రూ.1,400 కాగా మార్కెట్‌లో గరిష్ఠంగా రూ.4,200 వరకు పలుకుతోంది. ఖరీఫ్ పంట ఉత్పత్తులు మార్కెట్‌కు వచ్చే వేళ ఇలా వ్యవసాయ, వాణిజ్య పంటల ధరలు ఎమ్మెస్పీకి మించి పలుకుతుండటంతో రైతుల ఆనందానికి అవధుల్లేవు.

కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ)కు మించి పలుకుతున్న ధరలిలా (క్వింటాకు)..

పంట	కనీస మద్దతు ధర	కనిష్ఠం	గరిష్ఠం
మిరప	7,000	22,000 (మోడల్)	27,525
పసుపు	6,850	8,900	10,650
కందులు	7,000	9,500	10,500
మినుము	6,950	8,409	11,500
పెసలు	8,558	9,500	10,500
వేరుశనగ	6,377	6,896 (మీడియం)	7,596
పత్తి	7,020	7,279 (మీడియం)	7,453
శనగలు	5,335	4,009	5,760
ఉల్లి	700	4,000 (మోడల్)	5,500
రాగులు	3,846	4,000	4,500
జొన్నలు	3,180	3,300	4,000
మొక్కజొన్న	2,090	2,200	2,400
సజ్జలు	2,500	2,400	2,575
అరటి	800	2,300 (మోడల్)	2,880
బత్తాయి	1,400	2,250 (మోడల్)	4,200

సీఎం యాప్ ద్వారా ధరలను పర్యవేక్షిస్తున్నాం..

మార్కెట్ చాలా ఆశాజనకంగా ఉంది. మిరప, అపరాలు, మొక్కజొన్న, చిరుధాన్యాలు, పసుపు, ఉల్లి తదితర పంట ఉత్పత్తుల ధరలు ఎమ్మెస్పీని మించి పలుకుతున్నాయి. నిజంగా ఇది శుభపరిణామం. నిరంతరం సీఎం యాప్ ద్వారా ధరలను పర్యవేక్షిస్తున్నాం. రానున్న రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రైతులు మరింత ఆదాయం పొందొచ్చు.

–రాహుల్ పాండే, కమిషనర్, మార్కెటింగ్ శాఖ

• పట్టణ స్వయం సహాయక సంఘ సభ్యులకు సుస్థిర జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మెప్మా ఎండీ వీ విజయలక్ష్మి గురువారం ప్రకటనలో తెలిపారు. దీన్లో భాగంగానే 'పట్టణ ప్రగతి యూనిట్లు' పేరుతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. పట్టణ సమాఖ్యలోని మహిళలను గుర్తించి శిక్షణ ఇస్తామన్నారు.

పలు ఆలయాలను దర్శించుకున్న సుప్రీం కోర్టు న్యాయమూర్తులు

యాదమరి/చంద్రగిరి/శ్రీకాళహస్తి/ఇంద్రకీలాద్రి: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్ గురువారం కుటుంబసమేతంగా కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డి స్వాగతం పలికి స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించారు. జస్టిస్ అరవింద్ కుమార్ తిరుచానూరు పద్మావతి అమ్మవారిని కూడా దర్శించుకున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కేవీ విశ్వనాథన్ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని, తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని కుటుంబసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. కాగా, విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ దినేశ్ కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు.

వినాయకుని సేవలో విదేశీయులు

కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారిని గురువారం కజికిస్తాన్, రష్యా, ఉక్రెయిన్‌కు చెందిన పలువురు విదేశీయులు దర్శించుకున్నారు.



జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ విశ్వనాథన్‌కు ప్రసాదాలను అందజేస్తున్న టీటీడీ చైర్మన్ భూమన

ప్రత్యేకాధికారుల పదవీకాలం పొడిగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో తొమ్మిది నగర పాలక సంస్థలు, పురపాలక సంఘాల ప్రత్యేకాధికారుల పదవీకాలాన్ని మరో ఆరునెలల పాటు పొడిగిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై. శ్రీలక్ష్మి గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రాజమహేంద్రవరం నగర పాలక సంస్థతో పాటు భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, తణుకు, గుడివాడ, బాపట్ల, గూడూరు, రాజాం పురపాలక సంఘాల ప్రత్యేకాధికారుల పదవీకాలం ఈ నెల 5వ తేదీతో ముగిసింది. వీరి పదవీ కాలాన్ని 2024 మే 5వ తేదీ వరకు లేదా కొత్త పాలక మండళ్లు ఏర్పాటయ్యే వరకు పొడిగిస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

శబరిమలకు ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుకునే స్వాములు, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వేర్వేరు ప్రాంతాల నుంచి శబరిమలకు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్–కొల్లం (07121) ఈనెల 19వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2.40 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి, సోమవారం రాత్రి 11.55 గంటలకు కొల్లం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో (07122) ఈనెల 21న మంగళవారం మధ్య రాత్రి 2.30 గంటలకు కొల్లంలో బయలుదేరి, బుధవారం ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. నర్సాపూర్–కొట్టాయం (07119) ఈనెల 19న ఆదివారం మధ్యాహ్నం 3.50 గంటలకు నర్సాపూర్‌లో బయలుదేరి, సోమవారం సాయంత్రం 4.50 గంటలకు కొట్టాయం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో (07120) ఈ నెల 20న సోమవారం రాత్రి 7 గంటలకు కొట్టాయంలో బయలుదేరి, మంగళవారం రాత్రి 9 గంటలకు నర్సాపూర్ చేరుకుంటుంది.

లైంగికదాడి కేసులో ఇద్దరికి 20ఏళ్ల జైలు

- నిందితులకు శిక్ష పడటంలో కీలకంగా వ్యవహరించిన దిశ పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు
- అభినందించిన పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: పల్నాడు జిల్లా గురజాల రైల్వేస్టేషన్ సమీపంలో మధ్యప్రదేశ్‌కు చెందిన 30 ఏళ్ల ఓ మహిళపై లైంగికదాడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులకు ఒక్కొక్కరికి 20 ఏళ్ల జైలు, రూ.20వేల జరిమానా విధిస్తూ గుంటూరు ఐదో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కే నీలిమ గురువారం తీర్పు చెప్పారు. దీనికి సంబంధించిన వివరాలను గురువారం ఎస్పీ వై రవిశంకర్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన మహిళ తన కుమారుడు పవన్‌తో గతేడాది ఏప్రిల్ 13వ తేదీన మహారాష్ట్రలోని తన అత్తింటికి బయలుదేరింది. దారితప్పి గురజాల రైల్వేస్టేషన్‌లో దిగింది. 15వ తేదీన రాత్రి 10గంటల సమయంలో కేసులో నిందితులైన కంద్రకొండ సుబ్బారావు, మాదిరాజు ప్రసాద్ ఆమెకు భోజనం పెడతామని ఆశచూపించి లైంగిక దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడిన ఆమె రైల్వేస్టేషన్‌లో స్పృహతప్పి పడిపోగా, 16వ తేదీ చుట్టుపక్కల వారు గమనించి గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సీహెచ్‌సీ వైద్యురాలు వై.లక్ష్మి ఆమెకు వైద్యం చేసి, ఘటనపై నివేదిక ఇచ్చారు. రైల్వే పోలీసు ఇన్‌స్పెక్టర్ టి.శ్రీనివాసరావు దర్యాప్తు చేపట్టి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. కేసు నరసరావుపేటలోని దిశ మహిళా పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. దిశ డీఎస్పీ యు.రవిచంద్ర కేసును ప్రత్యేకంగా దర్యాప్తు చేపట్టి డీఎన్ఏ పరీక్షలు, తగిన సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ఈక్రమంలోనే నిందితులకు 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అలాగే కోర్టు విచారణను తాను ప్రత్యేకంగా పర్యవేక్షించినట్టు ఎస్పీ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. నిందితులకు శిక్ష పడటంలో విశేష ప్రతిభ కనబరచిన డీఎస్పీ రవిచంద్ర, హెడ్ కానిస్టేబుల్ టి.మాణిక్యాలరావు, సిబ్బందిని, పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, దిశ డీఎస్పీ రవిచంద్ర

చంద్రబాబు కుటిల రాజకీయమిది

- లంచం అడిగానంటూ నాపై తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నారు
- తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- ఎస్పీ వకుల్ జిందాల్‌కు మంత్రి మేరుగు ఫిర్యాదు



సాక్షి ప్రతినిధి, బాపట్ల: సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలో తనలాంటి పేదలు రాజకీయంగా ఎదుగుతుంటే ఓర్వలేని చంద్రబాబు కుటిల రాజకీయాలతో తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. ప్రభుత్వ స్థలం వ్యవహారంలో తాను లంచం అడిగానంటూ టీడీపీ సానుభూతిపరుడు చేసిన ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ మంత్రి గురువారం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. 'చుండూరుకు చెందిన ఒక ఉద్యోగి ఆక్రమించిన ప్రభుత్వ స్థలాన్ని అధికారులు విడిపించారు. ఈ సందర్భంలో తమను అడ్డుకున్నాడని ఆ ఉద్యోగిపై అధికారులు కేసు పెట్టారు. ఆ ఉద్యోగి డబ్బులిచ్చి చుండూరు పోలీసులను ఏసీబీకి పట్టించాడు. కేసు నుంచి తప్పించేందుకు పోలీసులు రూ.5 లక్షలు డిమాండ్ చేశారని, ఇందులో రూ. 2 లక్షలు మంత్రికి, మిగతావి సీఐ, తహసీల్దారు, ఆర్ఐలకు ఇవ్వాలన్నారని తప్పుడు ఆరోపణలు చేశాడు. నేను వెంటనే ఎస్పీకి ఫోన్ చేసి దీనిపై సమగ్ర విచారణ కోరాను. ఇప్పుడు ఎస్పీని స్వయంగా కలిసి దీని వెనుక ఎవరున్నారో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరాను' అని మంత్రి తెలిపారు. తనపై ఫిర్యాదు చేసిన వ్యక్తి టీడీపీ సానుభూతిపరుడని చెప్పారు. తాను దోషినని తేలితే తనపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు తప్పుడువని తేలితే అతనిపైనా, అతని వెనుక ఉన్న వారిపైనా చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరినట్లు తెలిపారు.

ఓటర్ల జాబితా పరిశీలనకు ఐదుగురు ఐఏఎస్‌లు

కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పన, ఓటర్ల జాబితా సవరణలతో పాటు జిల్లా ఎన్నికల అధికారులు, ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారులకు మార్గనిర్దేశం చేసేందుకు ఐదుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులను పరిశీలకులుగా భారత ఎన్నికల సంఘం నియమించింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు. వీరు తమకు కేటాయించిన జిల్లాల్లో మూడుసార్లు ప్రత్యేకంగా పర్యటించాల్సి ఉంటుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మొదటి పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులతో డిసెంబర్ 9వ తేదీలోగా సమావేశాలు ఏర్పాటు చేసి ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలను స్వీకరించాలని సూచించింది. రెండో పర్యటనలో డిసెంబర్ 10 నుంచి 26వ తేదీ లోగా స్వీకరించిన అభ్యంతరాలను పరిష్కరించాలని ఆదేశించింది. మూడో సందర్శన సమయంలో డిసెంబర్ 27 నుంచి 2024 జనవరి 4వ తేదీ మధ్య సవరించిన ఓటర్ల జాబితాలను పరిశీలించి, తుది ఓటర్ల జాబితా రూపకల్పన కోసం సిద్ధం చేయాలన్నారు.

క్లుప్తంగా...

అమెరికా కోటీశ్వరుడు సింఘంకు ఈడీ సమన్లు

న్యూఢిల్లీ: న్యూస్‌క్లిక్ ఆన్‌లైన్ పోర్టల్‌పై నమోదైన మనీల్యాండరింగ్ కేసులో విచారణకు హాజరుకావాల్సిందిగా అమెరికన్ బిలియనీర్ నెవిల్లె రాయ్ సింఘంకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తాజాగా సమన్లు జారీ చేసింది. భారత్‌లో చైనాకు అనుకూలంగా కథనాలు రాసేందుకు న్యూస్‌క్లిక్‌కు డ్రాగన్ దేశం నుంచి నిధులు అందుతున్నట్లు గతంలో న్యూయార్క్‌టైమ్స్, తదితర పత్రికల్లో కథనాలు వచ్చాయి. నెవిల్లె రాయ్ సింఘం, ఆయనకు చెందిన న్యూస్‌క్లిక్‌ను అత్యంత ప్రమా దకరమైనవని పేర్కొన్నాయి. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన ఈడీ..న్యూస్‌క్లిక్ ఫౌండర్, ఎడిటర్ ఇన్ చీఫ్ ప్రబీర్ పురకాయస్థకు చెందిన ఢిల్లీలోని రూ.4.52 కోట్లు విలువ చేసే భవనాన్ని, రూ.41 లక్షల బ్యాంకు డిపాజిట్లను అటాచ్ చేసింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న సింఘం ప్రస్తుతం చైనాలోని షాంఘైలో ఉన్నారు. దీంతో, ఆయనకు విదేశాంగ శాఖ ద్వారా నోటీసులు పంపింది. కాగా, ఈడీ ఆరోపణలను సింఘం ఖండించారు. దర్యాప్తు చేపట్టిన ఈడీ మొదటిసారిగా 2021లో సింఘంకు నోటీసు పంపింది.

ఖలిస్తానీల ఆగడాలను అడ్డుకోండి

యూకే హోంమంత్రికి జైశంకర్ వినతి

లండన్: దేశంలో భావ ప్రకటనా స్వేచ్ఛ దుర్వినియోగం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) హోం శాఖ మంత్రి జేమ్స్ క్లెవర్లీ, జాతీయ భద్రతా సలహాదారు టిమ్ బారోకు భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ విజ్ఞప్తి చేశారు. యూకేలో ఖలిస్తాన్ తీవ్రవాదం నానాటికీ పెరిగిపోతుండడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఖలిస్తాన్ సభ్యుల ఆగడాలు, భారత్‌కు వ్యతిరేకంగా వారు సాగిస్తున్న కార్యకలాపాలను జేమ్స్ క్లెవర్లీ, టిమ్ బారో దృష్టికి తీసుకెళ్లారు. జైశంకర్ బుధవారం లండన్‌లో వారిద్దరితో సమావేశమయ్యారు. ఖలిస్తాన్ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. అనంతరం యూకే ప్రధానమంత్రి రిషి సునాక్‌తో భేటీ అయ్యారు. ఇండియా–యూకే సంబంధాల్లో పురోగతిపై చర్చించారు. ఇండియా–యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై ప్రస్తుతం జరుగుతున్న సంప్రదింపులతోపాటు రోడ్‌మ్యాప్–2030 అమలు తీరును ఇరువురు నేతలు సమీక్షించారు. ఇరు దేశాల మధ్య సంబంధాల్లో సానుకూల పురోగతి కనిపిస్తోందని వారు హర్షం వ్యక్తం చేశారు. యూకేలో జైశంకర్ ఐదు రోజుల పర్యటన బుధవారం ముగిసింది.

ఆ శకలంతో ఎటువంటి ప్రమాదం లేదు: ఇస్రో

బెంగళూరు: చంద్రయాన్–3 అంతరిక్ష నౌకను జూలై 14న నిర్దేశిత కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టడంలో కీలకమైన క్రయోజనిక్ రాకెట్ ఇంజిన్‌లోని ఒక భాగం భూ వాతావరణంలోకి తిరిగి ప్రవేశించిందని ఇస్రో తెలిపింది. ఎల్‌వీఎం–3 ఎం4కు చెందిన ఈ శకలం బుధవారం మధ్యాహ్నం 2.42 సమయంలో భూ వాతావరణంలోకి ప్రవేశించినట్లు గుర్తించామని గురువారం ఇస్రో వివరించింది. దీని వల్ల ఎలాంటి ప్రమాదం లేదని తెలిపింది. ఇది ఉత్తర పసిఫిక్ సముద్రంలో పడే అవకాశాలున్నాయని తెలిపింది. భారత గగనతలంలోకి ప్రవేశించే అవకాశాల్లేవని ఒక ప్రకటనలో ఇస్రో స్పష్టం చేసింది.

చైనాలో భారీ అగ్ని ప్రమాదం

26 మంది సజీవ దహనం

బీజింగ్: చైనాలోని షాంగ్జి ప్రావిన్స్‌లో సంభవించిన అగ్ని ప్రమాదంలో 26 మంది చనిపోగా మరో 38 మంది గాయపడ్డారు. లియులింగ్ నగరంలోని లిషి ప్రాంతంలో గురువారం ఉదయం 6.50 గంటలకు ఘటన చోటుచేసుకుంది. బొగ్గు గని కంపెనీకి చెందిన అయిదంతస్తుల భవనంలోని రెండో అంతస్తులో మొదలైన మంటలు భవనమంతటికీ వ్యాపించినట్లు అధికారులు తెలిపారు. అగ్ని మాపక సిబ్బంది శ్రమించి మంటలను మధ్యాహ్నం 1.45కి అదుపులోకి తెచ్చారని చెప్పారు. చైనాలోని పారిశ్రామిక ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు సర్వసాధారణంగా మారాయి. భద్రతా ప్రమాణాలను పట్టించుకోకపోవడం, అధికార యంత్రాంగం నిర్లక్ష్యమే వీటికి కారణమని చెబుతున్నారు.

యూపీలో మరో రైలులో మంటలు

ఇటావా: ఉత్తరప్రదేశ్‌లోని ఇటావా జిల్లాలో బుధవారం సాయంత్రం దర్భంగా స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలులో అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. కొద్ది గంటల వ్యవధిలోనే అదే జిల్లాలో మరో రైలులో మంటలు చెలరేగాయి. ఢిల్లీ–సహర్సా వైశాలి ఎక్స్‌ప్రెస్ రైలు ఎస్–6 బోగీలో తెల్లవారుజామున 2.40 గంటల సమయంలో మంటలు మొదలైనట్లు ఇటావా ఎస్పీ సంజయ్ కుమార్ చెప్పారు. మంటల విషయం తెలిసిన వెంటనే అధికారులు ఫ్రెండ్స్ కాలనీ సమీపంలోనే రైలును నిలిపివేశారు. అగ్ని మాప సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో 21 మంది ప్రయాణికులు గాయపడ్డారు.

రైలు బోగీలో పేలుడు.. నలుగురికి గాయాలు

సమస్తీపూర్: బిహార్‌లోని సమస్తీపూర్ రైల్వే స్టేషన్‌లోని అవుటర్ సిగ్నల్ వద్ద నిలిపి ఉంచిన ఓ రైలులో పేలుడు సంభవించింది. ఓ బోగీలోని అప్పర్ బెర్త్‌లో ఉంచిన బ్యాగులో ఉంచిన గన్ పౌడర్ ప్రమాదవశాత్తు పేలినట్లు గుర్తించామని అధికారులు తెలిపారు. భాగల్పూర్– దర్భంగా ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలులో సంభవించిన ఈ ఘటనలో మహిళ సహా నలుగురు ప్రయాణికులు గాయపడ్డారు.

టార్గెట్ దక్షిణ గాజా!

ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని ప్రజలకు ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరిక

పల్లెలు, పట్టణాలు ఖాళీ చేయాలంటూ కరపత్రాల పంపిణీ

- మిలిటెంట్లు ఎక్కడ దాగి ఉన్నా దాడులు: ఇజ్రాయెల్ రక్షణ మంత్రి
- అల్–షిఫా ఆసుపత్రిలో హమాస్ ఆయుధాలు స్వాధీనం
- వీడియో విడుదల చేసిన ఇజ్రాయెల్ సైన్యం

ఖాన్ యూనిస్: గాజాలో సాధారణ పాలస్తీనియన్ల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. హమాస్ మిలిటెంట్లపై యుద్ధం పేరిట ఇజ్రాయెల్ సైన్యం విరుచుకుపడుతోంది. భూతల, వైమానిక దాడులతో భారీ భవనాలు క్షణాల్లో శిథిలాల దిబ్బలుగా మారిపోతున్నాయి. జనం పిట్టల్లా రాలిపోతున్నారు. నిత్యం వందల సంఖ్యలో జనం కాళ్లు, చేతులు విరిగి క్షతగాత్రులుగా మారుతున్నాయి. యుద్ధం దక్షిణ గాజాకు విస్తరించే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రధానంగా ఉత్తర గాజాపై భీకర దాడులు చేస్తున్న ఇజ్రాయెల్ సైన్యం ఇప్పుడు దక్షిణ గాజాపై దృష్టి పెట్టింది. ఇక్కడి నుంచి వెంటనే వెళ్లిపోవాలంటూ కరపత్రాలు పంపిణీ చేస్తోంది. పల్లెలు, పట్టణాలను ఖాళీ చేసి మరో చోటుకు వెళ్లాలని ఇజ్రాయెల్ సేనలు హెచ్చరిస్తుండడంతో ప్రజలకు దిక్కుతోచడం లేదు. ఇలాంటి కరపత్రాలను ఉత్తర గాజాలోనూ జారవిడిచిన సంగతి తెలిసిందే. ఉత్తర గాజా నుంచి ఇప్పటికే లక్షలాది మంది ప్రాణభయంతో దక్షిణ గాజాకు వలస వచ్చారు. ఇక్కడ కూడా దాడులు ఉధృతం చేస్తామని ఇజ్రాయెల్ చెబుతుండడంతో ఇక ఎక్కడికి వెళ్లాలని విలపిస్తున్నారు. ఉత్తర, దక్షిణ గాజా అనే తేడా లేకుండా హమాస్ మిలిటెంట్లు ఎక్కడ దాగి ఉన్న దాడులు తప్పవని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యోవ్ గల్లాంట్ స్పష్టంచేశారు. గాజా ప్రజలను తమ భూభాగంలోకి అనుమతించే ప్రసక్తే లేదని పొరుగు దేశం ఈజిప్టు మరోసారి తెగేసి చెప్పింది.









అల్–షిఫా ఆసుపత్రి ఎంఆర్ఐ సెంటర్‌లో హమాస్ దాచిన ఆయుధాలను చూపిస్తున్న ఇజ్రాయెల్ అధికారులు

అల్–షిఫా ఆసుపత్రిలో రెండో రోజూ తనిఖీలు

గాజా స్ట్రిప్‌లో అతిపెద్దదైన అల్–షిఫా ఆసుపత్రిలో ఇజ్రాయెల్ సైన్యం తనిఖీలు రెండో రోజు గురువారం కూడా కొనసాగాయి. ఈ హాస్పిటల్ ప్రాంగణంలో ఓ భవనంలోని ఎంఆర్ఐ ల్యాబ్‌లో హమాస్ మిలిటెంట్ గ్రూప్ పెద్ద ఎత్తున ఆయుధాలు నిల్వ చేసిందంటూ సంబంధిత వీడియోను సైన్యం విడుదల చేసింది. అసాల్ట్ రైఫిల్స్, గ్రెనేడ్లు, హమాస్ దుస్తులు ఈ వీడియోలో కనిపిస్తున్నాయి. అయితే, ఇన్నాళ్లూ చెబుతున్నట్లు అల్–షిఫా ఆసుపత్రి కింద భూగర్భంలో హమాస్ కమాండ్ సెంటర్ ఉన్నట్లు ఇప్పటిదాకా ఎలాంటి సాక్ష్యాన్ని బయటపెట్టలేదు. అల్–షిఫా ఆసుపత్రి చుట్టూ ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు మోహరించాయి. అల్–షిఫాలో తుపాకీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయని ప్రత్యక్ష సాక్ష్యులు గురువారం చెప్పారు. ఇజ్రాయెల్ జవాన్లు కాల్పులు జరుపుతున్నారని ఆరోపించారు.

ఆసుపత్రుల్లో మృత్యు ఘంటికలు

గాజాలో ఆసుపత్రులన్నీ తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నాయి. ప్రాణం పోయాల్సిన ఆసుపత్రుల్లో మృత్యు ఘంటికలు వినిపిస్తున్నాయి. గాజాలో మొత్తం 35 ఆసుపత్రులు ఉండగా, వీటిలో 26 ఆసుపత్రులు పని చేయడం లేదు. విద్యుత్, ఇంధనం, ఔషధాల కొరత వల్ల ఇక్కడ వైద్య సేవలు నిలిపివేశారు. పని చేస్తున్న కొన్ని ఆసుపత్రుల్లో వసతులు లేక రోగులు, శిశువులు విగత జీవులవుతున్నారు. యుద్ధం మొదలయ్యాక గాజాలో ఇప్పటివరకు 12,000 మందికిపైగా మరణించారు. 2,700 మంది అదృశ్యమయ్యారు. వీరంతా శిథిలాల కింద చిక్కుకొని మృత్యువాత పడినట్లు తెలుస్తోంది.

హమాస్ నాయకుల ఇళ్లపై క్షిపణుల వర్షం

గాజాలో హమాస్ ముఖ్యనేతల నివాసాలను ఇజ్రాయెల్ సైన్యం టార్గెట్ చేసింది. ఇప్పటికే పలువురు నాయకులను హతమార్చింది. సీనియర్ హమాస్ కమాండర్ ఇస్మాయిల్ హనియేహ్ ఇంటిని నేలమట్టం చేశామని సైన్యం గురువారం ప్రకటించింది. అయితే, ఆ ఇంట్లో ఎవరైనా ఉన్నారా? లేదా? అనేది తెలియరాలేదు.

'ఆగ్నేయ ఆసియా' రక్షణ మంత్రుల వినతి

ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంలో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతుండడం బాధాకరమని ఆగ్నేయ ఆసియా దేశాల రక్షణ శాఖ మంత్రులు పేర్కొన్నారు. 1967 నాటి సరిహద్దులతో ఇజ్రాయెల్‌తోపాటు స్వతంత్ర పాలస్తీనా దేశాన్ని ఏర్పాటు చేసే దిశగా శాంతి చర్చలు ప్రారంభించాలని సూచించారు. ఈ మేరకు 'అసోసియేషన్ ఆఫ్ సౌత్‌ఈస్టు ఆసియన్ నేషన్స్' పేరిట గురువారం ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు.

తీర్మానం ఆమోదం

ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం విషయంలో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తీర్మానం ఎట్టకేలకు ఆమోదం పొందింది. ఇజ్రాయెల్ దాడుల వల్ల గాజాలో సామాన్య పాలస్తీనియన్లు తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నారని మండలి ఆందోళన వ్యక్తం చేశారు. గాజా ప్రజలకు మానవతా సాయం అందించేందుకు గాజా అంతటా ప్రత్యేక కారిడార్లు ఏర్పాటు చేయాలని, వారికి తగిన రక్షణ కల్పించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని, దాడులకు విరామం ఇవ్వాలని ఇజ్రాయెల్‌కు సూచిస్తూ మండలిలో తీర్మానాన్ని ఆమోదించారు. బందీలను వెంటనే విడుదల చేయాలని ఈ తీర్మానంలో హమాస్‌కు విజ్ఞప్తి చేశారు. మండలిలో 15 సభ్యదేశాలుండగా, మాల్టా దేశం ప్రవేశపెట్టిన ఈ తీర్మానానికి మద్దతుగా 12 దేశాలు ఓటువేశాయి. అమెరికా, యూకే, రష్యా గైర్హాజరయ్యాయి.



బుధవారం కాలిఫోర్నియాలోని ఫిలోలి ఎస్టేట్‌లో బైడెన్, జిన్‌పింగ్

జిన్‌పింగ్ ఓ నియంత

- అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వ్యాఖ్య
- చైనా అధినేతతో 4 గంటలపాటు భేటీ
- పరస్పరం కలిసి పని చేయడానికి ఇరువురు నేతల అంగీకారం

కాలిఫోర్నియా/బీజింగ్: చైనా అధినేత షీ జిన్‌పింగ్ ముమ్మాటికీ ఒక నియంత అని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మరోసారి తేల్చిచెప్పారు. జిన్‌పింగ్‌తో సమావేశమైన తర్వాత కొద్దిసేపటికే ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. బైడెన్, జిన్‌పింగ్ అమెరికాలోని కాలిఫోర్నియాలో స్థానిక కాలమానం ప్రకారం బుధవారం సమావేశమయ్యారు. అమెరికా–చైనా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించుకొనే దిశగా చర్చలు జరిపారు. ఇరువురు నాయకులు భేటీ కావడం ఏడాది తర్వాత ఇదే మొదటిసారి. శాన్‌ఫ్రాన్సిస్కోలో జరిగిన ఆసియా–పసిఫిక్ ఆర్థిక సహకార మండలి శిఖరాగ్ర సదస్సులో వారిద్దరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలిఫోర్నియాలో ప్రత్యేకంగా దాదాపు 4 గంటల పాటు భేటీ అయ్యారు. సమావేశం అనంతరం బైడెన్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ''నిజమే, అతడు(జిన్‌పింగ్) ఒక నియంత'' అని స్పష్టంచేశారు. కమ్యూనిస్టు దేశమైన చైనాను పరిపాలిస్తున్నాడన్న కోణంలో జిన్‌పింగ్‌ను నియంతగా అభివర్ణిస్తున్నట్లు చెప్పారు. అమెరికా కంటే పూర్తి భిన్నమైన పరిపాలన చైనాలో కొనసాగుతోందని అన్నారు. చర్చల్లో తామిద్దరం కొంత పురోగతి సాధించామని వెల్లడించారు. ఫలవంతమైన, నిర్మాణాత్మక చర్చలు జరిపామని తెలియజేశారు. బైడెన్ గతంలో కూడా జిన్‌పింగ్‌ను నియంతగా అభివర్ణిస్తూ వ్యాఖ్యలు చేశారు. దీనిపై చైనా ఘాటుగా ప్రతిస్పందించింది. బైడెన్ రెచ్చగొట్టేలా మాట్లాడారని విమర్శించింది. అసంబద్ధ, అనుచిత వ్యాఖ్యలు చేశారని అభ్యంతరం వ్యక్తం చేసింది. బైడెన్ తాజా వ్యాఖ్యలు మళ్లీ వివాదాన్ని సృష్టించే అవకాశం కనిపిస్తోంది.

మిలటరీ కమ్యూనికేషన్లు పునఃప్రారంభిద్దాం..

అమెరికా, చైనా మధ్య ఉన్నత స్థాయి సైనిక పరమైన సంబంధాలు, కమ్యూనికేషన్లను పునఃప్రారంభించాలని జో బైడెన్, షీ జిన్‌పింగ్ నిర్ణయానికొచ్చారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టే విషయంలో పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించారు. అత్యాధునిక కృత్రిమ మేధ(ఏఐ) వ్యవస్థలతో ఎదురవుతున్న సమస్యలను కలిసికట్టుగా పరిష్కరించుకుందామని అంగీకారానికి వచ్చారు. 4 గంటలపాటు సాగిన చర్చల్లో బైడెన్, జిన్‌పింగ్ పలు కీలక అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. ఇండో–పసిఫిక్ ప్రాంతంలోని తాజా పరిస్థితులు, ప్రాంతీయ అంతర్జాతీయ పరిణామాలపై చర్చించారు. ఇరు దేశాలతోపాటు ప్రపంచానికి మేలు చేకూర్చే అంశాలపై చర్చలు జరిపామని బైడెన్ మీడియాతో చెప్పారు. తాము ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన బెల్ట్ అండ్ రోడ్ కార్యక్రమం(బీఆర్ఐ)లో భాగస్వామిగా మారాలని అమెరికాను జిన్‌పింగ్ ఆహ్వానించారు. అమెరికా చేపట్టే సహకార కార్యక్రమాల్లో తాము పాలుపంచుకుంటామని చెప్పారు. ప్రపంచంలో రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా, చైనా మధ్య ఉద్రిక్తతలు ఆగిపోవాలని, పరస్పరం సహకరించుకోవాలని జిన్‌పింగ్ ఆకాంక్షించినట్లు చైనా మీడియా వెల్లడించింది. సంఘర్షణలు, అర్థంపర్థం లేని పోటీతో నష్టమే తప్ప ప్రయోజనం ఉండదని జిన్‌పింగ్ తేల్చిచెప్పారని పేర్కొంది. చైనా ఆర్థిక వ్యవస్థ ఇటీవలి కాలంలో తీవ్ర ఒత్తిళ్లను ఎదుర్కొంటోంది. అందుకే జిన్‌పింగ్ ఒక మెట్టు దిగి వచ్చినట్లు తెలుస్తోంది.

దత్తత ఇచ్చిన బిడ్డకు డీఎన్ఏ పరీక్ష వద్దు

పోలీసులకు బాంబే హైకోర్టు ఆదేశం

ముంబై: అత్యాచారానికి గురైన బాధితురాలికి జన్మించిన బిడ్డను ఇతరులు దత్తత తీసుకున్న తర్వాత ఆ బిడ్డకు డీఎన్ఏ పరీక్ష నిర్వహించాలనుకోవడం సమంజసం కాదని బాంబే హైకోర్టు తేల్చిచెప్పింది. బిడ్డ ప్రయోజనాలను కాపాడాలని, ఆమె భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని డీఎన్ఏ పరీక్ష నిర్వహించవద్దని పోలీసులను ఆదేశించింది. బాంబే హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం ఈ మేరకు ఈ నెల 10న తీర్పు వెలువరించింది. మహారాష్ట్ర రాజధాని ముంబైలో 2020లో ఓ వ్యక్తి 17 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమె గర్భం దాల్చింది. బిడ్డకు జన్మనిచ్చింది. బాలిక ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అతడిని జైలుకు పంపించారు. మైనర్ బాలికకు జన్మించిన బిడ్డను గుర్తుతెలియని దంపతులు దత్తత తీసుకున్నారు. నిందితుడు 2 సంవత్సరాల 10 నెలలుగా జైల్లోనే ఉన్నాడు. తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం పోలీసులను ప్రశ్నించింది. బాధితురాలి బిడ్డకు డీఎన్ఏ పరీక్ష చేశారా? అని ఆరా తీసింది. బిడ్డను ఇతరులు దత్తత తీసుకున్నారని పోలీసులు బదులివ్వడంతో ఇక డీఎన్ఏ పరీక్ష అవసరం లేదని ఆదేశించింది. నిందితుడికి బెయిల్ మంజూరు చేసింది.

యుద్ధ వ్యతిరేక లేబుళ్లు అంటించినందుకు.. రష్యా కళాకారిణికి ఏడేళ్ల జైలు



మాస్కో: సూపర్‌మార్కెట్‌లోని వస్తువులపై ఉండే ధరల లేబుళ్లను తొలగించి, వాటి స్థానంలో యుద్ధ వ్యతిరేక నినాదాలున్న లేబుళ్లు అంటించిన నేరంపై ఓ కళాకారిణికి రష్యా కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. గత ఏడాది ఉక్రెయిన్‌పై రష్యా దాడులు మొదలయ్యాక.. సెయింట్ పీటర్స్‌బర్గ్‌కు చెందిన సాషా స్కోచిలెంకో(33) అనే కళాకారిణి స్థానిక ఫెమినిస్టు బృందం పిలుపు మేరకు స్థానిక సూపర్ మార్కెట్‌లోని వస్తువుల ధర లేబుళ్లను తీసేసి..'రష్యా ఆర్మీ మరియుపోల్‌లోని స్కూల్‌పై బాంబు వేసింది'... 'రష్యా ఫాసిస్ట్ రాజ్యంగా మారి ఉక్రెయిన్‌పై దాడి చేసినందుకు మా ముత్తాత రెండో ప్రపంచ యుద్ధంలో పోరాడలేదు' అంటూ రాసి ఉన్న కొన్ని లేబుళ్లను అంటించింది. ఈ నేరానికి అధికారులు గత ఏడాది ఏప్రిల్ అదుపులోకి తీసుకున్నారు. యుద్ధానికి వ్యతిరేకంగా ఎలాంటి వైఖరి తీసుకున్నా కఠిన శిక్షలకు అవకాశం కల్పిస్తూ పుతిన్ ప్రభుత్వం చట్టాలు తీసుకువచ్చింది. ఈ చట్టాలు అమల్లోకి వచ్చాక జరిగిన మొట్టమొదటి అరెస్ట్ ఇది. దీంతో, విచారణ సుదీర్ఘంగా సాగింది. తనపై వచ్చిన ఆరోపణలను సాషా అంగీకరించింది కూడా. తీవ్ర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న సాషా జైలులోనే చనిపోయే ప్రమాదముందని ఆమె తరఫు లాయర్లు తెలిపారు. అయినప్పటికీ జడ్జి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ప్రభుత్వ టీవీలో లైవ్‌లో వ్యతిరేకించారన్న ఆరోపణలపై కోర్టు ఒకటి మరినా అనే జర్నలిస్టుకు ఎనిమిదిన్నరేళ్ల జైలు శిక్ష విధించింది. యుద్ధాన్ని నిరసించిన వ్లాదిమిర్ కారా ముర్జా అనే ప్రతిపక్ష నేతకు ఏప్రిల్‌లో 25 ఏళ్ల జైలు శిక్ష పడింది.

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌ల్లో నేడే పోలింగ్

- ఎంపీలో మొత్తం 230 సీట్లు
- ఛత్తీస్‌లో 70 అసెంబ్లీ స్థానాలు
- బీజేపీ, కాంగ్రెస్ హోరాహోరీ

భోపాల్/రాయ్‌పూర్: ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల పోరు కీలక దశకు చేరింది. కీలకమైన మధ్యప్రదేశ్‌లో మొత్తం 230 అసెంబ్లీ స్థానాలకు శుక్రవారం ఒకే దశలో పోలింగ్ జరగనుంది. ఛత్తీస్‌గఢ్‌లో మొత్తం 90 సీట్లకు గాను రెండో, తుది దశలో భాగంగా 70 అసెంబ్లీ సీట్లకు కూడా పోలింగ్ జరుగుతుంది. ఆ రాష్ట్రంలో నవంబర్ 7న తొలి దశలో 20 నక్సల్స్ ప్రాబల్య స్థానాల్లో పోలింగ్ ముగియడం తెలిసిందే. అదే తేదీన ఈశాన్య రాష్ట్రం మిజోరంలో మొత్తం 40 స్థానాకలు ఒకే దశలో పోలింగ్ జరిగింది. మరో కీలక రాష్ట్రమైన రాజస్తాన్‌లో నవంబర్ 25న, చివరగా తెలంగాణలో నవంబర్ 30న పోలింగ్ జరగనుంది. మొత్తం ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలూ డిసెంబర్ 3న వెల్లడవుతాయి.



ఇండోర్‌లో ఎన్నికల సామగ్రితో వెళుతున్న సిబ్బంది

మధ్యప్రదేశ్‌లో..

మధ్యప్రదేశ్‌లో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 114 స్థానాలతో అతి పెద్ద పార్టీగా అవతరించింది. బీఎస్పీ, స్వతంత్రుల మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 15 నెలలకే జ్యోతిరాదిత్య సింధియా సారథ్యంలో 22 మంది ఎమ్మెల్యేలు బీజేపీలో చేరడంతో కుప్పకూలింది. శివరాజ్‌సింగ్ చౌహాన్ సారథ్యంలో బీజేపీ మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఈసారి ఆ రెండింటితో పాటు సమాజ్‌వాదీ పార్టీ కూడా మరోసారి గట్టిగా ఉనికి చాటుకునే ప్రయత్నం చేస్తోంది...

రాష్ట్రంలో బరిలో ఉన్న అభ్యర్థులు	2,553 మంది
మొత్తం ఓటర్లు	5,60,58,521
పురుషులు	2,87,82,261
మహిళలు	2,71,99,586
మొత్తం పోలింగ్ స్టేషన్లు	64,626

ఛత్తీస్‌గఢ్ రెండో దశలో...

రాష్ట్రంలో 15 ఏళ్ల బీజేపీ పాలనకు తెర దించి 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా 68 సీట్లతో కాంగ్రెస్ ఘనవిజయం సాధించింది. ఈ ఐదేళ్లలో సీఎం భూపేశ్ బఘెల్ పలు ప్రజాకర్షక పథకాలతో రైతులతో పాటు అన్ని వర్గాలనూ ఆకట్టుకుంటూ వచ్చారు. అనంతరం ఉప ఎన్నికల విజయాలతో అసెంబ్లీలో కాంగ్రెస్ బలం 71కి పెరిగింది. ఈసారి బీజేపీ, కాంగ్రెస్‌లతో పాటు బీఎస్పీ, ఆమ్ ఆద్మీ పార్టీ కూడా పోటీలో ఉన్నాయి...

రెండో దశ బరిలో అభ్యర్థులు	958 మంది
మొత్తం ఓటర్లు	1,63,14,479
పురుషులు	81,41,624
మహిళలు	81,72,171
పోలింగ్ బూత్‌లు	18,833

స్పెయిన్ ప్రధానిగా మళ్లీ పెడ్రో సాంచెజ్

మాడ్రిడ్: స్పెయిన్ ప్రధాని పీఠాన్ని సోషలిస్ట్ పార్టీకి చెందిన మరోసారి పెడ్రో సాంచెజ్ అధిష్టించనున్నారు. గురువారం పార్లమెంట్‌లో జరిగిన ఓటింగ్‌లో 350 మందికి గాను 179 మంది ఎంపీలు ఆయనకు మద్దతు తెలిపారు. కేటలోనియా వేర్పాటు ఉద్యమ నేత చార్లెస్ పిడ్గెమాంట్‌కు క్షమాభిక్ష ప్రకటించేందుకు పెడ్రో సాంచెజ్ అంగీకరించడం.. బదులుగా వేర్పాటువాద పార్టీలు ఆయన ప్రభుత్వంలో చేరేందుకు అంగీకరించడంతో మైనారిటీ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. నూతన ప్రభుత్వంలో రెండు కేటలోనియా వేర్పాటువాద పార్టీలు సహా మొత్తం ఆరు చిన్న పార్టీలు భాగస్వాములు కానున్నాయి. జూలై 23న జరిగిన ఎన్నికల్లో పార్లమెంట్‌లో ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ దక్కలేదు. 2017లో స్పెయిన్ నుంచి విడిపోతున్నట్లు కేటలోనియా వేర్పాటువాదులు ప్రకటించడంతో దేశంలో సంక్షోభం ఏర్పడింది. వేర్పాటువాద నేత చార్లెస్ పిడ్గెమాంట్‌ను ప్రభుత్వం నేరగాడిగా ప్రకటించింది.

అది విద్వేష ప్రసంగమే.. ప్రధానిపై చర్య తీసుకోండి: కాంగ్రెస్

న్యూఢిల్లీ: రాజస్తాన్‌లోని బర్మేర్‌లో బుధవారం ఎన్నికల ప్రచారంలో విద్వేష పూరిత ప్రసంగం చేసిన ప్రధాని మోదీపై చర్య తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘం(ఈసీ)ని కోరింది. కాంగ్రెస్‌కు మరణ శాసనం లిఖించేందుకు కమలం బటన్‌పై నొక్కాలంటూ ఓటర్లకు పిలుపునిచ్చారని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ తెలిపారు. ప్రధాని అహంకారానికి ప్రజలు తగు గుణపాఠం చెబుతారన్నారు. 'కాంగ్రెస్ నేతలను మోదీ ఎంతగా ద్వేషిస్తున్నారో ఆయన ప్రసంగాన్ని చూస్తేనే తెలుస్తుంది. ప్రధానమంత్రి వంటి బాధ్యతాయుత పదవిలో ఉన్న వ్యక్తి ఇటువంటివి మాట్లాడొచ్చా? ఆయన ప్రజాస్వామ్యం గొంతు పిసికేస్తున్నారు. ఇది కచ్చితంగా విద్వేష ప్రసంగమే'అని జైరాం రమేశ్ గురువారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. ప్రధానిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. బీజేపీ ఎన్నికల గుర్తు కమలం అన్న విషయం తెలిసిందే.

వచ్చే అయిదేళ్లలో 3 వేల కొత్త రైళ్లు

రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి

న్యూఢిల్లీ: రానున్న నాలుగయిదేళ్లలో మూడు వేల కొత్త రైళ్లను ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు.వీటివల్ల రైల్వేల ప్రయాణికుల సామర్థ్యం ప్రస్తుతమున్న 800 కోట్ల నుంచి వెయ్యి కోట్లకు పెరుగుతుందని వెల్లడించారు. రైళ్ల వేగాన్ని పెంచడం, నెట్‌వర్క్‌ను విస్తరించడం ద్వారా ప్రయాణ సమయాన్ని బాగా తగ్గించడం కూడా తమ శాఖ ప్రథమ లక్ష్యమని గురువారం ఆయన రైల్వే భవన్‌లో మీడియాకు తెలిపారు.ప్రస్తుతం 69 వేల కొత్త కోచ్‌లు అందుబాటులో ఉండగా, ఏటా 5 వేల కోచ్‌లు కొత్తగా తయారవుతున్నాయని రైల్వే వర్గాలు తెలిపాయి. వీటితో ఏడాదికి 200 నుంచి 250 వరకు కొత్త రైళ్లు అందుబాటులోకి వస్తాయని, వీటికి తోడు రానున్న సంవత్సరాల్లో మరో 400 నుంచి 450 వరకు వందేభారత్ రైళ్లు కూడా ఉంటాయని పేర్కొన్నాయి.

21 ఏళ్ల తర్వాత.. లాడెన్ లేఖ వైరల్

లండన్: ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం తీవ్రరూపం దాల్చిన వేళ.. ఒకప్పటి అంతర్జాతీయ ఉగ్రవాది ఒసామా బిన్ లాడెన్‌ను మరోసారి జనం స్మరణకు తెచ్చుకుంటున్నారు. 2001లో అమెరికాపై అనూహ్య రీతిలో ఉగ్రదాడులు జరిపి ప్రపంచ దేశాలకు షాకిచ్చిన బిన్ లాడెన్.. ఆ తర్వాత అమెరికా ప్రజలనుద్దేశించి రాసిన రెండు పేజీల లేఖ టిక్–టాక్‌లో వైరల్‌గా మారడం గమనార్హం. ఒసామా లేఖకు సంబంధించిన వీడియోలు సోషల్‌మీడియాలో వైరలవుతున్నాయి. పాలస్తీనాను ఆక్రమించి అనచివేతకు పాల్పడుతున్న ఇజ్రాయెల్‌కు అమెరికా మద్దతు కూడా 9/11 దాడులకు ఓ కారణమని అందులో లాడెన్ సమర్థించుకున్నాడు. ''పాలస్తీనా దశాబ్దాలుగా ఆక్రమణలో ఉంది. అమెరికా అధ్యక్షులెవరూ పట్టించుకోలేదు. పాలస్తీనా ఎప్పటికీ ఆక్రమణలోనే ఉండిపోదు. సంకెళ్లను తెంచుకునేందుకు ప్రయత్నిస్తాం. అమెరికా అహంకారానికి క్రైస్తవుల రక్తంతో మూల్యం చెల్లించక తప్పదు'అని లాడెన్ హెచ్చరించాడు.

నేపథ్యం ఆధారంగా జడ్జీలపై ఆ ముద్రలు వేయొద్దు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్

న్యూఢిల్లీ: అడ్వొకేట్ లక్ష్మణచంద్ర విక్టోరియా గౌరీని మద్రాస్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమిస్తూ సుప్రీంకోర్టు కొలీజియం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సమర్థించారు. విక్టోరియా గౌరీ గతంలో మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్‌లో కేంద్ర ప్రభుత్వం తరఫున వాదించారు. ఆమె బీజేపీ అభిమాని అనే పేరుంది. ఆమెను మద్రాస్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమించాలని కొలీజియం సిఫార్సు చేసింది. కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేయడంతో ఈ ఏడాది ఫిబ్రవరి 7న ఆమె మద్రాస్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. ఈ నియామకం వివాదానికి దారితీసింది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ హైకోర్టు బార్ సభ్యులు కొందరు జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు లేఖ రాశారు. కొలీజియం సిఫార్సును రద్దు చేయాలని కోరారు. విక్టోరియా గౌరీ గతంలో పలు సందర్భాల్లో క్రైస్తవులకు, ముస్లింలకు వ్యతిరేకంగా విద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకొచ్చారు. జస్టిస్ డీవై చంద్రచూడ్ ఇటీవల హార్వర్డ్ లా కాలేజీ సెంటర్ కార్యక్రమంలో మాట్లాడారు. మద్రాస్ హైకోర్టు బార్ సభ్యుల లేఖపై స్పందించారు. కొలీజియం అన్ని అంశాలను క్షుణ్నంగా పరిశీలించిన తర్వాతే న్యాయమూర్తుల పేర్లను సిఫార్సు చేస్తుందని గుర్తుచేశారు. లాయర్లుగా ఉన్నప్పుడు వారి నేపథ్యాన్ని, వెలిబుచ్చిన సొంత అభిప్రాయాలను దృష్టిలో పెట్టుకొని జడ్జిలపై ఒక వర్గం వ్యతిరేకులుగా ముద్ర వేయడం సరైంది కాదని అన్నారు. గొప్ప తీర్పులు వెలువరించిన జస్టిస్ కృష్ణ అయ్యర్‌కు కూడా రాజకీయ నేపథ్యం ఉండేదని అన్నారు.

క్లుప్తంగా...

పంచగ్రామాల్లో ఇళ్ల మరమ్మతులకు ప్రభుత్వం అనుమతి

సింహాచలం: స్థానిక వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంతో ముడిపడి ఉన్న పంచగ్రామాల్లో ఇళ్ల మరమ్మతులకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్.కరికాల వలవన్ మెమో జారీ చేశారు. ఆ మెమో ప్రకారం... ప్రస్తుతం ఉన్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి పూర్తి సమాచారాన్ని ముందుగా దేవస్థానానికి నివాసితులు అందించాలి. అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి మరమ్మతులకు అనుమతి ఇవ్వాలి. అనుమతి పొందినవారు కేవలం ఇళ్లకు మరమ్మతులు మాత్రమే చేయాలి. కొత్తగా ఎలాంటి నిర్మాణాలు, మార్పులు చేయడానికి వీలులేదు. ఈ మేరకు సింహాచలం దేవస్థానానికి కూడా మెమో కాపీని ప్రభుత్వం పంపింది. కాగా, ఎన్నో ఏళ్లుగా శిథిలమైన ఇళ్లలో నివసిస్తున్న పంచగ్రామాల ప్రజలకు ప్రభుత్వ నిర్ణయం ఎంతగానో ఉపయోగపడనుంది. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం అధికారికంగా ఇళ్ల మరమ్మతులకు అనుమతిస్తూ మెమో జారీ చేయలేదు.

నేటి నుంచి లాసెట్ కౌన్సెలింగ్



సాక్షి, అమరావతి: ఏపీలో న్యాయ విద్యలో ప్రవేశాలకు గాను ఉన్నత విద్యా మండలి గురువారం షెడ్యూల్ విడుదల చేసింది. ఏపీ లాసెట్, పీజీ లాసెట్‌లో ప్రవేశాలకు సంబంధించి శుక్రవారం (నేడు) నుంచి 20వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించింది. 18–22 వరకు ధ్రువపత్రాల పరిశీలన, 23–25 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు చేసుకోవచ్చు. 26న ఆప్షన్లమార్పులకు అవకాశం ఇచ్చింది. 28న సీట్లు కేటాయిస్తారు. సీట్లు పొందినవారు 29, 30వ తేదీల్లో కళాశాలల్లో రిపోర్టు చేయాలి. వివరాలను **https://cets.apsche.ap.gov.in** లో అందుబాటులో ఉంచింది.

తిరుపతిలో జీఎస్టీ కమిషనరేట్ ఏర్పాటు అభినందనీయం
కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్



తిరుపతి అర్బన్: తిరుపతి నగరంలో జీఎస్టీ కమిషనరేట్ కార్యాలయం ఏర్పాటు శుభపరిణామమని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. తిరుపతి అన్నమయ్య సర్కిల్ సమీపంలో కార్యాలయ నిర్మాణానికి గురువారం భూమి పూజతోపాటు శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వర్చువల్ పద్ధతిలో పాల్గొన్న కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. వేంకటేశ్వరుడు కొలువైన ప్రాంతంలో జీఎస్టీ కమిషనరేట్‌కు భూమి పూజ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. తిరుపతి సీజీఎస్టీ కమిషనరేట్ పరిధిలో తిరుపతి, చిత్తూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్య సాయి, కడప అన్నమయ్య జిల్లాలు ఉన్నాయని, ఇందులో ఎక్కువ శాతం మౌలిక సదుపాయాల పరిశ్రమలు ఉన్నట్లు చెప్పారు. వివిధ పరిశ్రమల ద్వారా జీఎస్టీ వసూళ్లలో ఇక్కడ గణనీయమైన పురోగతి ఉందన్నారు. కార్యక్రమంలో సీబీఐసీ జోనల్ సభ్యులు వివేక్ నిరంజన్, ఏడీజీ సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ హైదరాబాద్ రేంజ్ శిశిర్ భన్సల్, వైజాగ్ జోన్ చీఫ్ కమిషనర్ సీజీఎస్టీ సంజయ్ పంత్‌తో పాటు సీజీఎస్టీ, సీబీఐసీ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

భూ విప్లవం

ఒకేసారి సమస్యలన్నింటికీ పరిష్కారం చూపిన సీఎం జగన్

- 27.41 లక్షల ఎకరాలపై పేదలకు యాజమాన్య హక్కులు
- నిరుపేదలకు కొత్తగా 46 వేల ఎకరాల పంపిణీ
- లంక భూములకు అసైన్‌మెంట్ పట్టాలు
- శ్మశాన వాటికలు లేని దళిత వాడల కోసం 951 ఎకరాల కేటాయింపు
- సర్వీస్ ఈనాం, చుక్కలు, షరతులు గల పట్టా భూములపై ఆంక్షల తొలగింపు
- దేశానికే ఆదర్శంగా కొనసాగుతున్న భూముల రీ సర్వే
- నేడు నూజివీడులో సీఎం జగన్ బహిరంగ సభ.. భారీ భూ పంపిణీకి శ్రీకారం



సాక్షి, అమరావతి: ఆంక్షలు, వివాదాల్లో ఇరుక్కుపోయిన భూముల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ దిశగా మరో కీలక ముందడుగు వేస్తున్నారు. భూములకు సంబంధించి కొద్ది నెలలుగా ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలను అమల్లోకి తెస్తూ శుక్రవారం ఏలూరు జిల్లా నూజివీడులో నిర్వహిస్తున్న బహిరంగ సభలో సీఎం జగన్ పాల్గొననున్నారు. దళితులు, పేదల జీవితాలు పూర్తిగా మారిపోయే అత్యంత కీలకమైన 12 అంశాలు ఇందులో ఉన్నాయి. నిరుపేదలకు భూముల పంపిణీని ప్రారంభించడంతోపాటు అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించడం, లంక భూములకు పట్టాలతోపాటు చుక్కల భూములు, షరతుల గల పట్టా భూములు, సర్వీస్ ఈనాం భూములను 22 ఏ జాబితా నుంచి తొలగించడం, దళిత వాడలకు శ్మశాన వాటికలు కేటాయిస్తూ పత్రాలు ఇవ్వడం, భూమి కొనుగోలు పథకం కింద ఇచ్చిన భూములపై హక్కుల కల్పన, గిరిజనులకు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాల పంపిణీని సీఎం జగన్ ఈ సభలో ప్రారంభించనున్నారు.

46 వేల ఎకరాలకుపైగా పంపిణీ

రాష్ట్రంలో సుదీర్ఘకాలం తర్వాత భూముల పంపిణీని ముఖ్యమంత్రి జగన్ చేపడుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను ఆర్థికంగా మెరుగైన స్థితికి చేర్చడమే లక్ష్యంగా భూ పంపిణీకి శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 46,463.82 ఎకరాలను వ్యవసాయం కోసం కొత్తగా 42,307 మందికి డీకేటీ పట్టాలుగా ఇవ్వనున్నారు. జిల్లాల వారీగా అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి ఇప్పటికే పంపిణీకి అసైన్‌మెంట్ కమిటీల ఆమోదం తీసుకున్నారు. డీకేటీ పట్టాలతోపాటు ఎఫ్ఎంబీ, అడంగల్ కాపీలు కూడా జారీ అయ్యాయి. వాటిని అర్హులకు ఇచ్చే కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించనున్నారు.

లంక భూములకు పట్టాలు

దశాబ్దాల నాటి లంక భూముల సమస్యను పరిష్కరించి అర్హులైన రైతులకు పట్టాలు ఇవ్వనున్నారు. ఏళ్ల తరబడి వీటిని సాగు చేసుకుంటున్నా పత్రాలు లేకపోవడంతో రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా లాంటి ప్రయోజనాలు అందుకోలేకపోతున్నారు. ఎనిమిది జిల్లాల్లో విస్తరించిన లంక గ్రామాల్లోని 9,064 ఎకరాలు 17,768 మంది రైతుల సాగులో ఉన్నట్లు ఎంజాయ్‌మెంట్ సర్వే ద్వారా గుర్తించారు. ఏ, బీ కేటగిరీ లంక భూములకు డీకేటీ పట్టాలతోపాటు సీ కేటగిరీ భూములకు లీజు పట్టాల పంపిణీని సీఎం ప్రారంభించనున్నారు.

సర్వీస్ ఈనాం భూములపై ఆంక్షల తొలగింపు

ఏళ్ల తరబడి గ్రామాల్లో వివాదాస్పదంగా ఉన్న సర్వీస్ ఈనాం భూముల సమస్యను సైతం సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం పరిష్కరించింది. 1,61,584 మంది రైతులకు సంబంధించి 1,58,113 ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించారు. గతంలో ఈనాం చట్టం ప్రకారం దేవదాయ భూములను 22 ఏ జాబితాలో పొందుపరచిన

ప్పుడు కుల వృత్తులు చేసుకునే వారికిచ్చిన సర్వీస్ ఈనాం భూములు కూడా పొరపాటున అందులో చేరిపోయాయి. అప్పటి నుంచి వాటిపై ఆంక్షలు తొలగించకపోవడంతో లక్షలాది మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు కుమ్మరి, కమ్మరి, రజక, నాయీ బ్రాహ్మణులు తదితర వృత్తుల వారికి కేటాయించిన సర్వీస్ ఈనాం భూములపై ఆంక్షలు తొలగిపోయాయి.

దళిత వాడలకు శ్మశాన వాటికలు

శ్మశాన వాటికలు లేని దళిత వాడలు ఉండరాదనే ఉద్దేశంతో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో 1,563 గ్రామాల్లో 951 ఎకరాల ప్రభుత్వ భూమిని శ్మశాన వాటికల కోసం కేటాయించారు. ఈ భూమిని ఇప్పటికే ఆయా గ్రామ పంచాయతీలకు అప్పగించారు.

2.06 లక్షల ఎకరాల చుక్కల భూములకు విముక్తి

గత సర్కారు తప్పిదాలతో వివాదాస్పదంగా మారిన చుక్కల భూముల సమస్యను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సునాయాసంగా పరిష్కరించింది. ఒకేసారి 15 జిల్లాల్లో 2.06 లక్షల ఎకరాల చుక్కల భూములను నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగించింది. తద్వారా సంబంధిత రైతులకు తమ భూములపై సర్వ హక్కులు లభించాయి. ఈ సమస్య పరిష్కారంతో చాలా ఏళ్లుగా నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు ఇప్పుడు జరుగుతున్నాయి. పంట రుణాలు కూడా వస్తున్నాయి. రాష్ట్ర చరిత్రలో లక్షల ఎకరాల భూములకు విముక్తి కల్పించడం ఇదే తొలిసారి. వాటిని రైతులు స్వేచ్ఛగా అమ్ముకునే హక్కు కల్పించడంతోపాటు రుణాలు పొందేందుకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

షరతుల పట్టా భూముల సమస్యకు పరిష్కారం

సమస్యాత్మకంగా మారిన షరతుల గల పట్టా భూములకు ప్రభుత్వం పరిష్కారం చూపింది. 33 వేల ఎకరాల షరతుల గల పట్టా భూములను నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగించి రైతులకు మేలు చేకూర్చింది. బ్రిటీష్ హయాం నుంచి రైతుల చేతుల్లో ఉన్న భూములను టీడీపీ పాలనలో 22 ఏ కేటగిరీలో చేర్చారు. ఈ అన్యాయాన్ని సరిదిద్దుతూ నిబంధనల ప్రకారమే వాటిని ఆ జాబితా నుంచి ప్రభుత్వం తొలగించింది. 17,730 సర్వే నెంబర్లకు సంబంధించి 33 వేలకుపైగా ఎకరాలను 22ఏ జాబితా నుంచి తీసివేసింది. ఒక్క కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలోనే 18 వేలకుపైగా ఎకరాలను 22ఏ నుంచి తొలగించడం గమనార్హం.

భూమి కొనుగోలు పథకం భూములకు హక్కులు

భూమి లేని నిరుపేద దళితులకు భూమి కొనుగోలు పథకం ద్వారా ఇచ్చిన భూములపైనా అమలులో ఉన్న ఆంక్షలను ప్రభుత్వం తొలగించింది. ఆ భూములు ఎస్సీ కార్పొరేషన్ తనఖాలో ఉండడంతో వాటిని నిషేధిత జాబితాలో చేర్చారు. దీనికి సంబంధించి 22,837 ఎకరాలకు ఇప్పుడు విముక్తి లభించడంతో 22,346 మంది దళితులకు మేలు జరిగింది. సీఎం వైఎస్ జగన్ ఈ సమస్య తన దృష్టికి రాగానే సత్వరమే పరిష్కరించారు.

అసైన్డ్ భూములపై హక్కులు

రాష్ట్రంలో తొలిసారిగా అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించేందుకు వాటిని 22 ఏ జాబితా నుంచి తొలగిస్తున్నారు. భూములున్నా వాటికి విలువ లేకుండాపోవడంతో హక్కులు కల్పించాలని దీర్ఘకాలంగా దళిత, పేద రైతులు కోరుతున్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో విస్తృత అధ్యయనం, ఇతర రాష్ట్రాల్లో విధానాలపై ప్రజాప్రతినిధుల కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం అసైన్‌మెంట్ జరిగి 20 ఏళ్లు పైబడిన భూములపై పేదలకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ మేరకు చట్ట సవరణ చేసింది. ఒరిజినల్‌గా భూముల పొందిన రైతులకు హక్కులు ఇవ్వాలని నిర్ణయించి అమలు చేయడం ప్రారంభించింది. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా 15,21,160 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పేద రైతులు తమకు అసైన్ అయిన 27,41,698 ఎకరాలపై పూర్తి యాజమాన్య హక్కులు పొందనున్నారు. ఆ భూములను నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగించారు.

నేడు నూజివీడుకు సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: భారీ భూ పంపిణీ కార్యక్రమానికి నేడు నూజివీడు వేదికగా సీఎం జగన్ శ్రీకారం చుట్టనున్నారు. ఒక్క ఏలూరు జిల్లాలోనే 10,303 మందికి 12,886.37 ఎకరాల భూమిని శాశ్వత హక్కుతో అందించనున్నారు. 31 గ్రామాల్లో ఎస్సీ శ్మశాన వాటికలకు 33.32 ఎకరాలను ఇదే వేదిక నుంచి మంజూరు చేయనున్నారు. శుక్రవారం సీఎం జగన్ నూజివీడు రాక సందర్భంగా హెలీప్యాడ్, బహిరంగ సభ వద్ద భద్రతా ఏర్పాట్లను ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప అప్పారావు, కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేష్, ఎస్పీ డి.మేరిప్రశాంతి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సీఎం పర్యటన ఇలా..

- ఉదయం 10.25 గంటలకు నూజివీడులోని హెలీప్యాడ్‌కు చేరుకుని ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులతో మాట్లాడతారు.
- 10.55 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకుని వివిధ శాఖలు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్, ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తారు.
- 11.10 నుంచి 12.25 గంటల వరకు భూ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పట్టాలు పంపిణీ చేసి సభలో ప్రసంగిస్తారు.
- 12.50 గంటలకు హెలీప్యాడ్‌కు చేరుకుని స్థానిక నాయకులు, ప్రజలను కలుసుకుంటారు. అనంతరం 1.55 గంటలకు తాడేపల్లి పయనం కానున్నారు.

గోడు విన్నారు.. పోడు భూమిలిచ్చారు

- ఆర్వోఎఫ్ఆర్ పట్టాల పంపిణీలో దేశానికే ఆంధ్రప్రదేశ్ ఆదర్శం
- గత ప్రభుత్వాలు తిరస్కరించిన దరఖాస్తులకు పునర్విచారణతో న్యాయం

సాక్షి, అమరావతి: గిరిజనుల గోడును ఆలకించి నేను ఉన్నానంటూ భరోసా ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోడు భూములకు అటవీ హక్కుల గుర్తింపు చట్టం(ఆర్వోఎఫ్ఆర్ యాక్ట్) ద్వారా పట్టాలిచ్చి రికార్డు సృష్టించారు. గిరిజనులకు పోడు భూముల పంపిణీలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను ఆదర్శంగా నిలిపారు. 2008 నుంచి 2019 వరకు గత ప్రభుత్వాలు 95,649 గిరిజన కుటుంబాలకు 2,33,410 ఎకరాలకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలిచ్చాయి. వీటిల్లో గత పదకొండేళ్లలో ఇచ్చిన మొత్తం పట్టాల్లో అత్యధికంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పంపిణీ చేసినవే కావడం గమనార్హం. వాస్తవానికి పోడు భూములకు పట్టాల పంపిణీకి శ్రీకారం చుట్టింది కూడా వైఎస్సారే. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి గత నాలుగున్నరేళ్లలో ఏకంగా మొత్తం 1,30,368 కుటుంబాలకు 2,87,710 ఎకరాలకు పట్టాలిచ్చి పేదలకు మేలు చేయడంలో తండ్రి కంటే రెండు అడుగులు ముందుంటానని నిరూపించుకున్నారు. వీటిలో 1,29,842 మందికి 2,19,763 ఎకరాలు, 526 సామూహిక(కమ్యూనిటీ) టైటిల్స్ ద్వారా 67,947 ఎకరాల పోడు భూములకు పట్టాలుగా పంపిణీ చేయడం విశేషం.

డీకేటీ పట్టాల పంపిణీ..

గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ భూమిని (రిజర్వ్ ఫారెస్ట్ కాని భూమి) వారు సాగు చేసుకొని జీవించేలా రాష్ట్ర ప్రభుత్వం డీకేటీ పట్టాల రూపంలో పంపిణీ చేస్తుంది. గత నాలుగున్నరేళ్ల కాలంలో ఈ కార్యక్రమం ద్వారా 26,287 మంది గిరిజనులకు 39,272 ఎకరాల భూమిని పంపిణీ చేయడం గమనార్హం.

పునర్విచారణతో లబ్ధి

అడవులు, గ్రామ పొలిమేర (సరిహద్దు) భూములు తదితర కారణాలతో గత ప్రభుత్వాల హయాంలో 73,469 మంది గిరిజనుల దరఖాస్తులను తిరస్కరించారు. తమకు పట్టాలివ్వాలని గిరిజనులు గోడు వెళ్లబోసుకోవడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పునర్విచారణ చేసి పట్టాలిచ్చే కార్యక్రమాన్ని చేపట్టింది. ఇప్పటివరకు అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో సుమారు 25,380 దరఖాస్తులపై పునర్విచారణ జరిపి 40,930 ఎకరాలను పట్టాలుగా ఇచ్చారు. గతంలో తిరస్కరణకు గురైన పోలవరం ముంపు గ్రామాలకు చెందిన దరఖాస్తులను సైతం పునఃపరిశీలించి 2,372 గిరిజన కుటుంబాలకు 6,407 ఎకరాలను పోడు వ్యవసాయం కోసం పట్టాలుగా ఇచ్చారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై పునర్విచారణ జరిపి అర్హత ఉన్న వారికి న్యాయం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశించడం గమనార్హం.

పెద్దమనసు చాటుకున్న జగన్



అటవీ భూములకు హక్కు పత్రాల పంపిణీలో మన రాష్ట్రం దేశంలోనే ఆదర్శంగా నిలిచింది. 2005 డిసెంబర్ 13కు ముందు సాగులో ఉన్న అటవీ భూమిపై మాత్రమే పోడు భూమి హక్కులను గుర్తించేలా చట్టం ఉంది. పట్టాలు పంపిణీకి శ్రీకారం చుట్టిన 2008 జనవరి 1 నుంచి ఆ చట్టాన్ని పొడిగించాలని, దానివల్ల ఎక్కువ మంది గిరిజనులకు మేలు జరుగుతుందని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ సీఎం జగన్ లేఖ రాశారు. ఇది పేద గిరిజనులపై సీఎం జగన్‌కు ఉన్న ప్రేమ, పెద్దమనసుకు నిదర్శనం. ఏజెన్సీ ప్రాంతంలో పట్టా భూములు, సొంత భూముల సాగులో గిరిజన రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోంది. రాష్ట్రంలో 3,40,043 మంది గిరిజన రైతులకు రైతు భరోసా పథకం ద్వారా సుమారు రూ.484.02 కోట్లు వారి ఖాతాలకే జమ చేసి అండగా నిలిచారు. రైతు భరోసా అందుకునే గిరిజన రైతుల సంఖ్య 2019–20లో 2,82,871 మంది కాగా.. ఇప్పుడు ఆ సంఖ్య 3,40,043కు పెరిగింది. ఎటువంటి పక్షపాత ధోరణి లేకుండా అర్హులైన వారందరికీ లబ్ధి చేకూర్చాలన్నదే సీఎం జగన్ ఉద్దేశం.

–పీడిక రాజన్నదొర, ఉపముఖ్యమంత్రి

రీ సర్వే మహాయజ్ఞం

రాష్ట్రంలో వివాదరహితంగా భూ యాజమాన్య హక్కులు, క్లియర్ టైటిలింగ్ వ్యవస్థ అమలు కోసం నిర్వహిస్తున్న వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం విజయవంతంగా అమలు జరుగుతోంది. దీనిద్వారా ప్రభుత్వ హామీతో శాశ్వత ఆస్తి హక్కు పత్రాన్ని భూయజమానికి ఇస్తున్నారు. ఈ కార్యక్రమం కోసం 10,185 మంది గ్రామ సర్వేయర్లు, 2688 మంది వీఆర్‌ఓలు, 5417 మంది పంచాయతీ కార్యదర్శులు, 3786 మంది ప్లానింగ్ కార్యదర్శులు, 679 మంది మొబైలు మేజిస్ట్రేట్ల సేవలను ప్రత్యేకంగా వినియోగిస్తున్నారు. గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ సేవలు అందిస్తున్నారు. ఇప్పటికే రెండు దశల్లో నాలుగు వేల గ్రామాల్లో భూముల రీ సర్వే పూర్తయింది. ఆయా గ్రామాల్లో రిజిస్ట్రేషన్ సేవలు కూడా అందుబాటులోకి వచ్చాయి. 42.6 లక్షల ఎకరాల భూముల రీ సర్వే పూర్తి కాగా 4.8 లక్షల మ్యుటేషన్లు జరిగాయి. సరిహద్దు వివాదాలకు సంబంధించి 45 వేల కేసులను పరిష్కరించారు. 17.53 లక్షల భూహక్కు పత్రాలు పంపిణీ చేశారు. భూముల సరిహద్దులు గుర్తిస్తూ 49.04 లక్షల రాళ్లు పాతారు. మూడో విడతలో మరో 2 వేల గ్రామాల్లో సర్వేను వచ్చే ఏడాది జనవరి 31కి పూర్తి చేసేలా సన్నాహాలు చేస్తున్నారు.

పురస్కార విజేతలు.. స్ఫూర్తి ప్రదాతలు



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, చిత్రంలో వైఎస్ భారతీరెడ్డి, సాక్షి మీడియా గ్రూప్ సీఈఓ, డైరెక్టర్లు.

▶ మొదటి పేజీ తరువాయి

ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య, వ్యవసాయం, క్రీడలు, ఆరోగ్యం, పర్యావరణం లాంటి రంగాల్లో అవార్డు గ్రహీతలు సమాజంపై చెప్పుకోదగిన ప్రభావం చూపారని, వారి శ్రమకు ఈ పురస్కారాలు తగిన గుర్తింపు అని పేర్కొన్నారు ఈ సందర్భంగా ఏపీ గవర్నర్.. 'మానవ సేవను మించిన అత్యుత్తమ మతం లేదు..' అన్న ఉడ్రో విల్సన్(ఒకప్పటి అమెరికా అధ్యక్షుడు) సూక్తిని ఉటంకించారు. సమాజ సేవ చేసే ఎన్జీవోలు, సంస్థలు, విభిన్న రంగాలకు చెందిన వ్యక్తులను ఎంపిక చేయడంలో సెలక్షన్ కమిటీ పనితీరును ఆయన అభినందించారు. వ్యయ ప్రయాసలకోర్చి సాక్షి మీడియా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిందన్నారు. అవార్డు గ్రహీతలను.. పేరు పేరునా వారి విజయాలను ప్రస్తావిస్తూ జస్టిస్ నజీర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ భారతీరెడ్డి, సాక్షి మీడియా గ్రూప్ సీఈఓ, డైరెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా.. రైతుల కష్టాలను కళ్లకు గట్టిన సుమధుర ఆర్ట్స్ అకాడమీ నృత్య రూపకం, ఇతర సంగీత సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

జనసేన X టీడీపీ

- రసాభాసగా టీడీపీ–జనసేన ఆత్మీయ సమావేశాలు
- ఇరు పార్టీల నేతల్లో అడుగడుగునా అభద్రతా భావం, ఆధిపత్య పోరు

గండేపల్లి/గోకవరం/మదనపల్లె/పెడన/బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు)/తుమ్మపాల (అనకాపల్లి జిల్లా) : టీడీపీ–జనసేన ఆత్మీయ సమావేశాలు ఇరు పార్టీ నేతల మధ్య అంతరాలను బట్టబయలు చేస్తున్నాయి. ఆ రెండు పార్టీల నేతలకు ఏ దశలోనూ అసలు పొసగడం లేదు. దీంతో ఇరు పార్టీల నేతలు, కార్యకర్తలు బాహాబాహీకి దిగుతూ సమావేశాలను రసాభాసగా మార్చేస్తున్నారు. తాజాగా గురువారం జరిగిన సమావేశాల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగింది.

ఆ జనసేన నేతకు టికెట్ ఇస్తే మద్దతివ్వం: టీడీపీ నేత జ్యోతుల నెహ్రూ ప్రతిజ్ఞ

టీడీపీ, జనసేన పొత్తు కాకినాడ జిల్లాలో ఆదిలోనే వికటిస్తోంది. ఇటీవల పిఠాపురంలో ఈ రెండు పార్టీల సమావేశం రసాభాసగా ముగియగా, తాజాగా గురువారం జగ్గంపేట నియోజకవర్గ సమావేశానిదీ అదే పరిస్థితి. సమావేశానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జ్యోతుల నెహ్రూ, ఆయన తనయుడు నవీన్‌కుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పాటంశెట్టి సూర్యచంద్ర, పెద్దాపురం, పిఠాపురం జనసేన పార్టీ ఇన్‌చార్జిలు తుమ్మల బాబు, తంగెళ్ల ఉదయశ్రీనివాస్ హాజరయ్యారు. గోకవరం మండల జనసేన పార్టీ కన్వీనర్ ఉంగరాల మణిరత్నంపై ఇటీవల టీడీపీ నేత గణేష్ దాడి చేసిన అంశాన్ని సమావేశం ప్రారంభంలోనే సూర్యచంద్ర ప్రస్తావించారు. నెహ్రూ ప్రసంగిస్తుండగానే.. దాడి వ్యవహారాన్ని తేల్చాలంటూ పట్టుబట్టారు. జ్యోతుల నవీన్ కలుగజేసుకోవడంతో ఇద్దరి మధ్య తోపులాట జరిగింది. సూర్యచంద్రను నవీన్ గెంటివేయడంతో ఒక్కసారిగా ఇరు పార్టీ శ్రేణులు బాహాబాహీకి దిగాయి. జనసేన టికెట్టు సూర్యచంద్రకు ఇస్తే మద్దతిచ్చేది లేదంటూ జ్యోతుల నెహ్రూ ప్రతిజ్ఞ చేశారు. దీంతో సూర్యచంద్ర, ఆ పార్టీ నాయకులు సభ నుంచి బయటకు వెళ్లిపోయారు.



టీడీపీ నేత జ్యోతుల నవీన్‌కుమార్, జనసేన నేత సూర్యచంద్రల మధ్య వాగ్వాదం

మాకన్నా తక్కువ స్థాయి నేతకు మైక్ ఎలా ఇస్తారు?

అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణంలో జరిగిన టీడీపీ–జనసేన ఆత్మీయ సమావేశంలో టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్యేలు దొమ్మలపాటి రమేష్, షాజహాన్‌బాషా, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు హాజరయ్యారు. జనసేన నుంచి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేష్, రాయలసీమ కోకన్వీనర్ గంగారపు రాందాస్‌చౌదరి, చేనేత విభాగం అధ్యక్షుడు అడపా సురేంద్ర పాల్గొన్నారు. మొదట రాందాస్‌చౌదరి, తర్వాత రమేష్ ప్రసంగించారు. తర్వాత జనసేన తరఫున శివరాం, సురేంద్రకు మాట్లాడే అవకాశం ఇచ్చారు. దీనిని మైఫోర్స్ మహేష్ తమ్ముడు, అతడి అనుచరులు తీవ్రంగా వ్యతిరేకించారు. తమ నాయకుడికి కాకుండా తమకంటే తక్కువ స్థాయి నాయకుడికి మైక్ ఎలా ఇస్తారంటూ రాందాస్‌చౌదరిపై తిరుగుబాటు చేయడమేగాక.. గొడవకు దిగారు. కాగా, జనసేన మదనపల్లె అభ్యర్థిగా ప్రచారం చేసుకుంటున్న రామాంజనేయులు, దారం అనిత వర్గం సమావేశానికి డుమ్మా కొట్టారు.



కృష్ణా జిల్లా పెడనలో కుర్చీలు విసురుతున్న జనసేన వర్గీయులు

కుర్చీలతో కుమ్ములాట

కృష్ణా జిల్లా పెడనలో సమావేశం జరుగుతుందని టీడీపీ, జనసేన పార్టీలోని కొందరికి సమాచారం వెళ్లింది. మరికొంతమంది ముఖ్య నేతలకు సమాచారం చేరకపోవడంతో.. తమ నాయకుడికి ఎందుకు సమాచారం ఇవ్వలేదని నిలదీసేందుకు టీడీపీలోని మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ వర్గానికి చెందిన కొందరు ఫంక్షన్ హాలుకు చేరుకున్నారు. జనసేన పెడన నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఇటీవల ఉరివి సర్పంచ్ సురేష్‌ను నియమించడం తెలిసిందే. నియోజకవర్గంలో పార్టీకి సంబంధించిన అన్ని కార్యక్రమాలు నిర్వహించిన రామ్‌సుధీర్‌ను కాదని వేరే వారికి పదవి ఇవ్వడంపై రామ్‌సుధీర్ వర్గీయులు ఆగ్రహంగా ఉన్నారు. టీడీపీ నేతలు జనసేన ఇన్‌చార్జి సురేష్‌ను వేదికపైకి ఆహ్వానించి కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు యత్నించారు. దీంతో రామ్‌సుధీర్ వర్గీయులు గొడవకు దిగారు. ఆ సమయంలోనే జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ సభావేదిక వద్దకు చేరుకున్నారు. సురేష్‌ను ఏ విధంగా పెడనకు ఇన్‌చార్జిగా నియమించారంటూ రామ్‌సుధీర్ వర్గీయులు నిలదీశారు.



మదనపల్లె జనసేన ఇన్‌చార్జ్ రాందాస్‌చౌదరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మైఫోర్స్ మహేష్

అక్కడే ఉన్న జనసేనలోని మరో వర్గం వారు కూడా రామ్‌సుధీర్ వర్గంతో గొడవకు దిగడంతో రసాభాసగా మారింది. ఒక వర్గంపై మరో వర్గం వారు కుర్చీలు విసురుకున్నారు. జనసేన వాళ్లు కుమ్ములాడుకుంటున్న సమయంలో టీడీపీ మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు సభా వేదిక వద్దకు వచ్చారు. పరిస్థితి చేయి దాటిపోతోందని గమనించి బయటకు వెళ్లిపోయారు.

జనసేన రాష్ట్ర నేత పిలిచినా.. డోంట్ కేర్!

విశాఖ తూర్పు నియోజకవర్గంలో టీడీపీ, జనసేన పార్టీల ఆత్మీయ సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ వచ్చారు. ఆయన రాగానే జనసేన నాయకులు లేచి ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ పక్కన కుర్చీ వేశారు. అయితే మూర్తియాదవ్ అక్కడ కాకుండా లైన్ చివరిలో కూర్చున్నాడు. సత్యనారాయణ పలుమార్లు పిలిచినా కనీసం ఆయన వైపు కూడా మూర్తియాదవ్ చూడలేదు. టీడీపీ నాయకులు సైతం పిలిచినా ఆయన స్పందించలేదు.

జనసేన నేతలకు అధిష్టానం షోకాజ్..

సభలో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని అడిగిన అనకాపల్లి నియోజకవర్గంలోని జనసేన నేతలకు పార్టీ అధిష్టానం షోకాజ్ నోటీ సులిచ్చింది. పార్టీ కోసం నిరంతరం పని చేస్తున్న తమకు షోకాజ్ నోటీసులిచ్చి అవమానించడం అన్యాయమని దూలం గోపీనాథ్, మళ్ల శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు.

జనసేనకు ఝలక్

- వైఎస్సార్‌సీపీలో చేరిన భీమిలి, నాగాయలంక నేతలు
- టీడీపీ,జనసేన పొత్తు నచ్చకే రాజీనామా చేశామని వెల్లడి



వేముల ఈశ్వర్‌రెడ్డి, ఆయన అనుచరులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మాజీ మంత్రి బాలరాజు



చింతాను పార్టీలోకి ఆహ్వానిస్తున్న అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కొమ్మాది(విశాఖపట్నం)/నాగాయలంక: జనసేన పార్టీకి భారీ షాక్ తగిలింది. విశాఖ జిల్లా భీమిలి, కృష్ణా జిల్లా నాగాయలంకకు చెందిన పలువురు నేతలు, వారి అనుచరులు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. భీమిలి నియోజకవర్గానికి చెందిన జనసేన పార్టీ విశాఖ పార్లమెంట్ వర్కింగ్ కమిటీ మెంబర్ వేముల ఈశ్వర్‌రెడ్డి, ఆయన అనుచరులను స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మాజీ మంత్రి బాలరాజు పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే జనసేన పార్టీ నాగాయలంక మండల అధ్యక్షుడు, బీసీ మత్స్యకార యువ నేత చింతా వెంకటేశ్వరరావు కూడా అవనిగడ్డ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వేముల ఈశ్వర్ రెడ్డి, చింతా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలతో ఉండాల్సిన జనసేన పార్టీ అవినీతి టీడీపీతో అంటకాగుతోందన్నారు. జనసేన పెట్టిన దగ్గర నుంచి తాము పార్టీకి పలు రూపాల్లో సేవలు చేశామని, అయితే అవినీతి, అక్రమాలకు పాల్పడి జైలు పాలయిన చంద్రబాబునాయుడు పార్టీ టీడీపీతో పొత్తు పెట్టుకోవడం నచ్చక రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబును సీఎం చేయాలనే ఏకైక లక్ష్యంతో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ టీడీపీ జెండాను నెత్తిన పెట్టుకోవడం రాష్ట్రంలో అనేకమంది జనసేన నాయకులకు మింగుడుపడడం లేదన్నారు. రానున్న కాలంలో మరికొంత మంది సీనియర్ నాయకులు జనసేనను వీడేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వారు వెల్లడించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

नैनं छिन्दन्ति शस्त्राणि नैनं दहति पावकः ।
न चैनं क्लेदयन्त्यापो न शोषयति मारुतः ॥



~ Endless Inspiration. Matchless legacy ~

Hon'ble Saharasri Ji

(1948 – 2023)

Sahara India Pariwar expresses its collective sense of grief at the loss of its beloved Chief Guardian, Hon'ble 'Saharasri' Ji, who left for his heavenly abode on 14th November, 2023.

The strength of his character, the influence of his personality and the power of his presence have all left a lasting memory. As he passes from the turmoil of life to eternal tranquillity, he leaves behind a legacy that remains as a profound and precious imprint in the hearts of billions to whom his life brought hope and encouragement.

The man who enlightened us to the supremacy of human emotions over business interests, will continue to guide us, inspire us to new frontiers, for he exemplified human spirit in its true essence - unconquerable and supremely courageous.

SAHARA
INDIA PARIWAR

WhatsApp number : +91 98399 90501 | Email Id : contact@sahara.in

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
శుక్రవారం। 17 । నవంబర్ । 2023



కాంతులీనుతున్న నాగేంద్ర ఆలయం

పెనమలూరు: మండలంలోని చోడవరం శ్రీలక్ష్మీ నారాయణ సహిత నాగేంద్రస్వామి ఆలయాన్ని నాగులచవితి పండుగ సందర్భంగా విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.



చెస్ క్రీడాకారుడికి అభినందనలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): వరల్డ్ చెస్ ఫెడరేషన్ నిర్వహించిన ఫిడే ఆరేనా ఇంటర్నేషనల్ మాస్టర్ టైటిల్ విన్నర్ పొలూరి కుమారస్వామిని సీపీ టి.కె.రాణా గురువారం అభినందించారు.



కేంద్ర అధికారి పర్యటన

పెనమలూరు: పెదపులిపాకలో కేంద్ర ప్రభుత్వ నోడల్ అధికారి ఎం.రామచంద్రుడు గురువారం పర్యటించారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర సన్నాహక కార్యక్రమంలో పాల్గొన్నారు.

లంక రైతులకు పట్టాభిషేకం

- దశాబ్దాల సమస్యకు శాశ్వత పరిష్కారంతో రైతుల్లో హర్షాతిరేకాలు
- కృష్ణా జిల్లాలో 21 లంక గ్రామాల్లో 5,888 మంది రైతులకు లబ్ధి
- ఎన్టీఆర్ జిల్లాలో మరో 1,333 మంది లబ్ధిదారులకు మేలు
- నేడు నూజివీడులో లాంఛనంగా పట్టాలు ఇవ్వనున్న సీఎం వైఎస్ జగన్

దశాబ్దాలుగా భూములు సాగు చేసుకుంటున్న రైతులు వారు. ముక్కారు పంటలు పండే ఆ భూములపై వారికి ఎటువంటి హక్కులూ లేవు. ఆరోగ్యం దెబ్బతిన్నా, పిల్లలను చదివించాలన్నా, ఆడబిడ్డల పెళ్లి చేయాలన్నా ఆ రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించక తప్పేది కాదు. ఆ రైతుల లంకంత కష్టాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పట్టాలు ఇచ్చి దూరం చేస్తోంది.

సాక్షి ప్రతినిధి, విజయవాడ: లంక భూముల రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. లంక భూములను దశాబ్దాలుగా సాగు చేసుకొంటున్న రైతులకు వాటిపై ఎలాంటి హక్కులూ లేవు. పట్టాదారు పాసుపుస్తకాలు లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రయోజనాలు లభించేవికావు. పట్టాలు ఇప్పించి ఆదుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు లంక గ్రామాల రైతులు ఎన్నిసార్లు విన్నవించినా ప్రయోజనం శూన్యం. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఉమ్మడి కృష్ణా జిల్లా ఎమ్మెల్యేలు పేర్ని నాని, కైలే అనిల్‌కుమార్, సింహాద్రి రమేష్ బాబు, మొండితోక జగన్మోహన్‌రావు, వసంత కృష్ణ ప్రసాద్ లంక రైతుల సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. రైతుల సమస్యలపై దృష్టి సారించిన ముఖ్యమంత్రి కృష్ణా జిల్లాలో 21 లంక గ్రామాల్లో ఉన్న 3,382 ఎకరాలు, ఎన్టీఆర్ జిల్లాలో 853 ఎకరాల భూములకు పట్టాలు ఇవ్వాలని నిర్ణయించారు. దీంతో కృష్ణా జిల్లాలో 5,888 మంది, ఎన్టీఆర్ జిల్లాలో 1,333 మంది రైతులకు లబ్ధిచేకూరనుంది. నూజివీడులో శుక్రవారం జరగనున్న కార్యక్రమంలో లంకరైతులు పట్టాలు అందుకోనున్నారు. దీంతో ఈ రైతుల కుటుంబాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

పట్టాలు ఇవ్వనున్న లంక భూములు ఇవీ..

కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలో దక్షిణచిరువోలులంక, పులిగడ్డలోని మయపులంక, ఎడ్లంకలోని ఎరుకులలంక, వేకనూరులంక, చల్లపల్లి మండలంలో వెలివోలులోని చీడేపూడిలంక, నడకుదురులోని ఆముదార్లంక, నిమ్మగడ్డలంక, మోపిదేవి మండలంలోని కె.కొత్తపాలెంలో లచ్చిగానిలంక, బొబ్బర్లంకలోని నామిడిలంక, పడకలంక, పామర్రు మండలంలో దేవరపల్లి, చాగంటిపాడు, రొయ్యూరు, తోట్లవల్లూరు లంక రైతులకు పట్టాలు అందనున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలోని మైలవరం నియోజకవర్గంలో ఇబ్రహీంపట్నం, జూపూడి, త్రిలోచనాపురం, మూలపాడు, కొటికలపూడి, నందిగామ నియోజకవర్గం, కంచికచర్ల మండలంలో కొత్తపేట, గని ఆత్కూరు, చెవిటికల్లు, మున్నలూరు, కొనకనపాడు, ఎస్.అమరవరం లంక భూములకు పట్టాలు ఇవ్వనున్నారు.



అవనిగడ్డ మండలం వేకనూరు లంక భూముల్లో సాగులో ఉన్న వరి చేలు

కృష్ణా జిల్లా....

మండలం	గ్రామాలు	పట్టాలిచ్చే భూములు (ఎకరాల్లో)	లబ్ధిదారుల సంఖ్య
అవనిగడ్డ	4	100.890	132
చల్లపల్లి	3	760.400	838
నాగాయలంక	2	74.00	102
మోపిదేవి	3	272.420	872
ఘంటసాల	1	432.299	754
కోడూరు	1	86.330	83
మచిలీపట్నం	2	208.510	116
తోట్లవల్లూరు	4	1,434.990	2,898
పమిడిముక్కల	1	12.740	93
మొత్తం	21	3382.579	5,888

ఎన్టీఆర్ జిల్లా

మండలం	గ్రామాలు	పట్టాలిచ్చే భూములు (ఎకరాల్లో)	లబ్ధిదారుల సంఖ్య
ఇబ్రహీంపట్నం	5	765.07	1,209
కంచికచర్ల	6	88.56	120
మొత్తం	11	853.63	1,329



జూపూడి లంక భూముల్లో సాగవుతున్న క్యాలీఫ్లవర్, ఇతర పంటలు

పెరగనున్న లంక భూముల ధరలు

కృష్ణా నది పరీవాహక ప్రాంతంలోని భూముల్లో ఏటా మూడు పంటలు పండుతాయి. కొబ్బరి, మామిడి తోటలు, పసుపు, వరి, అరటి, కంద, మినుము, కూరగాయల పంటలు సాగుచేస్తారు. లంక భూములకు పట్టాలు లేకపోవడం వల్ల ప్రస్తుతం ఎకరా భూమి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకే ధర పలుకుతోంది. ఈ గ్రామాల్లో వేరేచోట్ల పంట భూముల ధర ఎకరాకు రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఉంది. లంక భూములకు పట్టాలు ఇవ్వడంతో వీటికీ మంచి ధర వస్తుందని, అవసరమైతే బ్యాంకులు రుణాలు ఇస్తాయని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

సంతోషంగా ఉంది



తోట్లవల్లూరు లంకలో 23 ఏళ్లుగా 50 సెంట్ల పొలం సాగు చేస్తున్నా. దానికి ఎలాంటి హక్కులూ లేవు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లంక భూములకు పట్టాలు ఇవ్వడంతో భూమిపై నాకు హక్కు వచ్చింది. అడంగల్‌లో భూమి నమోదవడంతో రైతు భరోసా, విత్తనాలు, ఎరువులు, బ్యాంకు రుణాలు, పంట నష్టపరిహారం పొందటానికి అవకాశం కలుగుతుంది. గత ప్రభుత్వాలు చేయలేని మేలు చేసి ఆదుకున్న జగనన్నకు లంక రైతులు ఎల్లప్పుడూ రుణపడి ఉంటారు.

– పడమట హరిప్రసాద్, రైతు, తోట్లవల్లూరు

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



మా నాన్న 1930వ సంవత్సరం నుంచి లంక భూమి సాగు చేస్తూ 1942లో అప్పటి మద్రాస్ ప్రభుత్వం నుంచి లీజు అనుమతి పొందారు. నేను ఆ భూమిని 40 ఏళ్లుగా సాగు చేస్తున్నా. ఇప్పటి వరకు ఎన్నో ప్రభుత్వాలు మారినా మాకు భూమిపై ఎటువంటి హక్కు కల్పించలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చొరవతో ఈ రోజు నా భూమిపై నాకు పూర్తి హక్కులు వచ్చాయి. మా ప్రాంతంలో 1300 మందికి మేలు చేకూరింది. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– పీతా సీతారామయ్య, రైతు, ఇబ్రహీంపట్నం

తుది ఓటర్ల జాబితా ప్రచురణకు ఏర్పాట్లు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ–2024లో భాగంగా జనవరి ఐదో తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్న నేపథ్యంలో ఫారం–6, 7, 8లను ప్రణాళికాయుతంగా పరిష్కరిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈఓ) ముకేష్ కుమార్ మీనా వెలగపూడి సచివాలయం నుంచి ఓటర్ల జాబితా సవరణపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎలక్టోరల్ అధికారులతో గురువారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. తుది ఓటర్ల జాబితా ప్రచురణకు తీసుకోవాల్సిన చర్యలపై మార్గనిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ జిల్లాకు సంబంధించిన ప్రగతిని సీఈఓకు వివరించారు. ఫారం 6,7,8 లను త్వరితగతిన పరిష్కరిస్తున్నామన్నారు. డిసెంబర్ రెండు, మూడు తేదీలను ప్రత్యేక ప్రచార రోజులుగా గుర్తించి 2024, జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండే వారందరూ కొత్తగా ఓటు పొందేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇందుకు ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించామన్నారు. దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించేందుకు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నామని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ దృష్టికి తెచ్చిన అంశాలను పరిశీలించి, పరిష్కరిస్తున్నామని వెల్లడించారు. జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్వో ఎస్.వి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఇంటింటికీ అయోధ్య రాముని పవిత్ర అక్షింతలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): జనవరి 22వ తేదీన అయోధ్య శ్రీరామ ఆలయ ప్రాణ ప్రతిష్ఠలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని శైవ పీఠం శివస్వామి, మాత శివ చైత్యానంద పిలుపునిచ్చారు. ముత్యాలంపాడు కోదండ రామాలయంలో గురువారం అయోధ్య శ్రీరాముని పవిత్ర అక్షింతలు స్పర్శ కార్యక్రమం జరిగింది. శివస్వామి, మాత శివ చైత్యానంద ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. అయోధ్యలో శ్రీరాముల వారికి పూజలు చేసిన అక్షింతలు రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ అందజేసేందుకు ఇక్కడకు చేరుకున్నాయన్నారు. ఇక్కడ నుంచి అన్ని జిల్లాలకు అక్షింతలను పంపిస్తామన్నారు. వీహెచ్‌పీ కేంద్రీయ ఉపాధ్యక్షుడు గోకరాజు గంగరాజు, ఆర్‌ఎస్‌ఎస్ ఆంధ్రప్రదేశ్ ప్రచారక్ ఆదిత్య, కోనేరు దుర్గాప్రసాద్, నరసయ్య పాల్గొని మాట్లాడారు. ప్రాంత కార్యదర్శి తనికెళ్ల రవి, కోశాధ్యక్షుడు దుర్గాప్రసాద్ రాజు తదితరులు పాల్గొన్నారు.

శంకరయ్యకు సీపీఎం ఘన నివాళి

సాక్షి, అమరావతి: స్వాతంత్ర్య సమరయోధుడు, సీపీఎం వ్యవస్థాపక సభ్యుడు ఎస్.శంకరయ్య మృతికి ఆ పార్టీ రాష్ట్ర కమిటీ ఘన నివాళులర్పించింది. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన శంకరయ్య సంతాప సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడారు. అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షుడిగా, కార్యదర్శిగా శంకరయ్య అందించిన సేవలు మరువలేనివన్నారు. 1940 లోనే పార్టీ సభ్యత్వం తీసుకుని విద్యార్థి దశలోనే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న గొప్ప దేశ భక్తుడని కొనియాడారు. శంకరయ్య ఇంటికి వెళ్లి సత్కరించిన తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ రూ.10 లక్షలు చెక్ ఇస్తే దాన్ని కరోనాతో బాధపడుతోన్న వారి కోసం ఖర్చు చేయాలని తిరిగి ఇచ్చిన గొప్ప వ్యక్తి అని శ్రీనివాసరావు గుర్తు చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు జయరాం అధ్యక్షతన జరిగిన సభలో ఉమామహేశ్వరరావు, రమాదేవి, మంతెన సీతారాం, సీహెచ్ బాబూరావు మాట్లాడారు.

‘ఉపాధి’ తీరుపై అధ్యయనం



నాగాయలంక(అవనిగడ్డ): గ్రామాల్లో ఉపాధి హామీ పనుల తీరును అధ్యయనం చేసే క్రమంలో ఢిల్లీ నుంచి అయిదుగురు సభ్యులతో కూడిన నేషనల్ లెవెల్ మానటరింగ్(ఎన్ఎల్ఎం) బృందం గురువారం మండలంలో పర్యటించింది. శిక్షణలో భాగంగా వచ్చిన ఈ బృందంలో శుభం చౌహాన్, శివమ్ భరద్వాజ్, సాగర్ రావత్, వంశిక, శ్రీష్టి ఉన్నారు. మండలంలోని టి.కొత్తపాలెం అమృత సరోవర్ ట్యాంక్‌ను బృందం సభ్యులు పరిశీలించి పనులు జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. రూ.2.62లక్షలు వ్యయంతో కూలీలకు 1150 పనిదినాలు కల్పించామని మండల ఏపీఓ రవికుమార్ వివరించారు. పర్యటనలో ఈఓ పీఆర్‌డీ కె.అప్పలనరసమ్మ, సర్పంచ్ శివ పార్వతి భర్త బండ్రెడ్డి శ్రీనివాసరావు, ఉపాధి హామీ క్షేత్ర సిబ్బంది పాల్గొన్నారు.

28 నుంచి ప్లంబింగ్‌లో ఉచిత శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న ప్లంబింగ్ మేస్త్రీలు, వర్కర్లతో పాటు ఆసక్తి ఉన్న యువకులకు ప్లంబింగ్ పనుల్లో నైపుణ్యాలు పెంచేందుకు ఉచిత శిక్షణ ఇస్తామని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.పవన్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుంచి శిక్షణ మొదలవుతుందని పేర్కొన్నారు. విద్యాధరపురం కబేళా దగ్గర ఉన్న సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్ ఆవరణలో శిక్షణ తరగతులు కొనసాగుతా యని వివరించారు. ఓవర్‌హెడ్ ట్యాంక్ కనెక్షన్, పంపులు, మోటార్లు అమర్చడంపై అవగాహన, వాటర్ ట్యాంక్ రిపేరు, హెచ్‌డీపీఈ, యూపీవీసీ, సీపీవీసీ పైపుల జాయింట్ రిపేర్లు, హౌస్ వాటర్ సర్వీస్ కనెక్షన్, కేబుల్ జాయింటింగ్‌పై శిక్షణ ఇస్తామని వివరించారు. కోర్సు సమయంలో భోజన సదుపాయంతో పాటుగా రూ.500 గౌరవ వేతనం ఇస్తామని పేర్కొన్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి వాటర్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లంబింగ్ స్కిల్ కౌన్సిల్ న్యూఢిల్లీ నుంచి సర్టిఫికెట్ కూడా అందిస్తామని తెలిపారు. 18 నుంచి 50 ఏళ్లలోపు వారు అర్హులని, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 24 లోగా 96667 71746, 98667 95010 సెల్ నంబర్లలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

అభివృద్ధి రథం.. ప్రగతి పథం

- విజయవాడ నగరంలో అభివృద్ధి పరుగులు
- రూ.285.28 కోట్లతో పలు అభివృద్ధి పనులు
- వీఎంసీకి రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్ మంజూరు
- అత్యధికంగా నాడు–నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి
- రివర్ ఫ్రంట్ వ్యూ పార్కు, బందరు రోడ్డు కారిడార్‌కు నిధులు ఖర్చు

పటమట(విజయవాడతూర్పు): బెజవాడలో అభివృద్ధి పరుగులు తీస్తోంది. దేశంలోని ప్రధాన నగరాలకు దీటుగా నగరాన్ని తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. అన్ని డివిజన్లలో కోట్లాది రూపాయలతో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టింది. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. రోడ్లు, డ్రెయిన్లు, తాగు నీటి వసతి, పాఠశాలలు, ఆస్పత్రులు, పార్కుల ఆధునికీకరణ, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం.. ఇలా అనేక రకాల పనులు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం నాలుగున్నరేళ్ల కాలంలో సుమారు రూ.285.28 కోట్లు వీఎంసీకి అందించి నగరాన్ని అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేస్తోంది. ఇటీవల జరిగిన నగరపాలక సంస్థ సమావేశంలో నగరాభివృద్ధిపై ప్రతిపక్ష నాయకులు ఆరోపణలు చేయగా ఏ మేరకు అభివృద్ధి జరిగిందో మేయర్ రాయన భాగ్యలక్ష్మి సభాముఖంగా వివరించారు.

ప్రభుత్వ పాఠశాలల మరమ్మతులకు రూ.100 కోట్లు

నగరంలో ప్రభుత్వ పాఠశాలల మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఇందుకు రూ.100 కోట్లు ఖర్చు చేసి మూడు సర్కిళ్లలో రెండు విడతలుగా 40 పాఠశాలల రూపురేఖలను సమూలంగా మార్చింది. శివారు ప్రాంతాల్లో నూతన రోడ్ల నిర్మాణం, నగరంలోని వివిధ ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు, తాగునీటి పైపులైన్లు మార్చటం, రిజర్వాయర్లు నిర్మించడం, కొండ ప్రాంతాలకు మెరుగైన స్థాయిలో నీటిని అందించడం, మరమ్మతులకు గురైన డ్రెయినేజీల స్థానంలో కొత్తవి నిర్మించడం, ఫుట్‌పాత్‌లు, పాత్‌వేలు తదితర అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం జీజీఎంపీ (గవర్నమెంట్ గ్రాంటెడ్ మార్జిమం ఫండ్స్) నుంచి రూ.46.2 కోట్ల మేర నిధులను వెచ్చించింది.



విజయవాడ నుంచి గన్నవరం వెళ్లే మార్గంలో గ్రీనరీ



వారధి ప్రాంతంలో నిర్మిస్తున్న రివర్ ఫ్రంట్ పార్కు

వీఎంసీకి విడుదల చేసిన నిధులు

- గవర్నమెంట్ గ్రాంటెడ్ మార్జిమం ఫండ్స్ (జీజీఎంపీ) : 46.2 కోట్లు
- నాడు–నేడు స్కూళ్ల అభివృద్ధికి : రూ.100 కోట్లు
- ప్రత్యేక నిధులు : రూ. 50.96 కోట్లు
- డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ : రూ.3.40 కోట్లు,
- కాపు కార్పొరేషన్ : రూ.కోటి
- చీఫ్ మినిస్టర్ డెవలప్‌మెంట్ ఫండ్స్ : రూ.6.73 కోట్లు
- ఎంజీ రోడ్డు ఫుట్‌పాత్‌ల అభివృద్ధికి : రూ.7.63 కోట్లు
- రిటైనింగ్ వాల్ బ్యూటిఫికేషన్‌కు : రూ.7.78 కోట్లు

ప్రస్తుతం జరుగుతున్న పనులు ఇవీ..

- రివర్ ఫ్రంట్ వ్యూ బ్యూటిఫికేషన్ పార్కు అంచనాలు రూ.12 కోట్లు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.7.78 కోట్లు విడుదల చేసింది. ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి. వాకింగ్ ట్రాక్, ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు రకరకాల మొక్కలు నాటటంతోపాటు ఓపెన్ జిమ్ వంటి సౌకర్యాలను కల్పిస్తున్నారు.
- స్వరాజ్ మైదాన్‌లో అంతర్జాతీయ స్థాయిలో చేపట్టిన డాక్టర్ బాబా సాహెబ్ స్మృతి వనం కారిడార్ నిర్మాణంలో భాగంగా బందరు రోడ్డును సుందరీకరిస్తున్నారు. ఈ మేరకు ఎంజీ రోడ్డు పోలీస్ కంట్రోల్ రూం (పీసీఆర్) నుంచి బెంజి సర్కిల్ వరకు రోడ్డుకు ఇరువైపులా గ్రానైట్ ఫుట్‌పాత్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.7.63 కోట్ల నిధులు విడుదల చేసింది.
- గన్నవరం విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా వచ్చినందున నగర సందర్శకుల సౌకర్యార్థం రామవరప్పాడు రింగ్ నుంచి నిడమానూరు వరకు జరుగుతున్న ఎయిర్‌పోర్టు కారిడార్ నిర్మాణానికి రూ.12 కోట్ల నిధులు మంజూరవగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.7 కోట్లు, అర్బన్ గ్రీనరీ – బ్యూటిఫికేషన్ విభాగం రూ.4 కోట్ల నిధులు విడుదల చేసి ఖర్చు చేస్తోంది.

పూర్తిస్థాయిలో ప్రభుత్వ సహకారం



నగరాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో సహకారం ఉంది. వీఎంసీ నుంచి ప్రభుత్వానికి వెళ్లిన ప్రతిపాదనల్లో ఇప్పటి వరకు దేనినీ తిరస్కరించలేదు. వీఎంసీపై సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి పూర్తి అవగాహనతో ఉన్నారు. వారధి పార్కు నిర్మాణం చేపట్టాలన్నది ఆయన సూచనే. స్మృతివనం, కారిడార్‌ను సుందరంగా తీర్చిదిద్దాలని నిరంతరం పర్యవేక్షణ చేయటంతోపాటు అధికారులకు సూచనలు ఇస్తున్నారు. రానున్న కాలంలో విజయవాడను మరింత సుందరంగా తీర్చిదిద్దుతాం.

– స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కమిషనర్, వీఎంసీ

బాల్య వివాహాలు లేని సమాజాన్ని నిర్మిద్దాం

పాయకాపురం(విజయవాడరూరల్): బాల్య వివాహాలు లేని సమాజాన్ని నిర్మిద్దామని ఎన్టీఆర్ జిల్లా సైన్స్ అధికారి ఎం.హుస్సేన్ అన్నారు. బాలల హక్కుల పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా గురువారం ఎల్‌బీఎస్‌నగర్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య హైస్కూల్‌లో ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్, సంయుక్త ఫౌండేషన్, పోలీసు, మహిళా శిశు సంక్షేమ శాఖ, పలు స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన సదస్సు జరిగింది. హుస్సేన్ మాట్లాడుతూ.. బాల్యవివాహాలు సమాజ అభివృద్ధికి ఆటంకమన్నారు. 25 ఏళ్లుగా ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ చేస్తున్న సేవలను అభినందించారు. బాల్యవివాహాలతో అనర్థాలు, బాల్య వివాహ నిరోధక చట్టంపై ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కోఆర్డినేటర్ అరవ రమేష్ అవగాహన కల్పించారు. బాలలు ఆపదలో ఉన్నప్పుడు వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీస్ 100, 112 లేదా మహిళా హెల్ప్ లైన్ 181కు ఫోను చేసి సహాయం పొందాలని మహిళా హెడ్‌కానిస్టేబుల్ వి.పద్మావతి సూచించారు. బాలల హక్కుల గురించి కోటీ ప్రకాష్‌కుమార్, రవీంద్ర మాట్లాడారు.

నమో నాగేశ్వరా

- మోహినీపురంలో వెలసిన మహిమాన్విత నాగపుట్ట
- నేడు నాగులచవితి వేడుకలకు తరలిరానున్న లక్షలాది భక్తులు



పూలమాలతో అలంకరించిన ఆలయం



మోపిదేవిలో లింగాకారంలో సుబ్బారాయుడు



ప్రాశస్త్యం గల నాగపుట్ట

మోపిదేవి(అవనిగడ్డ): ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానంలో మహిమాన్విత నాగపుట్ట వెలసింది. మోహినీపురంగా పిలువబడిన ప్రస్తుత మోపిదేవిలోని ఈ నాగపుట్టకు చారిత్రక ప్రాశస్త్యం ఉంది. అందుకే ఈ నాగపుట్టలో నాగులచవితి నాడు పాలుపోసేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. ముఖ్యంగా వివిధ అవసరాలతో వచ్చే భక్తులు స్వామిని కొంగు బంగారంగా కొలుస్తారు. భక్తులు పుట్టు వెంట్రుకలు, చెవిపోగులు, అన్నప్రాసన, నామకరణాలు, పూజలు, రుద్రాభిషేకాలు, నిత్య కల్యాణాలు చేసుకుని వారి కోరిన కోర్కెలు నెరవేరుతాయని ప్రతీక. నాగపుట్ట నుంచి దక్షిణకాశీగా పేరుగాంచిన పెదకళ్లేపల్లి దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి దేవస్థానానికి కలుగు ఉందని ప్రచారంలో ఉంది. స్వామివారు తరచూ ఈ కలుగు ద్వారా ప్రయాణిస్తుంటారని చెబుతుంటారు. ఏడాదికి ఓ మారు స్వామివారు ప్రత్యక్షంగా దర్శనం ఇస్తూ భక్తులకు మహిమాన్వితులను చేస్తుంటారు. ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంలో కొలువైన నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఆలయ అధికారులు అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

నాగుల చవితికి ఏర్పాట్లు పూర్తి..

శుక్రవారం నాగుల చవితి సందర్భంగా తెల్లవారుజాము 2.30 గంటలకు ఆలయ ప్రధానార్చకులు బుద్దు పవన్‌కుమార్ శర్మ, ఇతర వేదపండితులు నాగపుట్ట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. భక్తుల రద్దీ దృష్ట్యా విశాలంగా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. నాగపుట్ట వద్ద భారీ బందోబస్తు నిర్వహిస్తారు. చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల అధికారులు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బందితో పాటు స్వచ్ఛంద సంస్థల సహకారం కూడా అందిస్తారు.



కోనేరు వద్ద నెలకొల్పిన కార్తికేయుని విగ్రహం

అద్భుతమైన నాగమల్లి వృక్షం..

పుణ్యక్షేత్రం లోపల స్వామివారి నాగమల్లి వృక్షం కొలువైంది. అరుదుగా కన్పించే ఈ వృక్షాలు కాశీలో ఎక్కువగా ఉంటాయి. ఈ వృక్షానికి కూడా ఎంతో ప్రాముఖ్యత ఉంది. వెయ్యి పడగలతో మధ్యలో శివలింగం ఆకారంతో పువ్వు పూస్తుంది. భక్తులు ఈ వృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేసి ముడుపు కడితే వారి కోర్కెలు నెరవేరతాయని భక్తుల అచెంచల విశ్వాసం.

కాలేయం..జర భద్రం

- ఫ్యాటీ లివర్‌ను అశ్రద్ధ చేయొద్దు
- పెరుగుతున్న లివర్ సిర్రోసిస్ కేసులు
- ఏడాదికోసారి పరీక్షలు తప్పనిసరి

మన శరీరావయవాల్లో పునరుత్పత్తి అయ్యే ఒకేఒక అవయవం కాలేయం. అందుకే వైద్యులు దీనిని ఫ్రెండ్లీ ఆర్గాన్ అని పిలుస్తారు. అటువంటి కాలేయాన్ని మనం ఒక మంచి స్నేహితుడిలా జాగ్రత్తగా చూసుకోవాలని, ఏం కాదులే అని అశ్రద్ధ చేస్తే ప్రాణానికే ప్రమాదం దాపురించే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.


ఆరోగ్యవంతమైన లివర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): కాలేయ సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్య ఇటీవల పెరుగుతోంది. నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు కాలేయ రోగులు నిత్యం క్యూ కడుతున్నారు. వారిలో లివర్ సిర్రోసిస్ కేసులు కూడా ఉంటున్నాయని వైద్యులు చెపుతున్నారు. ఆహారపు అలవాట్లు కారణంగా ప్రతి వంద మందిలో 60 మందికి ఫ్యాటీ లివర్ ఉంటుండగా, 15 శాతం మందిలో గాల్‌బ్లాడర్‌లో రాళ్లు ఉంటున్నట్లు వైద్యులు చెబుతున్నారు. లివర్ సిర్రోసిస్‌కు గురైన వారిలో అల్కహాల్ తాగే వారితో పాటు, ఆల్కాహాల్ తాగని వారు సైతం ఆ వ్యాధికి గురవడం ఆందోళన కలిగిస్తోంది.

ప్రభుత్వాస్పత్రికి క్యూ...

లివర్ సమస్యలతో బాధపడుతున్న వారు ప్రభుత్వాస్పత్రికి క్యూ కడుతున్నారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీకి రోజుకు 200 నుంచి 250 మంది వరకూ వస్తుంటారు. వారిలో అల్సర్లు, అరుగుదల ఇబ్బందులతో పాటు, లివర్ ప్రాబ్లమ్స్ ఉన్న వారు కూడా ఎక్కువగా ఉంటున్నారు. హెపటైటిస్ బీ, సీ కేసులు కూడా వస్తున్నాయి. నెలలో ఇద్దరు, ముగ్గురు లివర్ సిర్రోసిస్ కొత్త కేసులను చూస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఫ్యాటీలివర్ కేసులు పదుల సంఖ్యలో ఉంటున్నాయని వారు అంటున్నారు. నాన్ ఆల్కహాలిస్టుల్లో ఫ్యాటీలివర్ సిర్రోసిస్‌కు దారితీస్తే ప్రాణాంతకం కావచ్చు.

ఈ సమస్యలు ఉన్న వారు అప్రమత్తంగా ఉండాలి

లివర్ సమస్యలు ఎక్కువగా మధుమేహులు, హోపోథైరాయిడ్ ఉన్న వారు, హెపటైటీస్ సి, రక్తంలో కొలస్ట్రాల్ స్థాయిలు అబ్‌నార్మల్‌గా ఉన్న వారిలో వస్తున్నాయి. ఫ్యాటీలివర్ కామన్‌గా భావించి అశ్రద్ధ చేస్తుండటంతో అది కాస్తా సిర్రోసిస్‌కు దారితీస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఫ్యాటీలివర్ గ్రేడ్ 1, గ్రేడ్ 2, గ్రేడ్ 3లో దుష్ఫలితాలు లేకుండా చూడవచ్చునని, కానీ సిర్రోసిస్‌కు దారితీస్తే లివర్ గట్టిపడి వెనక్కి వచ్చే పరిస్థితి ఉండదని, లివర్ ఫంక్షన్‌లో తేడా వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఆ పరిస్థితుల్లో లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయడం ఒక్కటే మార్గమని అంటున్నారు.

ముందు జాగ్రత్త మేలు

శారీరక శ్రమలేని జీవన విధానానికి ప్రతి ఒక్కరూ అలవాటు పడ్డారు. దానికి తోడు ఫ్యాట్ ఎక్కువగా ఉన్న జంక్‌ఫుడ్స్ తింటున్నారు. దీంతో శరీరంలో కొలస్ట్రాల్ స్థాయిలు విపరీతంగా పెరిగి, లివర్‌పై ప్రభావం చూపుతున్నాయి. వయస్సు 40 ఏళ్లు దాటిన వారు ప్రతి ఏటా లివర్ ఫంక్షన్ టెస్ట్, కొలస్ట్రాల్ లెవల్స్, థైరాయిడ్, షుగర్ పరీక్షలతో పాటు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ కూడా చేయించుకుంటే మంచిది. ఇప్పుడు లివర్ పనితీరును కచ్చితంగా నిర్ధారించేందుకు ఫైబ్రో స్కాన్ అందుబాటులోకి వచ్చింది. ఆయా పరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారించుకుని ముందు జాగ్రత్తలు తీసుకుంటే మేలని వైద్యులు సూచిస్తున్నారు.

లివర్ వ్యాధులకు ప్రధానంగా కారణాలివే...

- శ్రమ లేని జీవన విధానం
- ఆహారపు అలవాట్లు
- పెరుగుతున్న మధుమేహులు
- ఫాస్ట్‌ఫుడ్ ఎక్కువగా తినడం
- ఆల్కహాల్ వ్యసనం

లివర్ సమస్యలు పెరిగాయి



ఇటీవల కాలంలో కాలేయ సమస్యలతో వస్తున్న వారిని ఎక్కువగా చూస్తున్నాం. ఒకప్పుడు ఆల్కహాల్ తాగే వారిలోనే లివర్ సిర్రోసిస్ వ్యాధి సోకేది. కానీ ఇప్పుడు కొలస్ట్రాల్ కారణంగా నాన్ ఆల్కహాలిస్టుల్లో కూడా సిర్రోసిస్ చూస్తున్నాం. ప్రతిరోజూ వ్యాయామంతో పాటు, ఆహార నియమాలు పాటిస్తూ, శరీరంలో కొలస్ట్రాల్ పెరగకుండా చూసుకోవాలి.

– డాక్టర్ బీఎస్‌వీవీ రత్నగిరి, అసోసియేట్ ప్రొఫెసర్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ

క్లుప్తంగా

19న విజయవాడ మారథాన్



లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ రన్నర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 19 విజయవాడ మారథాన్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు మణిదీపక్ తెలిపారు. మారథాన్‌కు సంబంధించిన మెడల్స్, టీ షర్ట్‌లను గురువారం నగరంలోని ఓ హోటల్‌లో శ్రీరామ్ ఫైనాన్స్ జనరల్ మేనేజర్ ఈడ్పుగంటి నాగేంద్ర, ఐరన్ మాన్ ఫినిషర్ డాక్టర్ రుషీల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మణిదీపక్ మాట్లాడుతూ ఈ రన్‌ను ఆదివారం గాంధీనగర్‌లోని జింఖానా గ్రౌండ్స్ నుంచి ప్రారంభించి బీఆర్‌టీఎస్ రోడ్డులో కొనసాగనున్నట్లు తెలిపారు. ఉదయం 5 గంటలకు ప్రారంభించి 5కే, 10కే, 21కే మూడు విభాగాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. పలు రాష్ట్రాల నుంచి 1800 మంది రన్నర్స్ పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ రన్‌లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారికి శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ జింఖానా గ్రౌండ్స్‌లో రిజిస్ట్రేషన్స్ ఉంటాయని తెలిపారు. మరింత సమాచారం కొరకు నిర్వాహకులను 7815955123 లో గాని డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.విజయవాడరన్నర్స్.కామ్ లో గాని సంప్రదించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ రన్నర్స్ కార్యదర్శి బాబి, శ్రీరామ్ చిట్స్ జనరల్ మేనేజర్ యంఎస్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ కాలేజీ అటానమస్ స్టేటస్ పొడిగింపు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మరో పదేళ్లు అటానమస్ స్టేటస్‌ను యూజీసీ పొడిగించింది. 2017లో అటానమస్ స్టేటస్ పొందిన కళాశాల ఇటీవల నిర్వహించిన నాక్‌లో ఏ గ్రేడ్ సాధించింది. ఎంతో మంది ప్రముఖులు విద్యాభ్యాసం చేసిన ఎంతో మంది మేధావులు పనిచేసిన 86 ఏళ్ల చరిత్ర కలిగిన ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు యూజీసీ నాక్ ఏ గ్రేడ్‌తో పాటు పదేళ్లు స్వయంప్రతిపత్తి పొడిగించటం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతరులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రుల సమష్టి కృషితోనే ఈ స్థాయికి చేరుకున్నామని ఆమె అన్నారు. ఇదే స్ఫూర్తితో కళాశాల సిబ్బంది సమన్వయంతో పనిచేసి మరింత మెరుగైన విద్యాబోధన చేయాలని సూచించారు.

నేడు డయల్ యువర్ పోలీస్ కమిషనర్

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణాతో నేరుగా ప్రజలు మాట్లాడేందుకు ప్రతి శుక్రవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో డయల్ యువర్ సీపీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్యలో కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 0866-2490613 నంబర్‌కు ఫోన్ చేసి ప్రజలు తమ సమస్యలను నేరుగా సీపీకి ఫిర్యాదు చేసుకోవచ్చని తెలిపారు.

నేటి నుంచి నగరంలో రైస్ గ్రెయిన్ టెక్ ఎక్స్‌పో

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి విజయవాడ ఏ కన్వెన్షన్ హాలులో రైస్ గ్రెయిన్ టెక్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ ఎస్‌కే బాజీ తెలిపారు. గాంధీనగర్‌లోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు రోజులపాటు ఎక్స్‌పో జరుగుతుందని, ప్రారంభానికి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు హాజరవుతారన్నారు. ఎక్స్‌పోను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నూతన టెక్నాలజీతో ఆహార ధాన్యాల ప్రాసెసింగ్ ఏ విధంగా చేయాలో ప్రదర్శనలో వివరిస్తారన్నారు. గింజలలో పోషక విలువలు పోకుండా నూతన టెక్నాలజీ ఎలా పని చేస్తుందో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు పులిపాటి శ్రీనివాసరావు, కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఓటరు దరఖాస్తులు సత్వర పరిష్కారం

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ఓటర్ల నమోదు కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పి.రాజాబాబు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా గురువారం ఉదయం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఓటర్ల సంక్షిప్త సవరణ కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం, ఓటర్లు, జనాభా నిష్పత్తి, ఎపిక్ కార్డుల జనరేషన్ తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ జిల్లాలో ఫారం-6 దరఖాస్తులు 6,781, ఫారం-7లో 7757, ఫారం-8లో 11,106 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో ఓటర్లు, జనాభా నిష్పత్తిని పరిశీలిస్తే 2011 జనాభా లెక్కల ప్రకారం 615 మంది ఉండగా, 2023 ఓటర్ల జాబితా ప్రకారం 738 మంది ఉందని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల నమోదు కార్యక్రమంపై పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించాలన్నారు. 18 ఏళ్లు నిండిన విద్యార్థినీ, విద్యార్థులు ఓటర్లుగా నమోదయ్యేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

తైక్వాండో పోటీల్లో భువనేశ్వరికి కాంస్యం



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు రాజస్థాన్‌లోని జగదీష్ ప్రసాద్ జబర్మల్ యూనివర్సిటీలో జరిగిన సౌత్-వెస్ట్ ఇంటర్ యూనివర్సిటీ తైక్వాండో (మహిళలు) చాంపియన్ షిప్‌లో తమ యూనివర్సిటీకి చెందిన ఎల్‌టీ భువనేశ్వరి కాంస్య పతకాన్ని పొందిందని డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి తెలిపారు. నగరంలోని యూనివర్సిటీ ఆవరణలో భువనేశ్వరిని గురువారం అభినందించారు. 2024 జనవరిలో రాజస్థాన్‌లో జరుగనున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ తైక్వాండో (మహిళలు) చాంపియన్‌షిప్‌కు కూడా భువనేశ్వరి అర్హత పొందిందని యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి ఇ.త్రిమూర్తి తెలిపారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కె.బాబ్జి, యూనివర్సిటీ సిబ్బంది భువనేశ్వరిని అభినందించారు.

ఐటీఐల ఆధునికీకరణకు రూ.15.50 కోట్లు

గుడివాడటౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలల ఆధునికీకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.15.50 కోట్లు మంజూరు చేసిందని స్థానిక కేబీఆర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జి.హరిధర్మేంద్ర తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్, శిక్షణ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో 15 ప్రభుత్వ ఐటీఐ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో జరిగిన సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారన్నారు. ప్రపంచ బ్యాంకు సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేశారని, తద్వారా అన్ని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలు మెరుగుపడతాయని ఆయన తెలిపారు.

పెదపులిపాకలో కేంద్ర అధికారి పర్యటన

పెనమలూరు: వికసిత్ భారత్ సంకల్ప యాత్రను జిల్లాలో విజయవంతం చేయాలని కేంద్ర ప్రభుత్వ నోడల్ అధికారి ఎం.రామచంద్రుడు అన్నారు. మండలంలోని పెదపులిపాక గ్రామంలో పర్యటించి గ్రామంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర సన్నాహక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రామచంద్రుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు అందేవిధంగా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, డీపీఓ నాగేశ్వర్‌నాయక్, ఎంపీడీఓ సునీతాశర్మ, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, ఈవో పద్మావతిదేవి, పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్య

హనుమాన్‌జంక్షన్ రూరల్: మద్యానికి బానిసగా మారినందుకు తల్లిదండ్రులు మందలించటంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హనుమాన్‌జంక్షన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపులపాడు మండలం కానుమోలుకు చెందిన మరీదు ప్రవీణ్‌కుమార్ (22) వ్యవసాయ కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత కొంతకాలంగా మద్యానికి బానిసైన ప్రవీణ్‌కుమార్ తరచూ మద్యం తాగి ఇంటికి వస్తుండేవాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 13న మద్యం తాగి ఇంటికి వచ్చిన ప్రవీణ్‌కుమార్‌ను కుటుంబ సభ్యులు మందలించడంతో గ్రామ శివారులోని చెరువు వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీన్ని గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు హుటాహుటిన విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి ప్రవీణ్‌కుమార్ మృతి చెందాడు. ఈ ఘటనపై హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ ఏడీఎల్ జనార్దన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

19న ఎంబీవీకేలో చిత్రలేఖన పోటీలు

వాల్ పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు


చిత్రలేఖన పోటీల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థుల్లో దాగున్న చిత్రలేఖన నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, జాషువా సాంస్కృతిక వేదిక చేస్తున్న కృషి అభినందనీయమని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, జాషువా సాంస్కృతిక వేదిక సంయుక్త ఆధ్వర్యంలో స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్ స్కూల్, ఆర్ట్ మేట్, చిత్రం ఆర్ట్ ఇన్‌స్టిట్యూట్ నిర్వహించే చిత్రకళా ప్రపూర్ణ నడిపల్లి సంజీవరావు స్మారక చిత్రలేఖన పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన ఆవిష్కరించారు. సబ్ జూనియర్స్ (1-3 తరగతులు), జూనియర్స్ (4-6 తరగతులు), సీనియర్స్ (7-9 తరగతులు), సూపర్ సీనియర్స్ (ఇంటర్, డిగ్రీ) నాలుగు విభాగాల్లో ఈ నెల 19న మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ సమన్వయకర్త స్ఫూర్తి శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 17వ తేదీలోగా 93479 50085 లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పోటీలలో భాగంగా ఆర్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా. పి.సంపత్‌కుమార్, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ కన్వీనర్ సునీల్ కుమార్ అనుమకొండ, కో కన్వీనర్ గిరిధర్ అరసవల్లి, కార్యక్రమ సమన్వయకర్త స్ఫూర్తి శ్రీనివాస్, చిత్రం ఆర్ట్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ చిత్రం సుధీర్, మహిళా విభాగం కన్వీనర్ సంధ్యారాణి అరసవల్లి, జాషువా సాంస్కృతిక వేదిక ప్రధాన కార్యదర్శి గుండు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనకు కులగణన సర్వే

ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్

చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్రంలో సామాజిక న్యాయం, సమసమాజ స్థాపన నెలకొల్పడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా కులగణన సర్వే చేపట్టిందని ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ అన్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి జరిగే కులగణన కార్యక్రమానికి సంబంధించి గురువారం జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో కులగణనపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. విక్టర్‌ప్రసాద్ మాట్లాడుతూ వెనుకబడిన కులాలకు న్యాయం జరగాలంటే కులగణన అవసరమని, దీని ద్వారా అన్ని కులాలు, వర్గాల వారు అభివృద్ధి ఫలాలు దామాషా పద్ధతిలో పొందడానికి అవకాశం ఉందన్నారు. వలస కూలీలను కూడా గుర్తించి సర్వేలో చేర్చాలని ఆయన సూచించారు. జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ మాట్లాడుతూ గ్రామాలు, మండలాలు, డివిజన్ స్థాయిల్లో ప్రజాప్రతినిధులు, కుల సంఘాల పెద్దలు సూచించిన సలహాలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని కులగణన చేపడతామన్నారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.మారేష్ మాట్లాడుతూ బీసీలలో 139 కులాలకు ఈ కులగణనపై అవగాహన కల్పించాలన్నారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ షేక్ సలార్‌దాదా మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన ఏ కులం వారు ఎంత మంది ఉన్నారో సర్వే ద్వారా తెలుసుకుంటే వారికి అనేక ఉపయోగాలు ఉంటాయన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు బందెల థామస్‌నోబుల్ మాట్లాడుతూ మతం ఆధారంగా కాకుండా కేవలం కులం ఆధారంగానే కులగణన జరగాలన్నారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ తిరుమాని శ్రీనివాసరావు మాట్లాడుతూ వృత్తిని బట్టి కాకుండా వాస్తవ కులాల ఆధారంగా కులగణన సర్వే చేపట్టాలన్నారు. భట్రాజు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూరపాటి కోటమరాజు మాట్లాడుతూ ఉపకులాలను సైతం గుర్తించేలా కులగణన సర్వే జరగాలన్నారు. సమావేశంలో భట్రాజు కార్పొరేషన్ చైర్‌పర్సన్ కె.గీతాంజలిదేవి, మచిలీపట్నం మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ శీలం భారతి, సాంఘిక సంక్షేమశాఖ డీడీ షేక్ షాహెద్‌బాబు, మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవోలు ఎం.వాణి, పి.పద్మావతి, దాసి రాజు, వివిధ కుల సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖరరెడ్డి



గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖరరెడ్డి అన్నారు. విజయవాడలోని హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సర్వీసెస్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లంకా మణికంఠ మాట్లాడుతూ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు పీఆర్‌సీ పునరుద్ధరించాలని కోరారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ జీవోను సత్వరమే అమలు చేయాలని కోరారు. అసోసియేషన్ నాయకులు శ్రీరామ్ రమేష్, మస్తాన్, గిరి, వేణు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతికి కారణమైన నిందితులకు రిమాండ్


నిందితులతో డీఎస్పీ జయసూర్య, సీఐ, ఎస్ఐ

ఉంగుటూరు: ఇటీవల పెద అవుటపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ట్రాక్‌పై అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటనలో ఐదుగురు నిందితులకు జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు గురువారం ఆత్కూరు పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ ఆర్.జి.జయసూర్య వెల్లడించారు. ఈ నెల 3వ తేదీన పెద అవుటపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ఓ యువకుడు మృతి చెందిన విషయం తెలుసుకుని ఏలూరు జీఆర్‌పీ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. మృతుడు ఏలూరు జిల్లా నూజివీడు మండలం రేగుంట గ్రామానికి చెందిన బలుగూరి అజయ్(24)గా గుర్తించారు. కొంతకాలంగా గన్నవరంలో ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నట్లు తెలుసుకున్నారు. అజయ్ శవ పంచనామా సమయంలో మృతుడి తల్లిదండ్రులు, బంధువులు అజయ్ మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. దీంతో తదుపరి విచారణ నిమిత్తం రైల్వే పోలీసులు కేసును ఆత్కూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆత్కూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. గన్నవరం డీఎస్పీ జయసూర్య, జంక్షన్ సీఐ ఎ.నవీన్‌నరసింహమూర్తి, ఎస్ఐ శ్రీనివాస్ నిందితులైన షేక్ ఆల్లఫా, మసిముక్కు నాగరాజు(టీడీపీ నాయకుడు), ఎస్‌కే జబ్బర్, ఎస్‌కే షరీఫ్, మసిముక్కు వెంకటేశ్వరరావులను గన్నవరంలో నాగదుర్గ హోటల్ వద్ద బుధవారం అరెస్ట్ చేశారు. వారిని విచారించగా మృతుడు అజయ్ గన్నవరంలో తన కూతురుతో సాన్నిహిత్యంగా ఉండటం చూసి అతడిని ఆల్లఫా బలవంతంగా తన హోటల్‌కు తీసుకు వెళ్లాడు. అక్కడ తన స్నేహితులైన నాగరాజు, ఎస్‌కే జబ్బార్, ఎస్‌కే షరీఫ్, వెంకటేశ్వరరావులతో కలసి బెల్ట్, కర్రలతో కొట్టారు. దీంతో మనస్తాపానికి గురైన అజయ్ పెద అవుటపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్‌పై రైలు కిందపడి చనిపోయాడు. నిందితులను గన్నవరంలో 11వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో గురువారం హాజరుపరచగా న్యాయమూర్తి సీహెచ్ శ్రీనివాసబాబు నిందితులకు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు.

క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన కాకాని ఆశయ సాధన కమిటీ

పటమట(విజయవాడతూర్పు): కాకాని వెంకటరత్నం విగ్రహాన్ని తిరిగి ప్రతిష్ఠించేందుకు ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నందుకు కౌన్సిల్ సభ్యులకు, వీఎంసీ కమిషనర్‌కు కాకాని ఆశయ సాధన కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ తరుణ్ కాకాని కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఆయన వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో బెంజిసర్కిల్‌లో కాకాని వెంకటరత్నం ఉండేదని దీన్ని జాతీయ రహదారి విస్తరణ, బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్ల నిర్మాణం కారణంగా తొలగించాల్సి వచ్చిందని, మళ్లీ ఈ విగ్రహ పునఃస్థాపనకు చర్యలు తీసుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కాకాని పోరాట ఘట్టాలను సభ్యులు కమిషనర్‌కు వివరించారు.

నేడు పింక్ టాయిలెట్ ప్రారంభం

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ మహిళలకు ప్రత్యేకంగా బెంజిసర్కిల్ వద్ద జాతీయ రహదారి 16 వెంట రూ. 20 లక్షల అంచనాతో నిర్మించిన పింక్ టాయిలెట్‌ను శుక్రవారం ఉదయం 10.30గంటలకు ప్రారంభిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజ, విజయవాడ మహిళా చైర్‌పర్సన్స్, కోఆప్టెడ్ సభ్యులు, కార్పొరేటర్లు పాల్గొంటారని పేర్కొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు వైద్య పరీక్షలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): బాలల సత్వర చికిత్స కేంద్రం ఆధ్వర్యంలో గురువారం బాలల దినోత్సవం పురస్కరించుకుని ప్రత్యేక అవసరాల పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వారికి వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ వంటి పలు కార్యక్రమాలు చేశారు. డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో మానసిక వికాసాన్ని పెంపొందిస్తాయన్నారు. జిల్లా ఎస్‌సీడీ–సీడీ, ఆర్‌బీఎస్‌కే జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ జి.మాధవి, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కె.సౌమ్య, డాక్టర్ దత్త శరణ్, పిల్లల మనస్తత్వ నిపుణులు టి. దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గొల్లపూడి అయ్యప్ప సన్నిధిలో కార్తిక మాసోత్సవాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): గొల్లపూడి శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానం సన్నిధిలో ఈ నెల 17 నుంచి కార్తిక మాసోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ పాలకవర్గ అధ్యక్షుడు గెల్లి మోహనరావు తెలిపారు. నాలుగున్నర దశాబ్దాలుగా కేరళ సంప్రదాయ పద్ధతుల్లో స్వామి వారికి వైదిక కైంకర్యాలు, ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. 2025 నాటికి ఆలయాన్ని నిర్మాణం చేసి 50 ఏళ్ల పూర్తి చేసుకుంటుందన్నారు. 17 నుంచి జనవరి 13వ తేదీ వరకూ మహా దీపార్చన నిర్వహిస్తున్నామన్నారు. డిసెంబర్ 27 వరకూ మండల పూజా మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. జనవరి 14 వరకూ అయ్యప్ప, భవానీ మాలధారులకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

19న వ్యాసరచనల పోటీలు

విజయవాడ కల్చరల్: జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పోలుకొండ మంగతాయారు స్మారక, సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ ఆదివారం సాయంత్రం 5 గంటలకు పాఠశాల, కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు మహిళా సాధికారిత–నాకు నచ్చిన మహిళ అంశంగా వ్యాసరచనల పోటీలను నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు వి.ఉమామహేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంజీ రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో పోటీలు జరుగుతాయని విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందని, వివరాలకు 63001 22018 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 20 మందికి జైలు,జరిమానా

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): మద్యం తాగి వాహనాలు నడిపిన 20 మందికి జైలు, జరిమానా విధిస్తూ ఏడో, ఎనిమిదో అడిషనల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టుల న్యాయమూర్తులు కె.సురేష్, వి.విజయ కుమార్ రెడ్డిలు తీర్పు వెల్లడించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె. రాణా ఆదేశాల మేరకు నగరంలో వివిధ ప్రదేశాలలో మద్యం తాగి వాహనాలు నడిపే చోదకులపై శుక్రవారం 1, 2, 4వ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 20 మందిపై కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. వారిలో ఒక్కొక్కరికీ ఒక్కో రకమైన శిక్ష వేశారు. 12 రోజుల నుంచి గరిష్టంగా నెల రోజుల వరకూ జైలు శిక్షతో పాటు ప్రతి ఒక్కరికీ రూ. 10వేలు జరిమానా విధించారు.

నగరాభివృద్ధికి ప్రత్యేక కృషి

వీఎంసీ స్థాయీసంఘం సమావేశంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి



స్థాయీసంఘం సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడను అంతర్జాతీయ నగరాల మాదిరి అభివృద్ధి చేయటానికి కృషి చేస్తున్నామని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మిఅన్నారు. మేయర్ ఆధ్వర్యంలో గురువారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో స్థాయీ సంఘ సమావేశం జరిగింది. మొత్తం 19 అంశాలు అజెండాలో ప్రతిపాదనలు రాగా అందులో 14 అంశాలను ఆమోదించగా రెండింటిపై వాదిస్తూ తీర్మానం చేశారు. ఒక అంశాన్ని రికార్డు చేయగా మరో అంశాన్ని ధ్రువీకరించారు. సమావేశంలో స్థాయీ సంఘం సభ్యులు, వీఎంసీ విభాగం అధికారులు పాల్గొన్నారు.

ప్రధానాంశాలివి

- సర్కిల్ 2 పరిధిలోని గవర్నమెంట్ ప్రెస్, సీకే రెడ్డి రోడ్డులో రెండు బ్లాక్ స్పాట్‌లను పోలీసు విభాగం గుర్తించారు. వీటి కారణంగా రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నందున వాటిని నిరోధించడానికి నిర్ణయించారు. బ్లాక్‌స్పాట్‌ల వద్ద రోడ్డు సేఫ్టీ జాగ్రత్తలు, డైరెక్షన్ బోర్డులు, హెచ్చరిక బోర్డులు, సోలార్ బ్లింకర్లు, రోడ్డు మార్కింగ్ ఏర్పాటు చేయటానికి రూపొందించిన అంచనాల మేరకు అయ్యే రూ.43.85 లక్షలు నిధులు కార్పొరేషన్ జనరల్ ఫండ్స్ నుంచి విడుదల చేయాలని వచ్చిన ప్రతిపాదనను సభ్యులు ఆమోదించారు.
- సెంట్రల్ నియోజకవర్గంలోని 60వ డివిజన్ డీస్నీ ల్యాండ్ వద్ద ఉన్న ముస్లిం శ్మశాన వాటికలో కాంపౌండ్‌వాల్, గ్రౌండ్ లెవలింగ్, సీసీ రోడ్డు ఏర్పాటుకు రూ. 48.37 లక్షల నిధులను కార్పొరేషన్ జనరల్ బడ్జెట్ నుంచి కేటాయించాలని వచ్చిన ప్రతిపాదనను సభ్యులు ఆమోదం తెలిపారు.
- సర్కిల్ 1 పరిధిలోని 40వ డివిజన్‌లో ఎన్టీఆర్ స్ట్రీట్ నుంచి బాలభాస్కర్ స్ట్రీట్ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి అయ్యే ఖర్చు రూ. 36.91 లక్షలు వీఎంసీ సాధారణ నిధుల నుంచి విడుదల చేయాలని వచ్చిన ప్రతిపాదనను సభ్యులు ఆమోదించారు.
- సర్కిల్ 3 పరిధిలోని 18వ డివిజన్ రాణీగారితోటలో బాలస్వామి వీధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి అయ్యే రూ.25.52 లక్షలు కార్పొరేషన్ జనరల్ ఫండ్స నుంచి చెల్లించాలని వచ్చిన ప్రతిపాదను ఆమోదిస్తూ తీర్మానం చేశారు.

జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న జోనల్ కమిషనర్ కృష్ణ, కార్పొరేటర్ అంబేడ్కర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో సంక్షేమ పథకాలు నిర్విరామంగా కొనసాగాలన్నా, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బుర్రి జగ్జీవన్‌రావు అన్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గం క్లస్టర్ 1లోని 5వ డివిజన్ 15వ సచివాలయంలో గురువారం సంక్షేమ పథకాల పోస్టర్‌ను జోనల్ కమిషనర్ కృష్ణ, కార్పొరేటర్ కలపాల అంబేడ్కర్ ఆవిష్కరించారు. అనంతరం పార్టీ పతాకాన్ని అంబేడ్కర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూ, ప్రభుత్వంపై వారి సంతృప్తి స్థాయిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంబేడ్కర్, బుర్రి జగ్జీవన్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో నవరత్నాల ద్వారా కుల, మత, పార్టీలకతీతంగా ఎవరి ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాలను నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేస్తున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి తేడాను ప్రజలు గమనించాలని కోరారు. గత ప్రభుత్వంలో పథకాలు జన్మభూమి కమిటీ సభ్యుల దయాదాక్షిణ్యాలతో వచ్చేవని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష పేదలకు వరం



రోగులను పరామర్శిస్తున్న కార్పొరేటర్ ప్రవల్లిక

గుణదల (విజయవాడ తూర్పు): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల పాలిట వరంగా మారిందని 3వ డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక అన్నారు. గుణదలలోని దాసరి గిరిధర్ కుమార్ అవంతి వీఎంసీ పాఠశాల ఆవరణలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యంపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. అందని ద్రాక్షగా ఉన్న కార్పొరేట్ వైద్యం ప్రజల ముంగిటకే వచ్చిందని తెలిపారు. నిపుణులైన వైద్యులు ఇంటింటికీ తిరిగి ఆరోగ్య సర్వే నిర్వహించారన్నారు. అనంతరం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి రోగులకు వైద్య పరీక్షలు చేయటంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. అనంతరం రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ కార్తీక్, నాయకులు భీమిశెట్టి నాని, డేవిడ్ రాజు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మానసిక వికాసం



విజేతలతో ప్రిన్సిపాల్ కల్పన తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): పుస్తక పఠనంతో విద్యార్థుల్లో వ్యక్తిత్వ, మానసిక వికాసం పెంపొందుతాయని శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల డైరెక్టర్ టి.విజయలక్ష్మి అన్నారు. ఆ కళాశాలలో నిర్వహిస్తున్న 56వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థినులకు క్విజ్, వ్యక్తృత్వ, పోస్టర్ ప్రజెంటేషన్ వంటి పోటీలు నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ తమ కళాశాలలో ఏటా పుస్తక ప్రదర్శనతో పాటు పలు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థినులను పబ్లిక్ లైబ్రరీలకు తీసుకెళ్లి, వాటిపై అవగాహన కలిగిస్తూ పుస్తక పఠనాసక్తి పెంచుతున్నామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన మాట్లాడుతూ దేశంలో డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్, అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల సర్వోత్తమరావు గ్రంథాలయాలు, గ్రంథాలయ విద్య అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. తమ విద్యార్థులు నగరంలో అతి పురాతనమైన రామ్మోహన గ్రంథాలయాన్ని దర్శించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ గ్రంథాలయ సంఘం జిల్లా ప్రెసిడెంట్ వి.కేశవరావు, విద్యార్థి వికాస కార్యదర్శి శ్రావణి, గ్రంథపాలకులు మల్లిక, లతా ఫణి, సిబ్బంది పాల్గొన్నారు.

చెస్ మాస్టర్ కుమారస్వామికి.. సీపీ అభినందన

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): వరల్డ్ చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫిడే ఆరేనా ఇంటర్నేషనల్ మాస్టర్ టైటిల్‌ను గెలుచుకున్న పొలూరి కుమారస్వామి గురువారం పోలీస్ కమిషనర్ టీకే రాణాను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. 2020లో జరిగిన జిల్లా టీం చెస్ ఛాంపియన్‌షిప్‌లో ప్రథమ, ఏపీ స్టేట్ టీం చెస్ చాంపియన్‌షిప్‌లో ద్వితీయ బహుమతిని పొంది నేషనల్ చాంపియన్ షిప్‌లో పాల్గొనడంపై కుమారస్వామిని అభినందించారు. 2021–2022లో తన వద్ద కోచింగ్ తీసుకున్న విద్యార్థులు అండర్–7 నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ గెలుచుకున్నట్లు తెలుసుకుని ఆయన్ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డీసీపీ విశాల్ గున్ని కూడా కుమారస్వామిని అభినందించారు.

కల్చరల్ పోటీల్లో శరత్‌చంద్ర విద్యార్థుల ప్రతిభ



ఓవరాల్ చాంప్ అవార్డు అందుకుంటున్న శరత్‌చంద్ర అకాడమీ విద్యార్థులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని నలంద డిగ్రీ కళాశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కల్చరల్ పోటీల్లో శరత్‌చంద్ర ఐఏఎస్ అకాడమీలో డిగ్రీతో పాటు ఐఏఎస్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చాటారు. ఆ పోటీల్లో డిబేట్, క్విజ్, ఎడ్యుకేషన్ స్కిట్ వంటి విభాగాల్లో విజేతలుగా నిలిచి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను గెలుచుకున్నారు. విజేతలను గురువారం అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ తోట శరత్‌చంద్ర అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొంటే లీడర్‌షిప్, కమ్యూనికేషన్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్ పెరుగుతాయన్నారు. ఇలాంటి నైపుణ్యాలు ఐఏఎస్, ఐపీఎస్ కావాలనుకునే వారికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. అకాడమీ అకడమిక్ ఇన్‌చార్జి కల్యాణ్ దత్త మాట్లాడుతూ కరెంట్ అఫైర్స్‌పై పట్టు ఈ విజయానికి కారణమని చెప్పారు. ఈ సంవత్సరం ఐఏఎస్ మెయిన్స్ పరీక్షలో తమ విద్యార్థులు ప్రతిభ కనపరిచారని, ఇంటర్వ్యూ కాల్ కోసం వేచి ఉన్నట్లు తెలిపారు.

వెయ్యిమందికి అన్నదానం



సాయిబాబా ఆలయం వద్ద అన్నదానం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎంజీ రోడ్డులోని కళానికేతన్ పక్కరోడ్డులోని సాయిబాబా మందిరం వద్ద గురువారం అన్నదానం చేశారు. మొగల్రాజపురానికి చెందిన సాయిబాబా భక్తుడు పాల భాగ్యరాజ్ ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మందికి అన్నదానం చేశారు. ఏడాది నుంచి ప్రతి గురువారం సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

కోదండ రామాలయం వద్ద..

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంకలోని కోదండ రామాలయంలో గురువారం అయ్యప్పలకు అన్నసమారాధన జరిగింది. శరత్ గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అయ్యప్పలు, శివస్వాములు, గోవింద స్వాములు తొలుత అయ్యప్పకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూల అలంకరణలు, దీపారాధనలు, హారతులు స్వామి వారికి సమర్పించారు. అనంతరం అయ్యప్పలకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

ముస్లిం సమస్యల పరిష్కారమే లక్ష్యం

పాయకాపురం(విజయవాడరూరల్): సెంట్రల్ నియోజకవర్గంలోని ముస్లిం, మైనార్టీల సమస్యలను తెలుసుకునేందుకు ఆజాద్ ముస్లిం కమిటీ సభ్యులు ఘర్ ఘర్‌కు ఆజాద్ (గడప గడపకు ఆజాద్) పేరుతో వెళ్లనున్నట్లు ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా ఓ ప్రకటనలో తెలిపారు. నెలలో నాలుగు ఆదివారాలు ఒక్కో ఆదివారం 30 ముస్లిం కుటుంబాలను కలిసి వారి సమస్యలను తెలుసుకుంటామన్నారు. అలాగే ప్రతి శుక్రవారం మసీదు పెద్దలను కలుస్తామన్నారు. ఈ నెల 19వ తేదీన ఆదివారం 61వ డివిజన్లో ముఖ్యనాయకులతో కలిసి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బాలసాహిత్యంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న వల్లూరి శివప్రసాద్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రచయితలు బాల సాహిత్యంపై దృష్టి సారించాలని సాహితీవేత్త, నాటకకర్త వల్లూరి శివప్రసాద్ అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యాన జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం 'నేటి బాలల కోసం సాహిత్యం' అంశంపై సదస్సును బుక్ ఫెస్టివల్ లైబ్రరీ హాల్లో నిర్వహించారు. శివప్రసాద్ మాట్లాడుతూ బాలల కోసం ప్రత్యేకంగా సాహితీ సృజన జరగాల్సిన అవసరం చాలా ఉందన్నారు. వేటూరి ప్రభాకరశాస్త్రి, చింతా దీక్షితులు, నేదునూరి గంగాధరరావు వంటి ప్రముఖులు బాల సాహిత్యం కోసం చేసిన కృషిని కొనియాడారు. బాలల కోసం సైన్స్ రచనలు చేసిన డాక్టర్ పరుచూరి రాజారామ్, ఆచార్య మైనేని కేశవ దుర్గాప్రసాద్ వంటి వారి సాహితీ సృజనను వివరించారు. బాల సాహితీవేత్త భమిడిపాటి బాలాత్రిపురసుందరీదేవి మాట్లాడుతూ బాలల సందేహాలకు సమాధానాలు ఇవ్వగలిగే సాహిత్యం రావాలన్నారు.
సభకు డాక్టర్ జీవీ పూర్ణచంద్ అధ్యక్షత వహించారు. సొసైటీ గౌరవాధ్యక్షుడు బాబ్జీ, పబ్లిషర్ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీటీపీఎస్‌లో భద్రతపై శిక్షణ



ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లోని ఏపీ జెన్‌కో శిక్షణ కేంద్రంలో సురక్షితమైన భద్రతపై శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఏపీ డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చంద్రశేఖర్ వర్మ శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రత పరమైన నియమాలు పాటించకపోవడం వలన అనేక ప్రమాదాలు మానవ తప్పిదంతో జరుగుతున్నాయని చెప్పారు. ఫ్యాక్టరీల్లో ప్రమాదాలు జీరో స్థాయిలో ఉండేలా భద్రత ప్రమాణాలు పాటించాలని సూచించారు. పని ప్రదేశాల్లో సైతం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ఫ్యాక్టరీలకు చెందిన 175 మంది శిక్షణకు హాజరయ్యారు. డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీనివాసరావు, సీఈ నవీన్‌గౌతమ్, ఎన్టీటీపీఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై కమిషనర్ సమీక్ష



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న కమిషనర్ స్వప్నిల్‌దినకర్‌పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, సెంట్రల్ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం పొలిటికల్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. తమ చాంబర్లో నిర్వహించిన ఈ సమాచారం ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ల జాబితాల విషయంలో తమ అభ్యర్థనలు కమిషనర్‌కు విన్నవించారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా జరగాలని, ఎలాంటి తప్పులు లేకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని తెలిపారు.
విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో అన్ని కేంద్రాల ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీ ప్రతినిధులు బి. ఉమామహేశ్వరరావు (టీడీపీ), సాంబశివరావు(టీడీపీ), వై. సుందర్ పాల్ (వైఎస్సార్ సీపీ), రామకృష్ణ (బీజేపీ), సిటీ ప్లానర్ జీవీ జీఎస్ంఆ ప్రసాద్, తహసీల్దార్లు వెన్నెల శ్రీను, ఎం. మాధురి, ఎస్ఈ (ప్రాజెక్ట్స్) కె. రామ్మోహనరావు, ఏసీపీ–2 ఎం. జగదీష్ పాల్గొన్నారు.

ఆరోగ్యకర సమాజానికి సేంద్రియ వ్యవసాయం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సేంద్రియ వ్యవసాయంతో ఆరోగ్యకరమైన సమాజాన్ని సాధించవచ్చని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ కార్యదర్శి కోనేరు శివకాంచనలత అన్నారు. కేబీఎన్ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ బోటనీ, ఎకో క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన సేంద్రియ వ్యవసాయం క్షేత్రాన్ని ఆమె గురువారం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సేంద్రియ వ్యవసాయ, మిద్దె తోటల అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జీవాధారిత వ్యవసాయంగా సేంద్రియ వ్యవసాయాన్ని వర్ణించవచ్చన్నారు. ప్రధానంగా ప్రాంతీయంగా లభించే వనరులతో వ్యవసాయం చేయడానికి అధిక ప్రాధాన్యమిస్తూ, హానికర రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించే విధంగా సేద్యాన్ని చేయాలన్నారు. ఇది పెట్టుబడి లేని వ్యవసాయమన్నారు. దేశంలో క్రీస్తు పూర్వం నుంచి బ్రిటీష పాలన వరకూ సేంద్రియ వ్యవసాయన్నే రైతులు నమ్ముకున్నారని గుర్తు చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో హరిత విప్లవం మాటున విదేశీ కంపెనీలు తమ కృత్రిమ ఎరువులు దేశంలో విక్రయించారన్నారు. అత్యధిక దిగుబడులు వస్తాయనే భ్రమతో రైతులు రసాయన వ్యవసాయాన్ని ఎంచుకున్నారన్నారు. ఇప్పటికైనా రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లడం శుభపరిణామమన్నారు. కళాశాల కార్యదర్శి తూనుకుంట్ల శ్రీనివాస్ కళాశాలలోని కొంత స్థలాన్ని సేంద్రియ వ్యవసాయం చేయడానికి కేటాయించామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ గృహిణులు మిద్దె తోటలపై అవగాహన పెంచుకోవడంతో కుటుంబ ఖర్చులు తగ్గడంతో పాటు కుటుంబ సభ్యుల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందన్నారు. వన్ ఎర్త్ వన్ లైఫ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ది. లీలాకుమారి, శ్యాంప్రసాద్, సురేష్, విజయ్, రవి తదితరులు పాల్గొన్నారు.

వాగ్గేయకార సంకీర్తనలు.. తెలుగు భాషా వీచికలు

విజయవాడ కల్చరల్: వాగ్గేయకార సంకీర్తనలు తెలుగు భాషా వీచికలని సంగీత విద్వాంసుడు డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గాంధీ నగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం వాగ్గేయకారుల తెలుగు భాషా సేవ అంశంగా సదస్సును నిర్వహించారు. భూసపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అన్నమయ్య సంకీర్తల్లో భక్తి భావంతో కూడిన సామాజిక అంశాల ప్రస్తావన కనిపిస్తుందన్నారు. డాక్టర్ కావూరి సత్యవతి, ఆకాశవాణి విశ్రాంత ప్రోగ్రామ్ ఆఫీసర్ కేబీ ఆనంద్, గడ్డం సత్యనారాయణ, నీలం దుర్గారావు పాల్గొన్నారు.

వన సమారాధనను జయప్రదం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బలరామకృష్ణమూర్తి, కార్పొరేటర్ శర్వాణిమూర్తి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆధ్వర్యంలో డిసెంబర్ 3న జరిగే కార్తిక వన సమారాధన కార్యక్రమంలో బ్రాహ్మణ కుటుంబాలు పాల్గొని జయప్రదం చేయాలని బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కొప్పవరపు వెంకట బలరామకృష్ణ మూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం సత్యనారాయణపురంలోని గాయత్రి కన్వెన్షన్ హాల్లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా విజయవాడ రూరల్, కొత్తూరు తాడేపల్లిలోని బెనెడిక్ట్ స్కూల్ పక్కన ఉన్న మామిడి తోటలో వన సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు ఆట, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉచితంగా నిర్వహించే ఈ వన సమారాధనలో ఉచిత రవాణ సౌకర్యం కూడా అందిస్తున్నామని, ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు. 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి, గాయత్రి కన్వెన్షన్ కోశాధికారి కె.కె సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆటోకు నిప్పు



కృష్ణలంక(విజయవాడతూర్పు): రోడ్డు వెంట పార్కింగ్ చేసిన ఆటోకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో ఆటో అగ్నికి ఆహుతైన చేసిన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాణిగారితోటకు చెందిన ఎం.బ్రహ్మం తన ఆటోలో కృష్ణలంకలోని హైస్కూల్ రోడ్డులో ఉన్న ఒక వాటర్ ప్లాంట్ నుంచి మినరల్ వాటర్ క్యాన్లను తీసుకెళ్తుంటాడు. కొన్ని రోజుల క్రితం ఆటో మరమ్మతులకు గురవడంతో రెహమాన్ వీధిలో వాటర్ ప్లాంట్ గోడ వెంట పార్కింగ్ చేసి ఉంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి 12 గంటల సమయంలో ఆటోకు మంటలు చెలరేగాయి. ఆటో కాలిపోవడాన్ని చూసిన స్థానికులు మంటలపై నీళ్లు చల్లి అదుపు చేశారు. అప్పటికే ఆటో వెనుక భాగం కాలిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాల సేకరించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆకతాయిలు ఎవరైనా ఆటోకు నిప్పంటించారా, మరే ఇతర కారణాలతో కాలిపోయిందా అనే కోణంలో దర్యాప్తుజరుగుతోంది.

నేడు పేరంటాలమ్మ కానుకల లెక్కింపు

రామవరప్పాడు : విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయ హుండీల్లోని కానుకలను శుక్రవారం దేవదాయశాఖాధికారుల పర్యవేక్షణలో లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి తెలిపారు. భక్తులు అమ్మవార్లకు కానుకల రూపంలో 56 రోజులకు గానూ హుండీల్లో సమర్పించిన ఆదాయాన్ని లెక్కిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి, సేవాదళ్ సభ్యులు, సిబ్బంది పాల్గొంటారని వెల్లడించారు.

నాగులచవితికి ఏర్పాట్లు

ఆలయ ప్రాంగణంలోని శ్రీగంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నాగుల చవితిని పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ బోయిన భానుప్రదీప్ తెలిపారు. సుబ్రహ్మణ్యస్వామికి భక్తులు స్వయంగా పాలు పోసే సౌకర్యం కల్పించినట్లు వివరించారు.

సచివాలయ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించండి

పటమట(విజయవాడతూర్పు): ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డెమొక్రటిక్ ఏపీ గ్రామవార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పీజీఎస్‌డబ్ల్యూఎస్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్‌కు వినతిపత్రం అందించారు. ఆటోనగర్‌లోని రాష్ట్ర కార్యాలయంలో గురువారం కలిసిన కమిటీ సభ్యులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పదోన్నతులు, సంక్షేమ సహాయకులు, ఇంజినీర్ సహాయకులకు పదోన్నతులు ఇవ్వాలని, 17 శాఖల పదోన్నతులపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిటీ సభ్యులు ఆయనకు విన్నవించారు. సంఘం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జోసెఫ్ మాట్లాడుతూ తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అజయ్‌జైన్ హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి జి. రాజ్యలక్ష్మి, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కిషోర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సక్రు నాయక్, మంగళపూడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

8 వన్డే ప్రపంచకప్‌లో ఫైనల్ చేరడం ఆస్ట్రేలియా జట్టుకిది ఎనిమిదో సారి. గతంలో ఆ జట్టు 1975 (రన్నరప్), 1987 (విజేత), 1996 (రన్నరప్), 2003 (విజేత), 1999 (విజేత), 2007 (విజేత), 2015 (విజేత)లలో ఏడుసార్లు టైటిల్ పోరుకు అర్హత సాధించింది. ఐదుసార్లు చాంపియన్‌గా నిలిచి, రెండుసార్లు రన్నరప్‌తో సంతృప్తి పడింది.

5 వన్డే ప్రపంచకప్ చరిత్రలో ఐదో సెమీఫైనల్ ఆడిన దక్షిణాఫ్రికా ఐదుసార్లు ఈ అడ్డంకిని దాటలేకపోయింది. 1992లో ఇంగ్లండ్ చేతిలో ఓడిపోగా... 1999లో ఆస్ట్రేలియాతో సెమీఫైనల్ మ్యాచ్‌ను దక్షిణాఫ్రికా 'టై' చేసుకుంది. అయితే 'సూపర్ సిక్స్' దశలో ఎక్కువ పాయింట్లు సాధించినందుకు ఆస్ట్రేలియా ఫైనల్ చేరింది. దక్షిణాఫ్రికాకు నిరాశ ఎదురైంది. 2007లో ఆస్ట్రేలియా చేతిలోనే సెమీఫైనల్లో ఓడిన దక్షిణాఫ్రికా... 2015లో న్యూజిలాండ్ జట్టు చేతిలో పరాజయం పాలైంది. తాజాగా ఆస్ట్రేలియా చేతిలో మరోసారి ఓడిపోయింది.

1 భారత గడ్డపై వన్డేల్లో దక్షిణాఫ్రికాను ఓడించడం ఆస్ట్రేలియాకిదే తొలిసారి కావడం విశేషం. 1996లో భారత్ వేదికగా జరిగిన టైటాన్ కప్‌లో దక్షిణాఫ్రికా చేతిలో మూడుసార్లు ఓడిన ఆస్ట్రేలియా.. తాజా ప్రపంచకప్‌లో లీగ్ దశలో ఓటమి పాలైంది. అయితే కీలకమైన సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాను ఆస్ట్రేలియా ఓడించింది.

2 వన్డే ప్రపంచకప్ చరిత్రలో అవే జట్ల మధ్య ఫైనల్స్ జరగనుండటం ఇది రెండోసారి. 1996, 2007 ప్రపంచకప్ టోర్నీల్లో ఆస్ట్రేలియా–శ్రీలంక జట్ల మధ్య తుది పోరు జరగ్గా... ఆస్ట్రేలియా–భారత్ జట్ల మధ్య 2003లో తొలిసారి టైటిల్ పోరు జరిగింది. 20 ఏళ్ల తర్వాత మళ్లీ ఈ రెండు జట్లు టైటిల్ కోసం అమీతుమీ తేల్చుకోనున్నాయి.



సారీ సఫారీ... ఆసీస్ ఎనిమిదోసారి

ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియా • ఉత్కంఠభరిత సెమీఫైనల్లో విజయం
3 వికెట్లతో ఓడిన దక్షిణాఫ్రికా • డేవిడ్ మిల్లర్ శతకం వృథా
కమిన్స్ బృందం సమష్టి ప్రదర్శన • ఆదివారం ఫైనల్లో భారత్‌తో అమీతుమీ


క్లాసెన్ వికెట్ తీశాక హెడ్‌కు సహచరుల అభినందన

ఎన్ని మలుపులు... ఎంత ఒత్తిడి... గడియారపు లోలకంలా చేతులు మారుతూ వచ్చిన ఆధిపత్యం... కుప్పకూలిపోతున్న దశ నుంచి కోలుకున్న జట్టు... అయినా సరే తక్కువ స్కోరుతో కట్టడి చేశామనే సంబరం... మెరుపు ఆరంభంతో సునాయాసం అనుకున్న విజయం... కానీ ఆపై ప్రతీ బంతి ప్రమాదకరంగా మారి వికెట్ కాపాడుకుంటే చాలనే స్థితి... టెస్టు మ్యాచ్ తరహా సీమ్ బౌలింగ్... టెస్టుల్లాగే ఫీల్డింగ్ ఏర్పాట్లు... ఒక వన్డే మ్యాచ్‌లో ఇవన్నీ కనిపించాయి... పేరుకే తక్కువ స్కోర్ల మ్యాచే కానీ తొలి బంతి నుంచి ఆఖరి బంతి వరకు ఎన్నో ఉత్కంఠభరిత క్షణాలు... అదీ ప్రపంచకప్ సెమీఫైనల్ మ్యాచ్ అంటే ఆ లెక్కే వేరు... అది కూడా ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య మ్యాచ్ అంటే అనూహ్యానికి లోటుండదు... తొలి ఇన్నింగ్స్ స్కోరుతో 1999 ప్రపంచకప్ సెమీస్‌ను గుర్తుకు తెచ్చిన పోరు చివరకు ఆసీస్ పరమైంది... ప్రమాదాన్ని తప్పించుకొని ఎట్టకేలకు గట్టెక్కిన ఆస్ట్రేలియా ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగే తుది పోరులో భారత్‌తో 'ఢీ'కి సిద్ధమైంది.

దక్షిణాఫ్రికా ముందుగా బ్యాటింగ్... 11.5 ఓవర్లలోనే స్కోరు 24/4... ఇక ఆట ముగిసినట్లే అనిపించింది... కానీ ఆసీస్ పట్టు విడిచింది. మిల్లర్ అద్భుత సెంచరీతో స్కోరు 212 వరకు చేరింది... ఎలా చూసినా సునాయాస లక్ష్యమే... ఆసీస్ అంచనాలకు తగినట్లుగా 6 ఓవర్లలో 60/0... ఇలాంటి తరుణంలో సఫారీ బౌలర్ల జోరు మొదలైంది. వరుసగా వికెట్లు కోల్పోవడంతో పాటు ఒక్క సింగిల్ తీయడానికి కూడా ఆసీస్ బ్యాటర్లు బెదిరే స్థితి వచ్చింది... స్పిన్‌తో కేశవ్ మహరాజ్, షమ్సీ భయపెట్టించేశారు. అనూహ్యంగా స్పందిస్తున్న పిచ్‌పై పరుగులు చేయలేక కంగారూలపై ఒత్తిడి పెరిగిపోయింది. చివరకు స్మిత్ కూడా కీలక స్థితిలో చెత్త షాట్‌తో పరిస్థితిని దిగజార్చాడు. అయితే లక్ష్యం మరీ చిన్నది కావడంతో చివరి వరుస బ్యాటర్లు సాహసాలు చేయలేదు. ఆఖరికి మరో 16 బంతులు మిగిలి ఉండగా మాజీ చాంపియన్ విజయ తీరం చేరింది. చివరి వరకూ పోరాడినా... కీలకదశలో క్యాచ్‌లు వదిలేసి... మరోసారి దురదృష్టాన్ని భుజాన వేసుకొని తిరిగిన దక్షిణాఫ్రికా సెమీస్‌కే పరిమితమై నిరాశగా నిష్క్రమించింది.

కోల్‌కతా: ఐదుసార్లు వరల్డ్‌కప్ విజేత ఆస్ట్రేలియా మరో టైటిల్ వేటలో ఫైనల్‌కు చేరింది. ఆదివారం భారత్‌తో తుది సమరంలో తలపడేందుకు సిద్ధమైంది. గురువారం ఈడెన్ గార్డెన్స్ మైదానంలో చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన రెండో సెమీఫైనల్లో ఆస్ట్రేలియా 3 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాపై విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 49.4 ఓవర్లలో 212 పరుగులకే ఆలౌటైంది. డేవిడ్ మిల్లర్ (116 బంతుల్లో 101; 8 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఒంటరి పోరాటంతో శతకం సాధించగా... హెన్రీ క్లాసెన్ (48 బంతుల్లో 47; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. స్టార్క్, కమిన్స్ చెరో 3 వికెట్లు...హాజల్‌వుడ్, ట్రవిస్ హెడ్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం ఆస్ట్రేలియా 47.2 ఓవర్లలో 7 వికెట్లకు 215 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ట్రవిస్ హెడ్ (48 బంతుల్లో 62; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడైన ఆటతో ఆసీస్ విజయానికి పునాది వేయగా... స్టీవ్ స్మిత్ (62 బంతుల్లో 30; 2 ఫోర్లు), డేవిడ్ వార్నర్ (18 బంతుల్లో 29; 1 ఫోర్, 4 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగే ఫైనల్లో భారత్‌తో ఆస్ట్రేలియా తలపడుతుంది.

మిల్లర్ మినహా...

ఈడెన్ గార్డెన్స్‌లోనే భారత్‌తో మ్యాచ్‌లో లక్ష్యాన్ని ఛేదిస్తూ కుప్పకూలిన అనుభవంతో కావచ్చు దక్షిణాఫ్రికా బ్యాటింగ్‌కు మొగ్గు చూపింది. అయితే మబ్బులు పట్టిన వాతావరణంలో ఈ నిర్ణయం కలిసి రాలేదు. పరిస్థితిని అనుకూలంగా మార్చుకొని ఆసీస్ బౌలర్లు చెలరేగిపోవడంతో సఫారీ జట్టు 12 ఓవర్ల లోపే 4 వికెట్లు కోల్పోయింది. బవుమా (0), డి కాక్ (3), మార్క్‌రమ్ (10), డసెన్ (6) విఫలమయ్యారు. ఈ స్థితిలో జట్టు కుప్పకూలుతుందేమో అనిపించినా... క్లాసెన్, మిల్లర్ కలిసి ఆదుకున్నారు. కొద్దిసేపు మ్యాచ్‌కు వాన అంతరాయం కలిగించినా... ఆట కొనసాగిన తర్వాత వీరిద్దరు చక్కటి షాట్లతో పరుగులు రాబట్టారు. ఈ క్రమంలో 70 బంతుల్లో మిల్లర్ హాఫ్ సెంచరీ పూర్తయింది. ఐదో వికెట్‌కు 95 పరుగుల భాగస్వామ్యం తర్వాత పార్ట్‌టైమ్ బౌలర్ ట్రవిస్ హెడ్ సఫారీలను దెబ్బ కొట్టాడు. వరుస బంతుల్లో క్లాసెన్, జాన్సెన్ (0)లను పెవిలియన్ పంపడంతో జట్టు వెనకడుగు వేసింది. ఆ తర్వాత మిల్లర్ ఒక్కడే బాధ్యతను తీసుకున్నాడు. జంపా బౌలింగ్‌లోనే అతను నాలుగు సిక్సర్లు బాదటం విశేషం. మిల్లర్‌కు కొయెట్జీ (19) కొద్దిసేపు సహకరించాడు. కమిన్స్ వేసిన 48వ ఓవర్ తొలి బంతిని భారీ సిక్సర్‌గా మలచిన మిల్లర్ 115 బంతుల్లో శతకం సాధించగా, ఇదే షాట్‌తో జట్టు స్కోరు 200 పరుగులు దాటింది.


నిరాశలో దక్షిణాఫ్రికా ఆటగాళ్లు

కలిసొచ్చిన శుభారంభం...

స్వల్ప లక్ష్యమే అయినా ఆస్ట్రేలియా దూకుడుగా ఇన్నింగ్స్ ఆరంభించింది. అదే చివరకు ఆ జట్టు విజయానికి పునాది వేసింది. హెడ్, వార్నర్ పోటీ పడి పరుగులు సాధించడంతో 6 ఓవర్లలోనే స్కోరు 60 పరుగులకు చేసింది. రబడ బౌలింగ్‌లోనే వార్నర్ 3 సిక్స్‌లు బాదాడు. అయితే వరుస ఓవర్లలో వార్నర్, మార్ష్ (0)లను అవుట్ చేసి సఫారీ కాస్త పైచేయి ప్రదర్శించింది. కొయెట్జీ ఓవర్లో వరుసగా 3 ఫోర్లు బాది హెడ్ 40 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. హెడ్ క్రీజ్‌లో ఉన్నంతసేపు ఆసీస్ ధీమాగానే ఉంది. అయితే దక్షిణాఫ్రికా ఇద్దరు స్పిన్నర్లు షమ్సీ, మహరాజ్‌లతో బౌలింగ్ మొదలు పెట్టిన తర్వాత కంగారూల్లో తడబాటు మొదలైంది. ఈడెన్ పిచ్‌పై అనూహ్యంగా టర్న్ అవుతున్న బంతి బ్యాటర్లను బాగా ఇబ్బంది పెట్టింది. ఆసీస్ ఒక్కో పరుగు తీయడానికి తీవ్రంగా శ్రమించింది. తన తొలి బంతికే హెడ్‌ను మహరాజ్ బౌల్డ్ చేయగా... షమ్సీ బౌలింగ్‌లో లబుషేన్ (18), మ్యాక్స్‌వెల్ (1) అనవసరంగా చెత్త షాట్‌లు ఆడి వికెట్లు సమర్పించుకున్నారు. దాంతో సఫారీలు పూర్తిగా ఆధిపత్యం ప్రదర్శిస్తూ ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టారు. ఇన్‌గ్లిస్ (49 బంతుల్లో 28; 3 ఫోర్లు)తో కలిసి ఆరో వికెట్‌కు 37 పరుగులు జోడించి స్మిత్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. అయితే కొయెట్జీ అద్భుత బౌలింగ్‌తో తక్కువ వ్యవధిలో వీరిద్దరిని పెవిలియన్ పంపడంతో పరిస్థితి మళ్లీ మారింది. అయితే స్టార్క్ (16 నాటౌట్), కమిన్స్ (14 నాటౌట్) జాగ్రత్తగా ఆడుతూ అభేద్యంగా 22 పరుగులు జోడించి జట్టును గెలిపించారు.


మిల్లర్ సెంచరీ అభివాదం

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (సి) కమిన్స్ (బి) హాజల్‌వుడ్ 3; బవుమా (సి) ఇన్‌గ్లిస్ (బి) స్టార్క్ 0; డసెన్ (సి) స్మిత్ (బి) హాజల్‌వుడ్ 6; మార్క్‌రమ్ (సి) వార్నర్ (బి) స్టార్క్ 10; క్లాసెన్ (బి) హెడ్ 47; మిల్లర్ (సి) హెడ్ (బి) కమిన్స్ 101; జాన్సెన్ (ఎల్బీ) (బి) హెడ్ 0; కొయెట్జీ (సి) ఇన్‌గ్లిస్ (బి) కమిన్స్ 19; కేశవ్ మహరాజ్ (సి) స్మిత్ (బి) స్టార్క్ 4; రబడ (సి) మ్యాక్స్‌వెల్ (బి) కమిన్స్ 10; షమ్సీ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (49.4 ఓవర్లలో ఆలౌట్) 212. వికెట్ల పతనం:** 1-1, 2-8, 3-22, 4-24, 5-119, 6-119, 7-172, 8-191, 9-203, 10-212. **బౌలింగ్:** స్టార్క్ 10-1-34-3, హాజల్‌వుడ్ 8-3-12-2, కమిన్స్ 9.4-0-51-3, జంపా 7-0-55-0, మ్యాక్స్‌వెల్ 10-0-35-0, హెడ్ 5-0-21-2.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: హెడ్ (బి) మహరాజ్ 62; వార్నర్ (బి) మార్క్‌రమ్ 29; మార్ష్ (సి) డసెన్ (బి) రబడ 0; స్మిత్ (సి) డికాక్ (బి) కొయెట్జీ 30; లబుషేన్ (ఎల్బీ) (బి) షమ్సీ 18; మ్యాక్స్‌వెల్ (బి) షమ్సీ 1; ఇన్‌గ్లిస్ (బి) కొయెట్జీ 28; స్టార్క్ (నాటౌట్) 16; కమిన్స్ (నాటౌట్) 14; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం (47.2 ఓవర్లలో 7 వికెట్లకు) 215. వికెట్ల పతనం:** 1-60, 2-61, 3-106, 4-133, 5-137, 6-174, 7-193. **బౌలింగ్:** జాన్సెన్ 4.2-0-35-0, రబడ 6-0-41-1, మార్క్‌రమ్ 8-1-23-1, కొయెట్జీ 9-0-47-2, షమ్సీ 10-0-42-2, మహరాజ్ 10-0-24-1.



అంతిమ సమరం కోసం...

అహ్మదాబాద్: వన్డే ప్రపంచకప్ ఫైనల్లో పోటీపడేందుకు భారత క్రికెట్ జట్టు గురువారం అహ్మదాబాద్ నగరానికి చేరుకుంది. విమానాశ్రయంలో భారత జట్టుకు ఘనస్వాగతం లభించింది. నరేంద్ర మోదీ స్టేడియంలో ఆదివారం జరిగే టైటిల్ పోరులో ఐదుసార్లు విశ్వవిజేత ఆస్ట్రేలియా జట్టుతో భారత్ తలపడుతుంది.

ఫైనల్ వేదికపై ఎయిర్ షో

ఫైనల్ మ్యాచ్ సందర్భంగా ఎయిర్ షో నిర్వహించేందుకు భారత వైమానిక దళం (ఐఏఎఫ్) సిద్ధమైంది. ప్రధాని నరేంద్ర మోదీ సహా అతిరథ మహారథులు, లక్ష మంది ప్రేక్షకులు విచ్చేసే మ్యాచ్ వేదికపై ఐఏఎఫ్‌కు చెందిన 'ది సూర్యకిరణ్ ఏరోబాటిక్ టీమ్' ఎయిర్ షోతో మ్యాచ్‌కు ముందే కనువిందు చేయనుంది. దీనికి సంబంధించిన రిహార్సల్స్‌ను నేడు, రేపు స్టేడియంపై చేస్తారని గుజరాత్‌కు చెందిన డిఫెన్స్ ప్రొ ఒక ప్రకటనలో తెలిపింది. ఇలాంటి వైమానిక విన్యాసాలతో అలరించడం సూర్యకిరణ్ టీమ్‌కు కొత్తేం కాదు. దేశవ్యాప్తంగా ఎయిర్ షోలు ఈ జట్టే చేస్తుంది. మొత్తం తొమ్మిది ఎయిర్‌క్రాఫ్ట్‌లు నింగిలో తమ వైమానిక విన్యాసంతో ప్రేక్షకుల్ని ఆకట్టిపడేస్తాయి. మ్యాచ్ ప్రారంభానికి ముందుగా పది నిమిషాల పాటు ఈ ప్రదర్శన నిర్వహిస్తారు.



పోరాడి ఓడిన ప్రణయ్



కుమమోటో: జపాన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్ హెచ్ఎస్ ప్రణయ్ ఓటమి చవి చూశాడు. ప్రపంచ 12వ ర్యాంకర్ చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ)తో జరిగిన మ్యాచ్‌లో ప్రణయ్ 21-19, 16-21, 19-21తో పరాజయం పాలయ్యాడు. 73 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ప్రణయ్ తొలి గేమ్‌ను గెలిచినా ఆ తర్వాత తడబడి వరుసగా రెండు గేమ్‌లను కోల్పోయాడు. నిర్ణాయక మూడో గేమ్‌లో ఒకదశలో ప్రణయ్ 4-12తో వెనుకబడ్డాడు. కానీ పట్టువదలకుండా పోరాడిన ప్రణయ్ చివరకు స్కోరును 19-19తో సమం చేశాడు. అయితే చౌ తియెన్ చెన్ కీలకదశలో రెండు పాయింట్లు గెలిచి గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిన ప్రణయ్‌కు 1,470 డాలర్ల (రూ. లక్షా 22 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 3600 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ సీజన్‌లో ప్రణయ్ విశేషంగా రాణించాడు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం, ఆసియా క్రీడల్లో కాంస్య పతకం సాధించాడు. మలేసియా మాస్టర్స్ టోర్నీలో విజేతగా నిలిచిన ఈ కేరళ ప్లేయర్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచాడు.

గెలిచి నిలిచిన బోపన్న జోడీ



టురిన్ (ఇటలీ): పురుషుల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ ఏటీపీ ఫైనల్స్‌లో రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) సెమీఫైనల్ చేరే అవకాశాలను సజీవంగా నిలబెట్టుకుంది. రింకీ హిజికాటా–జేసన్ కుబ్లెర్ (ఆస్ట్రేలియా) జంటతో బుధవారం జరిగిన రెడ్ గ్రూప్ రెండో లీగ్ మ్యాచ్‌లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 6-4, 6-4తో గెలిచింది. ఈ విజయంతో 43 ఏళ్ల బోపన్న ఏటీపీ ఫైనల్స్ టోర్నీ చరిత్రలో మ్యాచ్ నెగ్గిన పెద్ద వయస్కుడిగా రికార్డు నెలకొల్పాడు. 70 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న, ఎబ్డెన్ 12 ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశారు. నాలుగు జోడీలు ఉన్న రెడ్ గ్రూప్‌లో రాజీవ్ రామ్ (అమెరికా)–జో సాలిస్‌బరీ (బ్రిటన్) ద్వయం వరుసగా రెండు మ్యాచ్‌ల్లో గెలిచి సెమీఫైనల్ బెర్త్‌ను దాదాపు ఖాయం చేసుకుంది. వెస్లీ కూలాఫ్ (నెదర్లాండ్స్)–నీల్ స్కుప్‌స్కీ (బ్రిటన్), బోపన్న–ఎబ్డెన్ జోడీలు చెరో విజయంతో సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నాయి. నేడు ఈ రెండు జోడీల మధ్య జరిగే చివరి లీగ్ మ్యాచ్ విజేత సెమీఫైనల్ చేరుకుంటుంది.

సెమీస్‌లో సినెర్

ఇదే టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో గ్రీన్ గ్రూప్ నుంచి యానిక్ సినెర్ (ఇటలీ) సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. ప్రపంచ నంబర్‌వన్ నొవాక్ జొకోవిచ్ (సెర్బియా) చివరిదైన మూడో లీగ్ మ్యాచ్‌లో 7-6 (7/1), 4-6, 6-1తో హుబెర్ట్ హుర్కాజ్ (పోలాండ్)ను ఓడించి సెమీఫైనల్ రేసులో నిలిచాడు. జొకోవిచ్‌తో మ్యాచ్‌లో హుర్కాజ్ ఒక సెట్ నెగ్గడంతో ఇప్పటికే రెండు మ్యాచ్‌ల్లో గెలిచిన సినెర్ గ్రీన్ గ్రూప్ నుంచి టాప్ లేదా రెండో స్థానంతో సెమీఫైనల్‌కు చేరుకోవడం ఖరారైంది. ఈ టోర్నీ చరిత్రలో సెమీఫైనల్ చేరిన తొలి ఇటలీ ప్లేయర్‌గా సినెర్ గుర్తింపు పొందాడు. సినెర్‌తో జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో హోల్గర్ రూనె (డెన్మార్క్) గెలిస్తే మాత్రం జొకోవిచ్ లీగ్ దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమిస్తాడు. సినెర్ విజయం సాధిస్తే జొకోవిచ్‌కు కూడా సెమీఫైనల్ బెర్త్ లభిస్తుంది. మరోవైపు రెడ్ గ్రూప్ నుంచి మెద్వెదెవ్ (రష్యా) సెమీఫైనల్లోకి ప్రవేశించాడు.

సౌరవ్ పరాజయం




న్యూఢిల్లీ: సింగపూర్ ఓపెన్ అంతర్జాతీయ స్క్వాష్ టోర్నమెంట్ నుంచి భారత స్టార్ సౌరవ్ ఘోషాల్ నిష్క్రమించాడు. సింగపూర్‌లో గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో సౌరవ్ 3-11, 7-11, 10-12తో నాలుగో సీడ్ ముస్తఫా అసల్ (ఈజిప్ట్) చేతిలో ఓడిపోయాడు. భారత్‌కే చెందిన మరో ప్లేయర్ రమిత్ టాండన్ 3-11, 2-11, 4-11తో రెండో సీడ్ డీగో ఇలియాస్ (పెరూ) చేతిలో పరాజయం పాలయ్యాడు. తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో సౌరవ్ 11-6, 7-11, 11-6, 11-5తో టాడీ హారిటి (అమెరికా)పై, రమిత్ 11-7, 12-10, 12-10తో రోరీ స్టీవర్ట్ (స్కాట్లాండ్)పై గెలుపొందారు.

'ఆ రికార్డు' కూడా కోహ్లికి సాధ్యమే!

సచిన్ 100 సెంచరీల ఘనతనూ అధిగమిస్తాడన్న రవిశాస్త్రి

ముంబై: అంతర్జాతీయ క్రికెట్లో సచిన్ టెండూల్కర్ నెలకొల్పిన 100 సెంచరీల రికార్డునూ బద్దలుకొట్టే సత్తా భారత బ్యాటింగ్ కింగ్ విరాట్ కోహ్లికి ఉందని భారత దిగ్గజం, మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి అన్నారు. ప్రస్తుతం విరాట్ 50వ శతకంతో వన్డేల్లో సచిన్ (49) సెంచరీల రికార్డును చెరిపేశాడు. ఓవరాల్‌గా చూస్తే టెస్టుల్లో 29, టి20ల్లో ఒక సెంచరీ కలుపుకుంటే 80 సెంచరీలతో ఉన్నాడు. దీనిపై ఓ ఇంటర్వ్యూలో శాస్త్రి మాట్లాడుతూ 'సచిన్ వంద సెంచరీలు చేసినపుడు ఇంతటి గొప్ప మైలురాయి దరిదాపుల్లోనే ఎవరూ రారని అనుకున్నాం. ఇప్పుడు కోహ్లి 80 దాకా వచ్చాడు. విరాట్‌లాంటి బ్యాటర్‌కు ఏదీ అసాధ్యం కాదు. శతక్కొట్టడం మొదలు పెడితే కొడుతూనే ఉంటారు. చూడండి అతని తదుపరి 10 ఇన్నింగ్స్‌ల్లో ఐదు సెంచరీలు గ్యారంటీ! పైగా తను మూడు ఫార్మాట్లు ఆడుతున్నాడు. ప్రతి ఫార్మాట్‌లోనూ అదే నిబద్ధత, అంకిత భావాన్ని కనబరుస్తున్నాడు. అతని కెరీర్‌లో ఇంకా మూణ్నాలుగేళ్ల ఆట మిగిలుంది. ఒత్తిడిని అధిగమించే సామర్థ్యం, పరిస్థితులకు అలవాటు పడే నైజం, అంతకుమించి పూర్తి ఫిట్‌నెస్ అతన్ని అసాధారణ క్రికెటర్‌గా నిలబెడుతోంది' అని అన్నారు.



తనెంత కీలకమో తనకే బాగా తెలుసు

భారత జట్టులో తన పాత్ర ఎంత కీలకమో... తన భుజాలపై ఎంతటి గురుతర బాధ్యతలున్నాయో కోహ్లికి బాగా తెలుసని కోచ్‌లెవరూ అతనికి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదని బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ వివరించారు. 'విరాట్ సన్నాహాలకు సాయమందిస్తాం. అంతేతప్ప కోచింగ్ పాఠాలు చెప్పాల్సిన పనేం రాదు. అతనికేమైనా కావాలంటే తనే వచ్చి అడుగుతాడు. ప్రాక్టీస్ అయినా... ఆటయినా అతనికే వదిలేస్తాం. ఎప్పుడు ఎలా ఆడాలో కోహ్లికే బాగా తెలుసు. నిజం చెప్పాలంటే ఎన్ని సెంచరీలు చేసినా, ఎన్ని మైలురాళ్లు దాటినా అతని పరుగుల ఆకలి తీరనే తీరదు. బౌలర్లలో షమీ పేస్ అద్భుతం. అందుకే అతను స్పెషల్ బౌలర్. అయినప్పటికీ ఆరంభంలో కొన్ని మ్యాచ్‌లకు పక్కనబెట్టడానికి కారణం జట్టు కాంబినేషనే తప్ప అతని సమర్థతపై ఏ సంకోచం లేదు' అని అన్నారు.



మా ఆయన దేవుడి కొడుకు...

కోహ్లి సతీమణి, బాలీవుడ్ స్టార్ అనుష్క శర్మ తన భర్త దేవుడి కొడుకని చెప్పుకొచ్చింది. 'దేవుడు ఉత్తమ స్క్రిప్ట్ రైటర్ కోహ్లి! నీ తలరాతను గొప్పగా రాశాడు. నీ ప్రేమను దక్కించుకున్న నేను దేవుడికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను. నిన్ను చూస్తుంటే, నీ ప్రదర్శనను గమనిస్తుంటే నాకనిపిస్తుంది. ఆడేకొద్దీ, పెరిగే కొద్దీ నీ సత్తా సామర్థ్యం పెరుగుతోంది. ఆటకోసం నిరంతరం నిజాయితీగా శ్రమించే నీవు నిజంగా దేవుడి బిడ్డవే' అని ఇన్‌స్టాగ్రామ్‌లో అనుష్క పోస్ట్ చేసింది.